
సత్యమేవ జయతే

సాక్షి


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17
సంచిక: 181

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అది హక్కు కాదు: వాన్స్

గ్రీన్‌కార్డు ఉన్నంత మాత్రాన అమెరికాలో ఉండేందుకు శాశ్వత హక్కులు దఖలు పడ్డట్టు కాదని ఉపాధ్యక్షుడు వాన్స్ అన్నారు.

వివరాలు 6లో ▸



'చిప్'ల కోసం ట్రంప్ స్కెచ్

చిప్‌ల రారాజుగా తైవాన్ తలపై ఉన్న కిరీటాన్ని తన్నుకుపోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద స్కెచ్ వేశారు.

వివరాలు 6లో ▸

సర్కారు మోసం..

మిర్చి రైతు హాహా 'కారం'

మద్దతు ధరపై ఊరించి ఉస్సూరుమనిపించిన కూటమి ప్రభుత్వం

పంట కొనుగోలుపై మొదటి నుంచీ మోసపూరిత వైఖరే

కేంద్రానికి లేఖల పేరిట తొలుత హంగామా

- కేంద్రమే కొంటుందంటూ హడావుడి
- ఆచరణకు వచ్చేసరికి చేతులెత్తేసిన వైనం
- ఇదేంటని ప్రశ్నిస్తే మద్దతు ధరకు మించి మార్కెట్ ధర ఉందంటూ ప్రచారం
- మరోవైపు మార్కెట్-మద్దతు ధరల మధ్య వ్యత్యాసం చెల్లిస్తామంటూ నాటకం
- రైతుల సమావేశం సాక్షిగా హామీ ఇచ్చి పట్టించుకోని సీఎం చంద్రబాబు
- నష్టానికే అమ్ముకుంటున్న రైతులు.. పైసా సాయం చేయని ప్రభుత్వం
- కనీసం బోనస్ అయినా ఇవ్వాలని కోరుతుంటే నోరెత్తని పాలకులు
- కూటమి నేతల మాటలు నమ్మి నిలువునా నష్టపోయిన రైతులు

2లో


గుంటూరు మిర్చి యార్డులో బస్తాలలో మిరపను నింపుతున్న కార్మికులు



అప్పులే మిగిలాయి

"3 ఎకరాల్లో మిరపసాగుకు ఎకరాకు రూ.75 వేలకుపైగా పెట్టుబడి పెట్టా. వైరస్ సోకి ఎకరాకు 8 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. మార్కెట్‌లో ధర లేదు. చివరికి క్వింటా రూ.9 వేలకు అమ్ముకున్నా. కనీస పెట్టుబడి కూడా మిగల్లేదు. అప్పులు మాత్రమే మిగిలిపోయాయి.

- అహ్మద్, కమాన్‌దొడ్డి, కొసిగి మండలం, కర్నూలు జిల్లా

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్ 2లో

దరఖాస్తుల స్వీకరణ



హోలీ.. రంగుల కేళి



రాష్ట్రవ్యాప్తంగా హోలి సంబరాలు శుక్రవారం అంబరాన్నంటాయి. వివిధ నగరాల్లో వీధులు రంగులతో నిండిపోయాయి. గేటెడ్ కమ్యూనిటీలు, హోటళ్లలో హోలీ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెయిన్ డాన్స్‌లతో యువతీయువకులు తడిసి ముద్దయ్యారు. వారి కేరింతలతో ఆనందాల నవ్వులు వెల్లివిరిశాయి. విశాఖలో ఆనందోత్సాహాల నడుమ హోలీ వేడుకలను యువత జరుపుకుంటున్న దృశ్యమిది.

పాలీగ్రాఫ్‌తో
పటాపంచలు

మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదంపై సర్కారు కట్టుకథలు.. ప్రధాన నిందితుడు గౌతమ్‌తేజ్‌కు పాలీగ్రాఫ్ పరీక్షతో వాస్తవాలు వెలుగులోకి

కీలక ప్రశ్నలకు జవాబులు రాబట్టిన ఏపీ ఎఫ్ఎస్ఎల్ అధికారులు

నిందితుడు నేరం చేసినట్లు నిర్ధారణ కాలేదని నివేదికలో వెల్లడి

2లో

పెరుగుతున్న
ఎండల తీవ్రత

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

సాధారణంకంటే 2, 3 డిగ్రీలు ఎక్కువ

ఈ వేసవిలో ఎండ తాకిడి ఎక్కువేనంటున్న వాతావరణ శాఖ

3లో

40 ఏళ్ల టీడీపీని
నిలబెట్టా

- జనసేన 12వ ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్
- నాన్న చెప్పినట్టు డిగ్రీ పూర్తి చేయలేకపోయా
- సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది.. హిందీ వద్దనే వారు సినిమాలను ఆ భాషలో డబ్ చేయొద్దు

3లో



సైబర్ నేరం.. నష్టం అపారం

దేశంలో సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసింది. హెల్ప్‌లైన్ నంబర్ 1930 అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విభాగం ద్వారా 2025 ఫిబ్రవరి 28 వరకు నమోదైన మొత్తం కేసులు 38,22,550. బాధితులు నష్టపోయింది రూ.36,448 కోట్లు. బాధితులకు వెనక్కు వచ్చింది రూ.6,051 కోట్లు. ఏపీలో నమోదైన కేసులు 1.13 లక్షలు కాగా, నష్టపోయిన మొత్తం రూ.1,559 కోట్లు.

రాష్ట్రం	కేసులు (లక్షల్లో)	నష్టం (రూ.కోట్లలో)
ఉత్తరప్రదేశ్	6.30	2,858
మహారాష్ట్ర	4.27	5,755
గుజరాత్	3.67	2,745
రాజస్థాన్	2.68	1,509
కర్ణాటక	2.52	4,151
తెలంగాణ	2.41	3,331
హరియాణ	2.12	1,492
ఢిల్లీ	2.05	1,943

ఆధారం: రాజ్యసభలో కేంద్ర హోం శాఖ

ఫైర్ లేని వాల్స్!

- హ్యాకర్ల దాడులకు గురైన దేశాల్లో మొదటిస్థానంలో భారత్
- ప్రపంచవ్యాప్త దాడుల్లో 13% ఇండియాలోనే..
- విద్యాసంస్థలు, ప్రభుత్వరంగ, ఆర్థికసేవల నెట్‌వర్క్‌లే లక్ష్యం
- హైటెక్ క్రైమ్ ట్రెండ్స్ రిపోర్ట్ 2025లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రతీ రంగంలో సాంకేతికత అత్యంత కీలకంగా మారింది. అదేస్థాయిలో సైబర్ దాడుల ముప్పు పొంచి ఉంటోంది. ఏదైనా సంస్థ నెట్‌వర్క్‌ను భద్రంగా ఉంచేందుకు పటిష్టమైన ఫైర్‌వాల్ రక్షణ వ్యవస్థ తప్పనిసరి. అయితే, హ్యాకర్ల దాడుల విషయంలో భారతీయ కంపెనీలకు చెందిన నెట్‌వర్క్‌లు బలహీనమని గ్రూప్–ఐబీ సంస్థ ఇటీవల విడుదల చేసిన హైటెక్ క్రైం ట్రెండ్స్ రిపోర్ట్–2025లో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 2024లో జరిగిన సైబర్ దాడుల్లో అత్యధికంగా 13 శాతం ఘటనలు భారత్‌లోనే జరిగినట్టు ఆ నివేదిక స్పష్టంచేసింది. ప్రధానంగా విద్యాసంస్థలకు సంబంధించిన నెట్‌వర్క్‌లపైనే హ్యాకర్లు దాడులకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత ప్రభుత్వరంగ సంస్థల నెట్‌వర్క్, మిలిటరీ, ఆర్థికసేవల సంస్థల నెట్‌వర్క్‌లు హ్యాకర్లకు లక్ష్యంగా మారుతున్నాయని పేర్కొంది. హ్యాకర్లు ఫైర్‌వాల్స్‌ను ఛేదించి సదరు నెట్‌వర్క్‌లోకి చొరబడి మొత్తం వ్యవస్థను తమ అధీనంలోకి తీసుకుని సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తున్నట్టు తెలిపింది.

డేటా లీకేజీలో అమెరికాది తొలిస్థానం

పబ్లిక్ డొమైన్‌లో ఉండే డేటా లీకేజీలో అమెరికా తొలిస్థానంలో ఉన్నట్టు నివేదిక తెలిపింది. 2024లో ఈ తరహా ఘటనలు అమెరికాలో 214 నమోదైనట్టు పేర్కొంది. తర్వాత స్థానంలో రష్యా (195 ఘటనలు) ఉండగా.. భారత్ (60) మూడో స్థానంలో నిలిచినట్టు గ్రూప్–ఐబీ నివేదిక పేర్కొంది. ఈ–మెయిల్ అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు ఈ డేటా లీకేజీలో ఉంటున్నాయి. 2024లో ఈ–మెయిల్ అడ్రస్‌లు, పాస్‌వర్డ్‌లను డార్క్‌వెబ్‌లో విక్రయించడం ద్వారానే సైబర్ నేరగాళ్లు రూ.248.9 కోట్లు కొల్లగొట్టారు.

ఫైర్‌వాల్స్ అంటే?

అనధికారికంగా నెట్‌వర్క్‌లోకి చొరబడకుండా, హానికరమైన డేటాను నెట్‌వర్క్‌లోకి చొప్పించకుండా రక్షించే భద్రతా పరికరమే ఫైర్‌వాల్. ఇది హార్డ్‌వేర్ లేదా సాఫ్ట్‌వేర్ కావొచ్చు. నెట్‌వర్క్ ప్యాకెట్‌లను పరిశీలించి వాటిని అనుమతించాలా లేదా నిరోధించాలా అనే దాన్ని ఫైర్‌వాల్ నిర్ణయిస్తుంది. ఫైర్‌వాల్స్ ఇంటర్నెట్ ద్వారా కంప్యూటర్ లేదా నెట్‌వర్క్‌ను యాక్సెస్ చేయకుండా హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను నిరోధించగలవు.

2024లో అత్యధికంగా హ్యాకింగ్‌కు గురైన దేశాలివీ.. (దాడుల శాతం)

దేశం	శాతం
భారత్	13
ఇజ్రాయెల్	7
రష్యా	4
ఇండోనేషియా	3.5
ఉక్రెయిన్	3.5



2024లో డార్క్‌వెబ్‌లో విక్రయించిన ఘటనలు ఎక్కువగా నమోదైన దేశాలు

దేశం	ఘటనలు
అమెరికా	214
రష్యా	195
భారత్	60
ఇండోనేషియా	29
బ్రెజిల్	27
ఫ్రాన్స్	27



ఇల్లు వద్దు.. అప్పు అసలే వద్దు

గతేడాదితో పోలిస్తే తగ్గిపోయిన వ్యక్తిగత గృహ రుణాల విడుదల

- 2023–24 మార్చి–సెప్టెంబర్ కాలంలో రూ.16,033 కోట్ల రుణాలిచ్చిన బ్యాంకులు
- 2024–25లో అదే కాలానికి రూ.15,831 కోట్లకు పరిమితం
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ పాలనలో పురోభివృద్ధిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలు.. గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తిరోగమనంలో ఉన్నట్లు వ్యక్తిగత గృహ రుణాలు తేటతెల్లం చేస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాలు, చర్యల కారణంగా వ్యక్తిగత గృహ రుణాలు తగ్గిపోయాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్వయంప్రతిపత్తి సంస్థ నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా గృహ రుణాల్లో 14 శాతం వృద్ధి నమోదైతే.. మన రాష్ట్రంలో మాత్రం క్షీణించినట్లు ఎన్‌హెచ్‌బీ 2024 నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల (ఏప్రిల్–సెప్టెంబర్) కాలంలో వివిధ బ్యాంకులు విడుదల చేసిన వ్యక్తిగత గృహ రుణాల విలువ రూ.15,831 కోట్లకు పడిపోయింది. అంతకుముందు ఏడాది ఇదే సమయంలో బ్యాంకులు విడుదల చేసిన రుణాల మొత్తం రూ.16,033 కోట్లు. అంటే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రుణాల విలువ రూ.202కోట్లు తక్కువ. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు మంజూరైన గృహ రుణాల విలువ అంతకుముందు ఏడాదితో పోలిస్తే 14శాతం పెరిగి రూ.33.53 లక్షల కోట్లకు చేరింది. సెప్టెంబర్ 2024 నాటికి రాష్ట్రంలో ఔట్‌స్టాండింగ్ రుణాల విలువ రూ.4,10,416 కోట్లుగా ఉన్నట్లు ఎన్‌హెచ్‌బీ నివేదికలో పేర్కొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక వాణిజ్య కార్యకలాపాలు నెమ్మదించాయనడానికి బ్యాంకుల రుణ మంజూరు తగ్గడం, జీఎస్టీ వసూళ్లు క్షీణించడం నిదర్శనమని ఆర్థికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

సొంతింటి కలలో ప్రాంతీయ అసమానతలు

దేశంలో గృహ రుణాల మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను ఈ నివేదిక ఎత్తి చూపింది. మొత్తం గృహ రుణాల్లో దక్షిణాది రాష్ట్రాలు 35.31 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా, 30.73 శాతంతో పశ్చిమ రాష్ట్రాలు, 25.56 శాతంతో ఉత్తరాది రాష్ట్రాలు తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో వ్యక్తిగత గృహ రుణాల వాటా కేవలం 0.93 శాతమేనని తెలిపింది. తూర్పు రాష్ట్రాల వాటా 6.10 శాతంగా ఉంది.

క్లుప్తంగా...

జూలో ఆడ చిరుత 'సుధ' మృతి



ఆరిలోవ (విశాఖ): ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో ఓ ఆడ చిరుత ఈనెల 13వ తేదీ రాత్రి మృతి చెందింది. జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపిన వివరాలు ప్రకారం.. సుమారు 20 ఏళ్ల వయసుగల సుధ అనే ఆడ చిరుత వృద్ధాప్యం కారణంగా కొద్ది రోజులుగా నీరసించి మృతి చెందింది. జూ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వృద్ధాప్యం కారణంగా మయోకార్డియల్ ఇన్‌ఫార్డన్‌తో బాధపడుతూ మృతి చెందినట్లు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. అటవీశాఖ అధికారులు దీన్ని 2008లో తిమ్మపురం ప్రాంతం రుషికొండ రిజర్వ్‌డ్ ఫారెస్ట్ నుంచి రెస్క్యూ చేసి జూకి అప్పగించారు. అప్పటి నుంచి ఇది జూలో సందర్శకులను అలరిస్తుండేది. దీని మృతితో ప్రస్తుతం జూలో చిరుతల సంఖ్య రెండుకు పడిపోయింది.

శ్రీ సీతారాముల కల్యాణ పనులు ఆరంభం

- తలంబ్రాల తయారీ, పసుపు దంచడంతో పెళ్లికళ



ఉత్తర ద్వారం వద్ద రోలు, రోకలికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

భద్రాచలం: రెండు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం.. ఓ పక్క తలంబ్రాల తయారీలో మహిళల ఆనందోత్సవాలు.. మరోపక్క వసంతోత్సవంతో ఫాల్గుణ పౌర్ణమి రోజైన శుక్రవారం భద్రగిరి సందడిగా మారింది. శ్రీరామనవమికి భద్రాచలంలో జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి పౌర్ణమి రోజు సంప్రదాయ బద్ధంగా పసుపు కొమ్ములు దంచడం ఆనవాయితీగా వస్తోంది. రెండేళ్లుగా ఈ కార్యక్రమంలో భక్తులను భాగస్వాములను చేస్తుండగా ఈసారి కూడా మిథిలా స్టేడియం, వైకుంఠ ద్వారం వద్ద కార్యక్రమం చేపట్టారు. తొలుత పల్లకీసేవగా స్వామి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చాక అర్చకులు, పండితులు స్వామి వారితో పాటు రోళ్లు, రోకళ్లకు పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రమాదేవి, అర్చకుల, పండితుల సతీమణులతో పసుపు కొమ్ములు దంచడంతో పాటు బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులామ్, సుగంధద్రవ్యాలు కలిపి తలంబ్రాలు సిద్ధం చేశారు. అలాగే బేడా మండపంలో ఊయలపై శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను ఆశీనులను చేసి శ్రీసీతారాములపై రంగులు చల్లి వసంతోత్సవాన్ని ప్రారంభించారు.

భద్రాచలం ఆలయం యాప్ ప్రారంభం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఇకపై భక్తులు ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు. దేవస్థానం అధికారుల వివరాలు, పూజలు, వసతులు, టికెట్ల సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉండగా, మరింత చేరువ చేసేందుకు మొబైల్ యాప్ రూపొందించారు. ఈ యాప్‌ను దేవస్థానం ఈవో రమాదేవి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.

పాలీగ్రాఫ్‌తో పటాపంచలు

మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదంపై సర్కారు కట్టుకథలు

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా): మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటనకు సంబంధించి నిప్పు లాంటి నిజాలు బయటకొస్తున్నాయి. గతేడాది జూలై 21వ తేదీ రాత్రి అగ్ని ప్రమాదం జరిగితే.. ఫైళ్లు దగ్ధం చేశారంటూ సీఎం చంద్రబాబు సర్కారు చేసిన ప్రచారంలో నిజం లేదని తేలిపోయింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జి.గౌతమ్‌తేజ్‌కు నిర్వహించిన పాలీగ్రాఫ్ పరీక్షలో నేర నిరూపణ నిర్ధారణ కాలేదని నివేదికలో వెల్లడైంది. అతడే నేరం చేశాడని నిరూపించలేమని అందులో పేర్కొన్నారు. దీంతో ఇదంతా కావాలని చేసిన సంఘటనగా ప్రభుత్వ వ్యవస్థలతో చిత్రీకరించేందుకు కూటమి సర్కారు పన్నిన కుట్రలు బెడిసికొట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై వరుసగా అఘాయిత్యాలు జరుగుతున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరించిన కూటమి ప్రభుత్వం మదనపల్లె ఘటనలో మాత్రం డీజీపీ, సీఐడీ చీఫ్‌లను ఆగమేఘాలపై హెలికాప్టర్‌లో ఘటనాస్థలానికి పంపి ఏదో జరిగిపోయిందంటూ హంగామా చేసింది. గౌతమ్‌తోపాటు అప్పటి ఆర్డీవో మురళి, మరికొందరు కలసి కార్యాలయానికి నిప్పు పెట్టారని, భూములకు సంబంధించిన ఫైళ్లను దహనం చేశారంటూ ఆరోపించింది. ఈ ఘటనపై తొలుత అగ్ని ప్రమాదంగా కేసు నమోదు చేసిన పోలీసులు అనంతరం ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో సెక్షన్లు, కేసు దర్యాప్తు తీరును మార్చేశారు.



మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంటలు (ఫైల్)

నాలుగు ప్రశ్నలు..

ఈ కేసు మొత్తం గౌతమ్‌తేజ్ చుట్టూ తిరిగింది. కుట్ర కోణం ఉందనే అనుమానంతో సీఐడీ అధికారులు పాలీగ్రాఫ్ పరీక్షలు చేయించారు. తెరవెనుక ఎవరైనా ఉన్నారా? ఎవరి పాత్ర ఏమిటి? అనే వాటిని వెలుగులోకి తేవాలని భావించారు. ఓ కేసుకు సంబంధించి వాస్తవాలను వెలుగులోకి తేవడం కోసం కీలకమైన పాలీగ్రాఫ్ పరీక్షను అత్యంత పటిష్టంగా నిర్వహిస్తారు. సీఐడీ అధికారుల వినతి మేరకు 2024 నవంబర్ 26, 27వ తేదీల్లో అమరావతి ఏపీఎఫ్ఎస్ఎల్ అధికారులు నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్షలను నిర్వహించారు. సాంకేతికంగా నిజాలను రాబట్టేందుకు గౌతమ్‌తేజ్‌కు నాలుగు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది.

అగ్నిప్రమాదం జరిగిందని డిప్యూటీ తహసీల్దార్ తపస్విని ఫోన్ చేసి చెప్పడానికి ముందే మీకు తెలుసా..?
సెక్షన్‌లో నిప్పు పెట్టింది మీరేనా?
కార్యాలయంలో ప్రమాదం సృష్టించడానికి ఎవరితోనైనా కలసి ఇలా చేశారా?
అగ్ని ప్రమాదానికి కారణాలను దాచి పెడుతున్నారా?

అనే నాలుగు ప్రశ్నలకు 'కాదు..' అని గౌతమ్‌తేజ్ సమాధానం చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

దీంతో ప్రమాదంలో కుట్ర కోణం లేదని, తెర వెనుక ఎవరి ప్రమేయం లేదని, ఇందులో భూముల వ్యవహారం కూడా లేదని తేలిపోయింది. అరెస్టు సమయంలో గౌతమ్‌తేజ్ నుంచి సేకరించిన వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలు మినహా ఈ కేసులో నేర నిరూపణకు ఇతర ఆధారాలేవీ లేవని అతడికి బెయిల్ మంజూరు సమయంలో న్యాయస్థానం సైతం పేర్కొంది.

వ్యవస్థలతో దుష్ప్రచారం..

మదనపల్లె ఫైల్స్ వ్యవహారంలో సీఎం చంద్రబాబు పదేపదే అబద్ధాలు వల్లె వేశారు. ప్రమాదం జరిగిన మర్నాడు నాటి డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌లను హెలికాప్టర్‌లో మదనపల్లెకు హుటాహుటిన పంపారు. కనీసం దర్యాప్తు కూడా జరగక ముందే ఇది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్ అని నాడు డీజీపీ మీడియాతో వ్యాఖ్యానించారు. ఆ తర్వాత సెక్షన్లను మార్చడంతో కేసు దర్యాప్తు తీరు పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి కేసుల నమోదుతో వేధింపులకు గురిచేశారు. ఎఫ్ఐఆర్ కాపీలు సైతం వెబ్‌సైట్‌లో మాయం చేశారు. ఇక రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి సిసోడియా ఏకంగా మదనపల్లెలో మకాం వేసి అణువణువూ గాలించినా ఫలితం శూన్యం. వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులు, ఉద్యోగులు, అధికారులను సీఐడీ రోజుల తరబడి విచారించింది. సీఐడీతోపాటు రెవెన్యూ, పోలీసు, ఫైర్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులను మదనపల్లెలో మోహరించింది.

పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షగట్టి విష ప్రచారం..

ఈ అగ్ని ప్రమాదం ఘటనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి ఆపాదిస్తూ కూటమి ప్రభుత్వం, టీడీపీ నేతలు పదేపదే విష ప్రచారం చేశారు. మదనపల్లెలో ప్రభుత్వ భూములను దోచుకున్నారంటూ తప్పుడు ఆరోపణలతో బురద చల్లారు. ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేకున్నా మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా, పెద్దిరెడ్డి మద్దతుదారులను అక్రమ కేసులతో వేధించారు. ప్రభుత్వం పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఎల్లో మీడియా దీనికి వంత పాడింది. అదిగో పులి అంటే.. ఇదిగో తోక! అంటూ తప్పుడు కథనాలను వండి వార్చింది. పచ్చ మీడియాలో ఏది రాస్తే పోలీసులు దాన్నే పాటించారు. విషపూరిత కథనాలను ప్రచురించిన రోజే నేతల నివాసాల్లో సోదాలు జరిగేవి.

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

దరఖాస్తుల స్వీకరణ

మే 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు

సెట్ చైర్మన్ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడి



బాలాజీచెరువు(కాకినాడ సిటీ): ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఈఏపీ సెట్–25 షెడ్యూల్‌ను సెట్ చైర్మన్, జేఎన్‌టీయూ–కాకినాడ వైస్ చాన్సలర్ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... శనివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఓసీ విద్యార్థులు రూ.600, బీసీ విద్యార్థులు రూ.550, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.500 చొప్పున ఫీజు చెల్లించి ఏప్రిల్ 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.1,000 ఆలస్య రుసుముతో మే ఒకటో తేదీ వరకు, రూ.2వేల రుసుముతో మే 7 వరకు, రూ.4వేల రుసుముతో మే 12 వరకు, రూ.10వేల రుసుముతో మే 16 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు మే 19, 20 తేదీల్లో, ఇంజినీరింగ్ విభాగానికి మే 21 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 47, హైదరాబాద్‌లో ఒకటి, సికింద్రాబాద్‌లో ఒకటి చొప్పున పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఆయా రోజుల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయి. మే 12 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏపీఈఏపీ సెట్–25 కన్వీనర్‌గా ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు వ్యవహరిస్తారు. విద్యార్థులకు సందేహాలు ఉంటే 0884–2359599, 0884–2342499 నంబర్లలో సంప్రదించాలి.

సర్కారు మోసం..

మిర్చి రైతు హాహా'కారం'



ఈయన పేరు కన్నెబోయిన బాలసాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వాదంపల్లి స్వగ్రామం. తనకున్న మూడెకరాల్లో తేజ రకం మిర్చి సాగు చేశారు. ఎకరాకు రూ.1.75 లక్షలు ఖర్చయ్యింది. గతేడాది ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఈ ఏడాది తెగుళ్లు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో 15 క్వింటాళ్ల లోపే వచ్చింది. సగానికి పైగా తాలు. గత సీజన్‌లో క్వింటా రూ.23వేల నుంచి రూ.27 వేల మధ్య పలికిన తేజ రకం కాయలు నేడు రూ.11వేల నుంచి రూ.12 వేల మధ్య పలుకుతున్నాయి. తాలు రకానికి గత సీజన్‌లో క్వింటాకు రూ.17 వేలు ధర వస్తే ఈ ఏడాది రూ.5 వేలు కూడా దక్కలేదు. 'గత నెల మొదటి వారంలో 40 బస్తాలు గుంటూరు యార్డుకు తీసుకొస్తే క్వింటాకు రూ.15 వేలు ధర వస్తే నేడు 50 బస్తాలు తెస్తే క్వింటా రూ.11 వేలు ఇస్తామంటున్నారు. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.11,781గా ప్రకటించిన తర్వాత ధరలు మరింత పతనమయ్యాయి. రైతులను పట్టించుకునే నాథుడే లేడు. మిర్చి పంట అమ్ముకోవాలంటే భయం వేస్తోంది. ఇళ్ల వద్ద కూలీలతోపాటు ఎరువులు, మందుల షాపుల వారు కాచుకుని కూర్చున్నారు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. క్వింటాకు రూ.20 వేలు ధర పలికితే పెట్టుబడి వస్తుంది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం' అని బాలసాయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చిని కుప్ప వేస్తున్న కూలీలు



సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: మిరప రైతుల నెత్తిన టీడీపీ కూటమి ప్రభుత్వం కుచ్చుటోపి పెట్టింది. మద్దతు ధర పేరిట ఊరించి ఊహల పల్లకిలో ఊరేగించి నిలువునా ముంచేసింది. మద్దతు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసానికితోడు రైతుల ఖాతాకు జమ చేస్తామని కొంతకాలం, బోనస్ ఇచ్చే ఆలోచన చేస్తున్నామంటూ మరికొంత కాలం నానిచ్చింది. ఇప్పుడు మార్కెట్‌లో ధరలు ఎగబాకిపోతున్నందున ఇక మద్దతు ధర ఇవ్వాల్సిన అవసరం లేదంటూ తేల్చి చెబుతోంది. మరి నష్టానికి అమ్ముకుంటున్న రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వ పెద్దల నోరు పెగలడం లేదు. బోనస్ విషయంలో చేతులెత్తేశారు. తేజ రకం తప్ప మిగిలిన రకాలన్నీ నేటికీ మద్దతు ధర కంటే తక్కువగానే పలుకుతున్నాయి. అయినా సరే ధరలు ఎగబాకిపోతున్నాయంటూ అసెంబ్లీ సాక్షిగా మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీ పడుతూ అబద్ధాలు వల్లె వేస్తున్నారు. విదేశాలకు ఎగుమతుల ఆర్డర్లు తగ్గడంతో పంట మార్కెట్‌కు వచ్చే సమయంలోనే ధరల పతనం మొదలైంది. మరోవైపు ధరలు మరింత తగ్గుతాయన్న ఆలోచనతో మసాలా కంపెనీలు కూడా కొనుగోలు నిలిపివేశాయి. ఇదే విషయమై ఓ వైపు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం హెచ్చరికలు చేసినా, మార్కెటింగ్ శాఖ ముందుగానే గుర్తించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రంగంలోకి దిగి మిర్చి యార్డుకు వెళ్లి మిరప రైతులకు బాసటగా నిలవడంతో కూటమి పెద్దలు నానా హంగామా చేశారు. చేతిలో ఉన్న మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి ఆదుకోవల్సింది పోయి కేంద్రానికి లేఖలు రాశామని, సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రితో భేటీ అయ్యారని.. మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రం దిగివచ్చేసిందంటూ ఊదరగొట్టారు.

కేంద్రంపై భారం మోపి.. చేతులెత్తేశారు

దిగుబడుల్లో కనీసం 30 శాతం (3 లక్షల టన్నులపైన) పంట సేకరిస్తే రూ.3,480 కోట్లు ఖర్చవుతుందని.. ఆ భారం కేంద్రమే భరించేలా ఒప్పిస్తామంటూ తొలుత రాష్ట్ర ప్రభుత్వం నమ్మబలికింది. ఆ తర్వాత మార్కెట్ ధర, మద్దతు ధర మధ్య వ్యత్యాసంలో 50 శాతం (మిగతా 50 శాతం కేంద్రం) భరించేలా ఫిబ్రవరి మూడో వారంలో ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున 25 శాతం (2.9 లక్షల టన్నులు) పంటకు రూ.846.15 కోట్లు, 50 శాతం (5.83 లక్షల టన్నులు) పంట కొనుగోలుకు రూ.1,692.31 కోట్లు, 75 శాతానికి (8.75 లక్షల టన్నులు) రూ.2,538.46 కోట్లు ఖర్చవుతుందని అధికారులు రెండోసారి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలు కేంద్రానికి పంపి చేతులు దులిపేసుకున్నారు. రూ.11,781 చొప్పున కేంద్రం కొంటుందంటూ కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని గొప్పగా ప్రకటించారు.

అన్నీ తెలిసి దొంగ నాటకాలు

సీఎం చంద్రబాబు మిర్చి రైతులు, ఎగుమతిదారులు, వ్యాపారులతో గత నెల 21న ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు శుభవార్త చెబుతారని రైతులు ఎంతగానో ఆశగా ఎదురు చూశారు. 25 శాతానికి మించి కేంద్రం కొనుగోలు చేసే పరిస్థితులు కన్పించడం లేదంటూ తేల్చి చెప్పేశారు. వాస్తవానికి మద్దతు ధర పెంచాలన్నా, 25 శాతానికి మించి కొనుగోలు చేయాలన్నా, కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేయాల్సిందే. నాటి భేటీలో వారం పది రోజుల్లో మరోసారి భేటీ అయ్యి తాము నిర్దేశించిన మద్దతు ధర రూ.11,781 కంటే తక్కువగా ఉంటే అప్పుడు ఆలోచిద్దామని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఈ ప్రకటన చేసి మూడు వారాలు దాటినా మళ్లీ ఆ ఊసెత్తడం లేదు.


ధరలు పెరిగిపోయాయంటూ అబద్ధాలు

మద్దతు–మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం చెల్లిస్తామంటూ హంగామా చేశారు. ఆ మేరకు యార్డులో మిర్చి విక్రయించిన రైతుల వివరాలను సేకరించిన ప్రభుత్వం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోంది. పైగా ఈ హడావుడి తర్వాత మార్కెట్‌లో ధరలు పెరిగిపోతున్నాయంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా పోటీపడి స్టేట్‌మెంట్లు ఇస్తూ సమస్యను నీరుగార్చేస్తున్నారు. వాస్తవానికి గురువారం మిర్చి యార్డులో తేజ రకానికి మాత్రమే గరిష్టంగా రూ.14 వేలు, కనిష్టంగా రూ.5,500 పలికింది. తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు ఎంతో కొంత బోనస్ ప్రకటించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సాగు, దిగుబడి లెక్కలివి..

రాష్ట్రంలో 2023–24 సీజన్‌లో 6 లక్షల ఎకరాలకు పైగా మిరప సాగైంది. 14.50 లక్షల టన్నులకుపైగా దిగుబడులొచ్చాయి. అలాంటిది 2024–25లో వరుస వైపరీత్యాలకు తోడు ప్రభుత్వ నిర్వాకంతో కేవలం 3.95 లక్షల ఎకరాల్లో మాత్రమే మిరప సాగైంది. దిగుబడి 11 లక్షల టన్నులొస్తాయని అంచనా వేయగా, క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కన్పించడం లేదు. మరోపక్క గుంటూరు మార్కెట్ యార్డుకు ఈ ఏడాది 4.76 లక్షల టన్నులు మిరప వస్తుందని అంచనా వేయగా, జనవరిలో 61 వేల టన్నులు, ఫిబ్రవరిలో 1.10 లక్షల టన్నులు రాగా, ఈ నెలలో ఇప్పటి వరకు 1.09 లక్షల టన్నులొచ్చాయి. ఈ నెలలో మరో లక్ష టన్నులు, ఏప్రిల్‌లో 65 వేల టన్నులు, మేలో 30 వేల టన్నులు మార్కెట్‌కు వస్తాయని అంచనా.

ఈ దుస్థితి ఏనాడు లేదు



దశాబ్దాలుగా మిర్చి పంటను పండిస్తున్నా. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. కాయలు కోత కోద్దామంటే కూలీలు వచ్చే పరిస్థితి లేదు. గత సీజన్‌లో కిలో ఎండు మిర్చి తీతకు రూ.10 ఇస్తే, ఈ ఏడాది రూ.25 ఉంది. గతేడాది తేజ రకం మిర్చి క్వింటా రూ.20 వేలకు పైగా అమ్మితే ఈ ఏడాది రూ.10 వేలకు మించి కొనడం లేదు. విచిత్రంగా మిర్చి ధర తగ్గి కూలీల ధర పెరగటం దారుణం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.11,781 దేనికీ సరిపోదు.

– దొండపాటి అంజయ్య, అడిగొప్పుల, పల్నాడు జిల్లా



సేంద్రియ ఎగుమతులు తగ్గాయ్

దేశంలో సేంద్రియ ఉత్పత్తుల ఎగుమతులు 2020-21 నుంచి భారీగా తగ్గాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ సేంద్రియ ఉత్పత్తుల కార్యక్రమం (ఎన్‌పీఓపీ) కింద వీటి ఎగుమతులను ప్రోత్సహిస్తోంది. కానీ, 5 ఏళ్ల కింద గరిష్ఠంగా రూ.7,078 కోట్ల విలువైన 8.88 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను మనదేశం ఎగుమతి చేసింది. ఆ తరవాత ఈ ఎగుమతులు క్రమంగా తగ్గుతూ వచ్చాయి.

సంవత్సరం	ఎగుమతుల పరిమాణం (లక్షల టన్నుల్లో)	విలువ (రూ.కోట్లల్లో)
2019-20	6.39	4,685
2020-21	8.88	7078
2021-22	4.60	5,249
2022-23	3.13	5,525
2023-24	2.61	4,008
2024-25	3.40	4,966
(28-02-25 వరకు)		

ఆధారం: లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం

సహజ వనరుల దోపిడీకి ఖాకీ కవచం!

కోర్టు స్టేలో ఉన్న ఇరువూరు రీచ్ నుంచి ఇసుక అక్రమంగా తరలింపు

- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణా
- తిరునాళ్లలో ట్రాఫిక్ క్లియర్ చేసి మరీ అక్రమ రవాణా వాహనాలను పంపేసిన ఎస్సై

సాక్షి టాస్క్‌ఫోర్స్: సర్వేపల్లి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో సహజ వనరుల దోపిడీ మూడు ఇసుక లారీలు.. ఆరు గ్రావెల్ వాహనాలు అనే రీతిలో విచ్చలవిడిగా సాగుతోంది. దీన్ని అరికట్టాల్సిన పోలీసులు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమాలకు సహకారం అందిస్తున్నారు. పొదలకూరు మండలం ఇరువూరు రీచ్ నుంచి రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిశిరాత్రి భారీ యంత్రాలు ఉపయోగించి పెన్నా నదిలో తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాల్లో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాకు స్థానిక షాడో ఎమ్మెల్యే సహకారంతోపాటు పోలీస్ శాఖ అండగా ఉండడంతో అక్రమార్కులు బరి తెగించి వ్యవహరిస్తున్నారు.

కోర్టు స్టేలో ఉన్న రీచ్ నుంచి..

పొదలకూరు మండలం ఇరువూరు రీచ్ కోర్టు స్టే పరిధిలో ఉంది. అక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టవద్దన్న న్యాయస్థానం ఆదేశాలను లెక్క చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధి ఈ రీచ్‌ను ఓ ఇసుకాసురుడికి అనధికారికంగా అప్పగించారు. పగలు రాత్రి తేడా లేకుండా నదిలో భారీ యంత్రాలు ఉంచి లోడింగ్ చేస్తున్నారు. 30 టన్నుల సామర్థ్యం ఉన్న 50 టిప్పర్ల ద్వారా నిత్యం ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో వాహనానికి రూ.10 వేలు వంతున వసూలు చేస్తున్నారు. కోర్టు స్టే పరిధిలో ఉన్న రీచ్‌లో ఇసుక లూటీ జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది.

వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇతర రాష్ట్రాలకు తరలింపు..

ఇరువూరు రీచ్ నుంచి ఇసుకను రాత్రి వేళ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. పెన్నా నది ఇసుకకు తమిళనాడు, బెంగళూరుతోపాటు తిరుపతి జిల్లాలో ఉన్న శ్రీసిటీ డిమాండ్ ఉంది. అక్కడ ఇసుక టన్ను రూ.3 వేలు వరకు పలుకుతోంది. హైవే పోలీస్‌స్టేషన్లు, రవాణా శాఖ, విజిలెన్స్, మైనింగ్ శాఖ అధికారులకు నెలవారీ మామూళ్లు చెల్లిస్తూ అక్రమ రవాణా చేస్తున్నారు. ఇరువూరు రీచ్ నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక వాహనాలను జిల్లా మైనింగ్ అధికారి బాలాజీ నాయక్ ఇటీవల పట్టుకున్నారు. దాదాపు 20 వాహనాల్లో ఇసుక లోడింగ్ చేసి తరలిస్తుండగా స్థానిక పోలీసులు సహకారం అందించపోవడంతో రెండు టిప్పర్లు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ఆయనపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వారం వరకు అక్రమ రవాణాకు తాత్కాలికంగా తెరపడినా మళ్లీ ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.


అర్ధరాత్రి తరలి వెళుతున్న ఇసుక లారీలు


లారీల కోసం ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ ఫోన్లో మాట్లాడుతున్న ఎస్సై

ట్రాఫిక్ క్లియర్ చేసి లారీలను పంపేసిన ఎస్సై..

కోర్టు స్టే పరిధిలో ఉన్న ఇరువూరు రీచ్, గొల్లకందుకూరు తిప్ప నుంచి అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలిస్తున్న లారీలు గురువారం రాత్రి పొదలకూరు మండలం తాటిపర్తిలో శ్రీరుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల వేడుకలు జరుగుతున్న ప్రాంతానికి భారీగా చేరుకున్నాయి. ఈ సమయంలో అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్సై హనీఫ్ వాటిని నిలువరించగా స్థానిక ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ కాల్ రావడంతో చేసేది లేక అప్పటికప్పుడు రోడ్డుపై ట్రాఫిక్‌ను క్లియర్ చేసి లారీలను పొదలకూరు వైపు పంపారు. ఈ ఘటనను కొందరు సెల్ ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసులే ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాకు కొమ్ముకాస్తూ దగ్గరుండి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి పంపటంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

నెల్లూరు రూరల్‌లో గ్రావెల్..

నెల్లూరు రూరల్ నియోజకవర్గం గొల్లకందుకూరు తిప్పను గ్రావెల్ మాఫియా పీల్చి పిప్పి చేస్తోంది. రాత్రి వేళ భారీ యంత్రాలు ఉపయోగించి నిత్యం పదుల సంఖ్యలో పొదలకూరు, నెల్లూరు రూరల్ పరిధిలోని లే అవుట్‌లకు గ్రావెల్ తరలిస్తున్నారు. గ్రావెల్‌కు డిమాండ్ ఉండడంతో స్థానిక ప్రజాప్రతినిధుల అండతో అధికార పార్టీ నేతలు బరి తెగిస్తున్నారు. రోజూ దాదాపు 40 టిప్పర్లతో అక్రమ రవాణా సాగిస్తున్నారు.

అత్తమామలపై కోడలు పైశాచికం

ఇద్దరి పిల్లలతో కలిసి బెంగళూరులో ఓ డాక్టర్ దారుణం


అత్తమామలపై దాడిచేస్తున్న ప్రియదర్శిని

యశవంతపుర: బెంగళూరులోని ఓ వైద్యురాలు తన ఇద్దరు పిల్లలతో కలిసి వృద్ధులైన అత్త మామలపై విచక్షణారహితంగా దాడిచేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రియదర్శిని, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈనెల 10వ తేదీ రాత్రి తన అత్త మామలపై పైశాచికంగా దాడిచేశారు. ఈ వీడియో చూసి నెటిజన్లు భగ్గుమన్నారు.. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ 'ఎక్స్'లో డిమాండ్ చేస్తూ ఈ పోస్టును బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌కు ట్యాగ్ చేశారు. బాధిత వృద్ధుడు జె.నరసింహయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రియదర్శినిపై కేసు నమోదు చేశారు. తన కొడుకు నవీన్‌కుమార్, కోడలు ప్రియదర్శిని విడాకులు తీసుకోడానికి 2007లో ఫ్యామిలీ కోర్టులో కేసు వేశారని.. కేసు చివరి దశకు చేరుకున్న సమయంలో ఆమె ఈ దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో వివరించారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు బెయిల్ మంజూరు

గుంటూరు లీగల్: ఈ నెల 12వ తేదీన గుంటూరు నగరంలో జరిగిన యువత పోరులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై వైఎస్సార్ సీపీకి చెందిన నూనె ఉమామహేశ్వర్ రెడ్డి, మరో ముగ్గురు కార్యకర్తలను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎదుట శుక్రవారం హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్,డిఫెన్స్ న్యాయవాదుల వాదోపవాదనలు వినిపించగా.. రూ.10 వేల ష్యూరిటీ బాండ్స్ ఒకరికి రెండు చొప్పున, ఈనెల 19వ తేదీ లోపు కోర్టుకు సమర్పించాలని పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. అంతేకాక వారంలో ఆదివారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేయాలని, రెండు నెలల వరకు ఈ నిబంధన వర్తిస్తుందని తీర్పు వెలువరించారు. తదుపరి ఈ కేసు విచారణకు రానున్నట్లు వెల్లడించారు.

టీడీఆర్ బాండ్ల జారీకి 50 రోజులే గడువు

పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నగర పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను దరఖాస్తు చేసుకున్న 50 రోజుల్లోగా జారీ చేయాలని నిర్దేశించినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీడీఆర్ బాండ్ల కోసం చేసుకున్న దరఖాస్తును మున్సిపల్ కమిషనర్ 15 రోజుల్లోగా పరిశీలన కమిటీ ముందుకు పెట్టాలని.. 15 రోజుల్లోగా ఆ కమిటీ అభ్యంతరాలు పరిశీలించాలన్నారు. ఆ తర్వాత నాలుగు రోజుల్లోగా వార్తాపత్రికలో నోటిఫికేషన్ ఇచ్చి.. అభ్యంతరాల స్వీకరణకు ఏడు రోజులు గడువు ఇవ్వాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను నాలుగు రోజుల్లోగా క్రోడీకరించి.. వారం రోజుల్లోగా స్క్రూటినీ కమిటీ ముందు పెట్టాలన్నారు. ఆ తర్వాత ఆరు రోజుల్లోగా గిఫ్ట్ డీడ్ జారీకి అనుమతి ఇవ్వాలని.. ఏడు రోజుల్లోగా టీడీఆర్ బాండ్లు జారీ చేయాలని స్పష్టం చేశారు.

జిల్లాల్లోనూ అర్చకులు, పండితులకు సత్కారాలు

- ఉగాది రోజున జిల్లాకు ముగ్గురు అర్చకులు, ఒక వేద పండితుడికి సన్మానం
- ఒక్కొక్కరికీ రూ. 10,116 సంభావన, కొత్త వస్త్రాలు, శాలువా

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం మేరకు ఈ ఏడాది కూడా ఉగాది పండుగ సందర్భంగా అన్ని జిల్లాల్లో అర్చకులు, వేద పండితులకు సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న ఉగాది పండుగ సందర్భంగా ప్రతి జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే 62 ఏళ్లు పైబడిన ముగ్గురు అర్చకులను, ఒక వేదపండితుడిని సత్కరించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ అన్ని జిల్లాల్లోని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సత్కార కార్యక్రమంలో ఒక్కొక్క అర్చకునికి, వేదపండితుడికి రూ. 10,116ల సంభావనతో పాటు కొత్త వస్త్రాలు, శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇందుకోసం దేవదాయ శాఖ పరిధిలో ఉండే అర్చక సంక్షేమ నిధి నుంచి జిల్లాకు రూ. 50 వేలు చొప్పున విడుదల చేయనున్నట్టు తెలిపారు. దేవదాయ శాఖ పరిధిలో అధిక వార్షికాదాయం ఉండే 6 (ఏ) కేటగిరీ ఆలయాలు సైతం ప్రత్యేకంగా ఉగాది పురస్కార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆ దేవస్థాన నిధులతో ప్రతి ఆలయంలో ఇద్దరు అర్చకులు, ఒక వేద పండితుడిని సత్కరించాలని ఈవోలకు దేవదాయ శాఖ సూచించింది.

40 ఏళ్ల టీడీపీని నిలబెట్టా

- జనసేన 12వ ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్
- నాన్న చెప్పినట్టు డిగ్రీ పూర్తి చేయలేకపోయా
- సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది
- హిందీ వద్దనే వారు సినిమాలను ఆ భాషలో డబ్ చేయొద్దు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మొన్నటి ఎన్నికల్లో 40 ఏళ్ల చరిత్ర కలిగిన టీడీపీని నిలబెట్టామని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని చిత్రాడలో శుక్రవారం రాత్రి జరిగిన ఆ పార్టీ 12వ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారని, 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టామన్నారు. దేశమంతా మనవైపు చూసేలా 100 శాతం స్ట్రైక్ రేట్‌తో గెలిచామని చెప్పారు. తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు సినిమా ఉపకరణం మాత్రమేనని, ఖుషీ సినిమా చూసి గద్దరన్న తనను ప్రోత్సహిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు ఎంతో ప్రభావితం చేశారన్నారు. సగటు మధ్య తరగతి మనిషిగా బతకడమే తన కోరిక అని చెప్పారు. చంటి సినిమాలో మీనాను పెంచినట్టు తనను పెంచారని, అలాంటి తాను సినిమాలు చేస్తానని.. రాజకీయాల్లోకి వస్తానని ఎవరూ ఊహించి ఉండరన్నారు. తాను డిగ్రీ పూర్తి చేసి, ఎస్సైని కావాలన్నది తన తండ్రి కోరిక అని, కానీ తాను డిగ్రీ కూడా పూర్తి చేయలేదని చెప్పారు. అటువంటి తాను బయటకు వెళ్తే ఏమవుతానో అని ఇంట్లో నిత్యం భయపడేవారన్నారు.

అవగాహనతోనే పార్టీ పెట్టాను



జనసేన విజయానికి ఏడు సిద్ధాంతాలే కారణమని, ఎంతో ఆలోచించి వీటిని రూపొందించామని పవన్ కళ్యాణ్ తెలిపారు. సమాజంపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా? పార్టీ పెట్టాలంటే నాన్న ముఖ్యమంత్రి, మామయ్య కేంద్ర మంత్రి అయ్యుండాలా? అని పవన్ ప్రశ్నించారు. దశాబ్దం పాటు పార్టీని నడపడంతో వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం ఎంతో కోల్పోయానన్నారు. సమాజంలో మార్పు కోసం వచ్చానని, ఓట్ల కోసం కాదని స్పష్టం చేశారు. భిన్నమైన వ్యక్తుల్లో ఏకత్వం చూడగలడమే తన ఐడియాలజీ అని, అందుకే సైద్ధాంతిక విధానాన్నే ఎంచుకున్నానని తెలిపారు. బలమైన దేశం కోసం బలంగా నిలబడే యువత అవసరం అన్నారు. భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేయాల్సిన సమయం ఇదేనని, సనాతన ధర్మం తన రక్తంలోనే ఉందని, దానిని నిరూపించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇతర మతాలను గౌరవించాలని సనాతన ధర్మం నేర్పిందన్నారు. హైదరాబాద్‌లో పోలీసులు 15 నిమిషాలు కళ్లు మూసుకుంటే హిందువులకు తమ సత్తా చూపుతామని ఒక నాయకుడు వ్యాఖ్యానించడం దారుణం అని మండిపడ్డారు. 'మాట్లాడితే సంస్కృతాన్ని తిడతారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటారు.. అన్నీ దేశ భాషలే కదా.. తమిళనాడులో హిందీ రాకూడదని అంటూంటే నాకు ఒక్కటే అనిపించింది. తమిళ సినిమాలు హిందీలో డబ్ చేయకండి. డబ్బులేమో ఉత్తర ప్రదేశ్, బీహార్, చత్తీస్‌గఢ్ నుంచి కావాలి. హిందీని మాత్రం ద్వేషిస్తామంటే ఎలా? ఇద్దెక్కడి న్యాయం' అని పవన్ ప్రశ్నించారు.

పవన్ గెలుపు తమ వల్లే అనుకుంటే వారి ఖర్మ

- పవన్‌ను గెలిపించుకున్నది జన సైనికులే
- జనసేన ఆవిర్భావ సభలో నాగబాబు స్పష్టీకరణ
- ఈ వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యే వర్మనుద్దేశించే అంటున్న టీడీపీ శ్రేణులు
- పిఠాపురంలో టీడీపీని నిర్వీర్యం చేసేందుకేనని మండిపాటు

పిఠాపురం: పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయానికి తామే కారణమని ఎవరైనా అనుకుంటే... అది వారి 'ఖర్మ' అని జనసేన పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం జరిగిన పార్టీ 12వ ఆవిర్భావ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ విజయం ఎన్నికలకు ముందే ఖాయమైందని చెప్పారు. ఎన్నికల సమయంలో తనకు, తన బృందానికి పవన్ కళ్యాణ్ బాధ్యతలు అప్పగించారని, అది కేవలం తమ సంతృప్తి కోసం అప్పగించిన బాధ్యతలే అన్నారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పవన్ కళ్యాణ్‌ను గెలిపించాలని ఎన్నికలకు ముందే నిశ్చయించుకున్నారని చెప్పారు. ఈ పరిస్థితిలో ఎవరైనా పవన్ కళ్యాణ్ గెలుపు కోసం పని చేశామని కానీ, విజయానికి తామే కారణమని కానీ అనుకుంటే అది వారి 'ఖర్మ' అని స్పష్టం చేశారు. కాగా, నాగబాబు వ్యాఖ్యలు టీడీపీలో దుమారం రేపుతున్నాయి. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ విజయానికి తాను ఎంతో కష్టపడి పని చేశానని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ అనేక సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు నాగబాబు చేసిన వ్యాఖ్యలు తమ నాయకుడిని ఉద్దేశించి చేసినవేనని, ఇది మంచి పద్ధతి కాదని సోషల్ మీడియా వేదికగా పిఠాపురం టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. పిఠాపురంలో వ్యూహాత్మకంగా టీడీపీని, వర్మను నిర్వీర్యం చేయడానికే నాగబాబు ఇలా మాట్లాడారని, ఓట్లు వేయించుకుని గద్దెనెక్కాక ఇలా నాలుక మడతెయ్యడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ఎండల తీవ్రత

- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- సాధారణంకంటే 2, 3 డిగ్రీలు ఎక్కువ
- ఈ వేసవిలో ఎండ తాకిడి ఎక్కువేనంటున్న వాతావరణ శాఖ



సాక్షి, అమరావతి: వేసవి తొలి రోజుల్లోనే రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. రోజు రోజుకి ఎండల తీవ్రత పెరుగుతోంది. గురువారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువ ఉంటోంది. నిన్నటి వరకు రెండు, మూడు చోట్ల మాత్రమే 40 డిగ్రీలు దాటిన ఎండ.. గురువారం చాలా మండలాల్లో 40 డిగ్రీలు దాటిపోయింది. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాలలో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనకాపల్లి జిల్లా నాతవరం, ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం తిప్పాయిపాలెంలో 42.1 డిగ్రీలు నమోదైంది. ఇవి సాధారణంకంటే రెండు, మూడు డిగ్రీలు ఎక్కువేనని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్తరాంధ్రలోని అనకాపల్లి, పార్వతీపురం మన్యం, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ ఉష్ణోగ్రతలు ఏప్రిల్ రెండో వారానికల్లా మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో గాలిలో తేమ శాతం ఎక్కువగానే ఉండడం వల్ల ఉక్కపోత ఉండడంలేదు. అయితే ఎలినినో పరిస్థితుల కారణంగా సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో మున్ముందు ఎండ, వడగాలుల తీవ్రత కూడా పెరుగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వచ్చే జనవరి 21 నుంచి వింగ్స్ ఇండియా ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: వింగ్స్ ఇండియా–2026 వైమానిక ప్రదర్శనకు తేదీలు ఖరారయ్యాయి. 2026 జనవరి 21 నుంచి 24 వరకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఈ కార్యక్రమం జరగనుంది. పౌర విమానయాన రంగంలో ఆసియాలో అతిపెద్ద కార్యక్రమం అయిన వింగ్స్ ఇండియాను రెండేళ్లకోసారి బేగంపేట ఎయిర్‌పోర్టులో నిర్వహిస్తున్నారు. 2024లో జరిగిన వింగ్స్ ఇండియా కార్యక్రమంలో 25 విమానాలు, హెలికాప్టర్లు కొలువుదీరాయి. 130 కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. దేశ, విదేశాల నుంచి అనేక వ్యాపార సంస్థలకు చెందిన 5,000 పైచిలుకు ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే 1,20,000 మందికిపైగా సాధారణ పౌరులు ప్రదర్శనను తిలకించారు.

పైరవీలకే పురస్కారాలా!?

- రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఉగాది, కళారత్న పురస్కారాలపై విమర్శలు
- దరఖాస్తులతో వెల్లువెత్తుతున్న రాజకీయ సిఫారసు లేఖలు
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కోటా ఇస్తున్నారంటూ ఆరోపణలు


సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 30న ప్రదానం చేయనున్న ఉగాది, కళారత్న పురస్కారాలపై విమర్శలు ముసురుకుంటున్నాయి. సిఫారసు లేఖలతో కొందరు ఆశావహులు దరఖాస్తు చేయడమే ఇందుకు ప్రధాన కారణం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రమేయంపై మండిపడుతున్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా 15 విభాగాల్లో పురస్కారాలు అందిస్తామంటూ నిర్వాహకులు ప్రకటించారు. ఈనెల 15లోగా ఆయా విభాగాలకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. కళారత్న పురస్కారానికి రూ.25 వేలు, ఉగాది పురస్కారానికి రూ.5 వేలు నగదు బహుమతిగా అందించనున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సాహిత్య, కళా రంగంలో ఉన్న వారు, నిస్వార్థంగా సేవలందిస్తున్న వారు తమకు సరైన గుర్తింపు లభిస్తుందనే ఆశతో దరఖాస్తు చేస్తున్నారు. కానీ, వారితో పాటు మరి కొందరు ఇవే పురస్కారాలకు రాజకీయ నేతల నుంచి సిఫారసు లేఖలు తీసుకొస్తున్నారు. ఈ విషయం తెలిసి పురస్కారాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అర్హులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి విభాగానికీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కోటా ఇస్తున్నారంటూ నిర్వాహకులపై వారు ఆరోపణలు చేస్తున్నారు. పైగా.. పురస్కారాల ఎంపికకు నిర్దిష్ట నియమ, నిబంధనలు లేకపోవడం అనుమానాలకు ఆజ్యం పోస్తోంది. ఇక పురస్కారం పొందాలనుకునే వారు రాజకీయ నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు. దీంతో.. ఇలా వస్తున్న వారిలో తమ వారిని గుర్తించి, అర్హతతో పనిలేకుండా నేతలు సిఫారసు లేఖలు అందిస్తున్నారు.

'బాబు' పాలనలో ఇంతే..

ఇక గతంలోనూ 'బాబు' అధికారంలో ఉన్నప్పుడు ఇదే విధానాన్ని అవలంబించారు. ప్రతిభ ఉన్న వారికి పదిశాతం కూడా పురస్కారాలు ఇవ్వలేదని అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. ఇప్పుడూ అదే సంప్రదాయం పునరావృతం అవుతోందని వివిధ రంగాల సేవకులు గుర్తుచేస్తున్నారు. కొంతమంది క్రమం తప్పకుండా ఏటా ఏదో ఒక పురస్కారం అందుకుంటుంటే, కొత్తవారికి అవకాశం ఎలా వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. నిజానికి.. చాలా జిల్లాల నుంచి ఒకరిని కూడా ఎంపికచేయడంలేదని.. ఎంపిక ప్రాతిపదిక ఏమిటో కూడా ఎవరికీ అర్థం కావడంలేదని వారంటున్నారు.

ఎమ్మెల్యేలు నామినేటెడ్ పదవులకు పేర్లు ఇవ్వడం లేదు

టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: నామినేటెడ్ పదవుల కోసం ఇప్పటికీ కొందరు ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల నుంచి పేర్లను ఇవ్వలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యేలు ఆలస్యం చేయడం వల్లే పోస్టులు భర్తీ చేయలేకపోయామని తెలిపారు. నామినేటెడ్ పదవుల కోసం పార్టీ కోసం కష్టపడిన నేతల వివరాలను వీలైనంత త్వరగా పంపించాలని సూచించారు. ఆయన శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 21 ప్రధాన దేవాలయాలకు చైర్మన్ల నియామకానికి 60 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. మంత్రులు జిల్లాలకు వెళ్లే సమయంలో జిల్లా కోఆర్డినేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి గ్రామంలో అమలు చేసేందుకు ఎమ్మెల్యేలు, నేతలు చొరవ తీసుకోవాలని చెప్పారు.

లోకేశ్‌ది 'విద్యా' వినాశన శాఖ

- మాజీ మంత్రి మేరుగు



సాక్షి, అమరావతి: కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోందని, మంత్రి నారా లోకేశ్ ఈ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. విద్యా రంగంలో వైఎస్ జగన్ తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలకు కూడా తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం, ఐబీ, సీబీఎస్‌సీ సిలబస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ట్యాబ్‌ల పంపిణీ, సబ్జెక్టు టీచర్ కాన్సెప్టు ఇలా ప్రతి దాన్నీ లోకేశ్ పనికట్టుకొని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. అమ్మ ఒడి పథకాన్నీ నీరుగారుస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ఏనాడూ విద్యా వ్యవస్థను పట్టించుకోలేదని, ఒక జత యూనిఫాం, బూట్లు కూడా పిల్లలకు ఉచితంగా ఇవ్వలేదని చెప్పారు. చంద్రబాబు ఏనాడూ ఫొటోలు వేసుకోనట్టు, వైఎస్ జగన్ మాత్రమే అలా చేశారంటూ లోకేశ్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పేదలకిచ్చిన చంద్రన్న కానుకల్లో నాసిరకం బెల్లం, పురుగులు పట్టిన గోధుమ పిండి ప్యాకెట్ల మీద, కుట్టు మిషన్లు, విద్యార్థులకిచ్చిన సైకిళ్లకు, ఆఖరుకి అప్పడాల మీద కూడా చంద్రబాబు ఫొటోలు వేసుకున్నారని తెలిపారు. లోకేశ్ విశ్వ విద్యాలయాలను కుల రాజకీయాలతో భ్రష్టుపట్టించారని చెప్పారు. 17 మంది వీసీలను బెదిరించి రాజీనామా చేయించారని, 9 నెలల తర్వాత వారికి అనుకూలమైన వారిని నియమించారని తెలిపారు. జగన్ హయాంలోనే యూనివర్సిటీలకు నాక్ ఏ ప్లస్ ప్లస్ సర్టిఫికేషన్ వచ్చిందని తెలిపారు. నాక్ ఎ గ్రేడ్ వర్సిటీలు 2019లో 11 ఉండగా, 2024కి ఆ సంఖ్య 46కి చేరగా, ఇప్పుడా సంఖ్య 5కి పడిపోయిందని చెప్పారు. వైఎస్ జగన్ అందించిన విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో విద్యారంగంలో 2019లో 100.81గా మగ, ఆడ నిష్పత్తి 2024కి 100.96 కి పెరిగిందన్నారు. 2018–19 మధ్య క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 37 వేల ఉద్యోగాలొస్తే, 2023–24లో 1.20 లక్షల మందికి ఉద్యోగాలొచ్చాయన్నారు.

అవును.. వాళ్లు యువతులను మావోల్లో చేర్పిస్తున్నారు

దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమిక ఆధారాలు సేకరించింది

నిందితులకు బెయిల్ నిరాకరించిన హైకోర్టు



సాక్షి, అమరావతి: యువతులకు బ్రెయిన్‌వాష్ చేసి వారిని నిషేధిత మావోయిస్టు పార్టీలో చేర్పిస్తున్న వ్యవహారంలో నిందితులుగా ఉన్న డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్పలకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన కేసులో బెయిల్ కోసం వారు దాఖలు చేసిన అప్పీళ్లను హైకోర్టు కొట్టేసింది. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ కింది కోర్టు గతంలో జారీచేసిన ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. పిటిషనర్లు యువతులకు బ్రెయిన్‌వాష్ చేసి మావోయిస్టు పార్టీలో చేర్పిస్తున్నారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

నా కుమార్తెను బలవంతంగా చేర్చారు..

డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్ప మరికొందరు కలిసి మావోయిస్టు పార్టీలోకి యువతులను చేర్పించేందుకు చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) పేరుతో ఓ సంఘం ఏర్పాటుచేశారు. సామాజిక సేవ నెపంతో యువతులను చేరదీసి, వారు మావోయిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యేలా చేసి, ఆ తరువాత మావోయిస్టుల్లో చేర్పిస్తున్నారు. ఇదే రీతిలో విశాఖపట్నం, పెద్దబయలుకు చెందిన రాధా అనే యువతిని 2017లో మావోయిస్టుల్లో చేర్పించారు. 2021లో రాధా తల్లి తన కుమార్తెను బలవంతంగా మావోయిస్టుల్లో చేర్పించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకి అప్పగించారు. ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసింది. ఇదిలాఉంటే.. ఈ కేసులో తమకు బెయిల్ ఇవ్వాలంటూ డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్ప విశాఖపట్నంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు వారి బెయిల్ పిటిషన్లను కొట్టేస్తూ 2024 మే 29న తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలుచేస్తూ వారిరువురూ హైకోర్టులో క్రిమినల్ అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ సురేష్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

మావోయిస్టు కార్యకలాపాల్లో క్రియాశీలకంగా..

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎ. సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 2017లో రాధాను తీసుకెళ్లారంటూ ఆమె తల్లి 2021లో పోలీసులకు ఫిర్యాదు చేశారని.. కానీ, అప్పటికే ఆమె నాలుగేళ్లపాటు మౌనంగా ఉన్నారన్నారు. ఎన్ఐఏ తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లకు మావోయిస్టులతో సంబంధాలున్నాయని తేల్చిచెప్పారు. ఇందుకు సంబంధించి ఎన్ఐఏ పలు కీలక ఆధారాలు సేకరించిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఎన్ఐఏ సేకరించిన ఆధారాలను, అది దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిశీలించింది. పిటిషనర్లకు బెయిల్ నిరాకరిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పులో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. పిటిషనర్లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కొట్టేస్తున్నట్లు తెలిపింది.

యోగమునందు బుద్ధిగలవారు ఒకటే నిశ్చయముతో ఉందురు.
వేరు అభిప్రాయాలు కలుగువారికి బుద్ధి శాఖోపశాఖలై ఉందును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 15 మార్చి 2025

'రూ'పం... సారం

నిరుడు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి వరసగా మూడోసారి కేంద్రంలో అధికారం లోకొచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి విపక్షాల ఆధ్వర్యంలోని రెండు రాష్ట్రాలు గట్టి ప్రతిఘటననిస్తున్నాయి. ఇందులో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బెంగాల్‌లోని తృణమూల్ సర్కారుకన్నా ఒకడుగు ముందుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఒకపక్క నియోజక వర్గాల పునర్విభజన, మరోపక్క హిందీ భాష పెత్తనం అనే రెండు పదునైన ఆయుధాలతో కేంద్రాన్ని ఇరకాటంలో పడేస్తున్నారు. పార్లమెంటులోనూ, వెలుపలా ఈ రెండింటిపైనా విస్తృతమైన చర్చ జరిగేలా చూస్తున్నారు. నిత్యం పతాక శీర్షికలకెక్కుతున్నారు. శుక్రవారం ప్రవేశపెట్టే 2025–26 రాష్ట్ర బడ్జెట్ లోగో లోని హిందీ అక్షరం'రూ' బదులు తమిళ అక్షరం 'రూ'ను వినియోగించబోతున్నామని గురువారం స్టాలిన్ ప్రకటించటం అందులో భాగమే. అయితే తమ ఉద్దేశం తమిళభాష ఔన్నత్యాన్ని పెంచటమే తప్ప, హిందీని వ్యతిరేకించటం కాదని డీఎంకే ప్రతినిధి శరవణన్ వివరణనిచ్చారు. హిందీ 'రూ' జాతీయ కరెన్సీ అధికారిక చిహ్నంగా 2010 జూలై నుంచి అమల్లోవుంది. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్టితోనే డీఎంకే ఇలాంటి విన్యాసాలు చేస్తున్నదని బీజేపీ అంటున్నా, ఆ పార్టీ లేవనెత్తుతున్న రెండు అంశాలూ కొట్టిపారేయదగ్గవి కాదు. రాజ్యాంగం నిర్దేశించిన ఫెడరలిజం భావనను కేంద్రం నీరుగారుస్తోందన్న అభిప్రాయం రాష్ట్రాల్లో బలపడనట్టయితే డీఎంకే లేవనెత్తిన అంశాలకు ఇప్పుడున్నంత ప్రాముఖ్యత లభించేది కాదన్నది వాస్తవం. ఇంతకూ జాతీయ కరెన్సీ చిహ్నం రూపొందించింది తమిళనాడు వ్యక్తి, పైగా డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడు. కనుకనే డీఎంకే నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ చిహ్నంలో హిందీ అక్షరమేవున్నా ఇంగ్లిష్ అక్షరం 'ఆర్'ను కూడా పోలివుండటం దాని ప్రత్యేకత. కానీ సమస్య తలెత్తినప్పుడు ఇవన్నీ మరుగున పడతాయి. ఆ సంగతలా వుంచి ఈ అంశంలో బీజేపీ స్పందనలు శ్రుతిమించాయి. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కరెన్సీ చిహ్నం మార్పు దేశ ఐక్యతను బలహీనపరిచే ప్రమాదకరమైన మనస్తత్వం పర్యవసానమని అభివర్ణించారు.

హిందీ అమలుకు అనుసరించే విధానాలవల్లే ఆ భాషపై వ్యతిరేకత వస్తోంది. ఇది బీజేపీతో మొదలు కాలేదు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోవున్నా ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. వాటికి ఎప్పటికప్పుడు ప్రతిఘటన వస్తూనే వున్నది. 2008లో యూపీఏ సర్కారు హిందీ వాడకాన్ని పెంచడానికంటూ విడుదల చేసిన సర్క్యులర్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మెట్రిక్, ఆపై స్థాయి అభ్యర్థులకు కేంద్ర నియామకాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా హిందీ ప్రశ్నపత్రం ఉండాలన్నది సర్క్యులర్ సారాంశం. తమ పార్టీ ఆధ్వర్యంలోని యూపీఏ సర్కారే దీన్ని తీసుకొచ్చినా అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఇతర ప్రశ్న పత్రాల్లో మెరుగైన మార్కులు వచ్చినా హిందీలో ఫెయిలైతే ఉద్యోగానికి అనర్హులవుతారని ఆ ప్రతిపాదన తెలిపింది. ఇది హిందీ భాషా ప్రాంతాల అభ్యర్థులకే లాభిస్తుందనీ, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనీ వైఎస్ లేఖ రాశారు. చివరకు ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2014, 2017, 2019లలో సైతం కేంద్రం ఈ మాదిరి ప్రతిపాదనలే ముందుకు తోసింది. ఇంగ్లిష్‌కు ప్రత్యామ్నాయంగా హిందీ ఉండాలని రెండేళ్ల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నప్పుడు కూడా వివాదం రేగింది.

జాతీయ విద్యావిధానం–2020తో తమిళనాడుకు పేచీవుంది. తాము ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్న త్రిభాషా సూత్రాన్ని తీసుకురావటమే ఆ విద్యావిధానం సారాంశమని డీఎంకే అంటున్నది. ఆ విధానం ప్రకారం విద్యార్థి మాతృ భాషతోపాటు ఇంగ్లిష్, మరేదైనా దేశీయ భాష నేర్చుకోవాలన్న నిబంధన వుంది. హిందీయే నేర్చుకోవాలని అందులో లేదన్నది నిజమే కావొచ్చుగానీ... వేరే భాష నేర్చుకోవాలనుకుంటే ఆ భాషా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండే అవకాశముందా? హిందీ ప్రాంతాల్లో దక్షిణాది భాషలు నేర్పే టీచర్లే లేరు. అసలు ఈ త్రిభాషాసూత్రం వల్ల ఈ స్థాయిలో మేలు జరిగిందని చెప్పే గణాంకాలున్నాయా? జాతీయ విద్యావిధానం అమలు చేయలేదన్న కారణంతో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద కేంద్రం నుంచి రావాల్సిన 2,152 కోట్లను నిలిపివేశారని తమిళనాడు ఆరోపిస్తోంది. ఎస్ఎస్ఏకు రావాల్సిన ఆ నిధులను సొంత వనరుల నుంచే సమీకరించాలని నిర్ణయించినట్టు ఆ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించారు. హిందీకి వ్యతిరేకమనో, నూతన విద్యావిధానానికి వ్యతిరేకమనో చూపి నిధులు ఆపేయటం ఒత్తిడి తీసుకొచ్చే మార్గమని కేంద్రం అనుకోవచ్చుగానీ... దీన్ని బెదిరించటంగా, బ్లాక్‌మెయిల్‌గా తమిళనాడు పరిగణిస్తోంది. విద్యాపరంగా చూసినా, పన్నుల వసూళ్లపరంగా చూసినా తమిళనాడు అనేక రాష్ట్రాలకన్నా ఎంతో ముందుంది. అందుకు ఇదా బహుమతి అనే ప్రశ్న తలెత్తదా?

అమల్లోకి తీసుకురాదల్చుకున్న ఏ విధానంపైన అయినా సమగ్ర చర్చ జరపడం, అపోహల్ని తొలగించటం అవసరమని కేంద్రం గ్రహించాలి. ప్రాథమిక స్థాయి విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ విద్యవరకూ అన్నింటా తన ఆధిపత్యమే ఉండాలన్న ఆత్రుత వేరే పర్యవసానాలకు దారితీస్తున్నదని గుర్తుంచుకోవాలి. రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజారిస్తే, ఫలానా పథకం అమలు చేయలేదన్న కారణం చూపి నిధులు ఎగ్గొడితే సాధారణ ప్రజలకు వేరే సంకేతాలు పోతాయి. ఆ పరిస్థితి తలెత్తకుండా చూసుకోవటం కేంద్రం బాధ్యత.

'ఇండియా' కూటమి లేనట్టేనా?

అభిప్రాయం



టంకశాల అశోక్

సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ఈ నెల 9వ తేదీన గమనార్హమైన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి మరణం తర్వాత ఇంకా ఎవరూ ఆ స్థానంలోకి రాలేదు. కరత్ పొలిట్ బ్యూరో సమన్వయ కర్తగా నియమితులయ్యారు. అది ప్రస్తుతానికి ప్రధాన కార్యదర్శి వంటి హోదా. పైగా ఆయన స్వయంగా లోగడ ఆ హోదాలో పని చేశారు. అందువల్ల తన మాటలకు తగినంత ప్రాధాన్యత ఉంటుంది. అంతేకాదు. కరత్‌కు మార్క్సిస్ట్ సిద్ధాంతాలలో నిష్ణాతుడనే పేరు పార్టీలో, బయటా కూడా ఉన్నది. హరికిషన్ సింగ్ సూర్జిత్ ప్రధాన కార్యదర్శిగా ఉండినపుడు, సీపీఎంతో పాటు మొత్తం వామపక్షాలను మధ్యే మార్గ పార్టీలతో మైత్రి వైపు మళ్లించారు. సీతారాం అందుకు అనుకూలురు కాగా, కరత్ వ్యతిరేకి.



ఇండియా కూటమి నేతలు

కరత్ మాట్లాడిన సందర్భం సీపీఎం కేరళ శాఖ సభలు కొల్లామ్ పట్టణంలో జరగటం. ఆ సభలు ఒక రాష్ట్రానికి సంబంధించినవి. ఆయన మాటలు నేరుగా తన ప్రసంగంలో అన్నవి గాక, విడిగా ఒక పత్రికా ప్రతినిధితో చెప్పినవి. అందువల్ల వాటికి తగిన ప్రచారం రాలేదు. కానీ అవి మొదట అనుకున్నట్లు గమనార్హమైనవి: 'ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట ఏర్పడిన 26 బీజేపీ యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధానాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. ఒక సమన్వయ కమిటీ ఏర్పాటుకు ఇతర పార్టీలు ప్రయత్నించాయి గానీ అది ఆచరణలో పని చేయగలది కాదన్నాము. దానితో, నాయకులు మాత్రం కలుస్తుండేవారు. కొన్ని కమిటీలు ఏర్పాటు చేశారు గానీ అవేవీ పని చేయలేదు. సీట్ల సర్దుబాటుపై జాతీయ స్థాయి చర్చలు వీలయేవి కాదు గనుక ఆ పని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంగా జరగాలన్నాము మేము. ఉదాహరణకు మా పార్టీ బెంగాల్‌లో, కేరళలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయదు. మొత్తానికి ఆ పద్ధతి పనిచేసి బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయి 240 స్థానాలకు తగ్గింది. అందువల్ల, ఇండియా కూటమి అన్న ఆలోచనే లోక్‌సభ ఎన్నికలకు పరిమితమైనటువంటిది... లోక్‌సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవసరమా? అయితే ఏ విధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి. ఒకవేళ వేదిక ఎన్నికల కోసమే అయితే, ఇపుడు చేయవలసింది ఏమీ ఉండదు' అన్నారు సీపీఎం సమన్వయకర్త.

కూటమి భవిష్యత్తు?

కరత్ వెల్లడించిన అభిప్రాయాలలో ఇండియా కూటమి ఏ విధంగా వ్యవహరించిందన్న గత పరిస్థితులకే పరిమితమయ్యారనే భావన కలగవచ్చు. కానీ అందులో అంతర్లీనంగా, ప్రతిపక్షాలు మౌలికంగా ఎట్లా పనిచేస్తున్నాయి, భవిష్యత్తులో ఏ విధంగా పని చేయాలనే కోణాలు కూడా కనిపిస్తాయి. చెప్పాలంటే ఈ ప్రశ్నలు ప్రతిపక్షాలకు 1977 నాటి జనతా పార్టీ నుంచి మొదలుకొని తర్వాత కాలంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల కాలంలో, ఇంకా తర్వాత కాంగ్రెస్ నాయకత్వాన ఏర్పడిన యూపీఏ హయాంలోనూ కొనసాగినవే. ఇండియా కూటమి బలహీనతలు, వైఫల్యాల వెనుక కూడా ఇదంతా ఉంది.

కూటమికి వ్యవస్థాత్మక నిర్మాణాన్ని సీపీఎం వ్యతిరేకించటానికి కారణం అందులో పలు రకాల విధానాలు, సిద్ధాంతాలు గల పార్టీలు, నాయకులు ఉండటం. దీనికి సమాధానాలు కనుగొనలేకపోయినందువల్లనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి కూటమికి భంగపాట్లు ఎదురు కావటం జరిగింది. అటువంటి భంగపాట్లు జనతా పార్టీ కాలం నుంచి గత 48 సంవత్సరాలుగా ప్రతిపక్షాలకు ఎదురవుతూనే ఉన్నాయి. అందుకు ఒక కారణం వారి వైఫల్యాలు కాగా, మరొకటి భారతదేశపు మహా విస్తారమైన వైవిధ్యత.

ఇన్నిన్ని ప్రాంతాలు, సైద్ధాంతిక, విధానపర, రాజకీయ వైవిధ్యతలు ఉన్నపుడు ఏకాభిప్రాయాలు, విభేదాలకు అవకాశం ఉండని సమష్టి నాయకత్వాలు తేలిక కాదు. కాంగ్రెస్, బీజేపీలవలె నిర్దిష్ట దీర్ఘకాలిక చరిత్రలు, నాయకత్వాలు, సిద్ధాంతాలు ఉన్నపుడు అది సాధ్యమవుతుంది. లేదా ఎమర్జెన్సీ వంటి అసాధారణ పరిస్థితి ఏర్పడి దేశాన్ని ఒకటి చేయటం వంటిది జరగాలి. వీటన్నింటి మధ్య స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఒక పాయగా సాగుతుండిన సోషలిస్టు రాజకీయం సరిగా కుదురుకొని ఉంటే ఏమి జరిగేదో గానీ పలు కారణాలవల్ల అది ఛిన్నాభిన్నమైంది. మరొకవైపు, కేవలం ఎమర్జెన్సీ పట్ల వ్యతిరేకతతో ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట ఏర్పడిన జనతా పార్టీ, తర్వాత 'యాంటీ కాంగ్రెసిజం' ఆలోచనలతో ముందుకు వచ్చింది. తాము ఒకప్పటి కాంగ్రెస్ సంప్రదాయంలో వామపక్షపు మొగ్గ గల మధ్యే మార్గ ప్రత్యామ్నాయం కాగలమన్న ఫ్రంట్ కూటములు అదే దశలో చెదిరిపోయాయి.

కనీస ఉమ్మడి కార్యక్రమం ఏమిటి?

అయితే, ప్రకాశ్ కరత్ మాటలను పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే, 1977 నాటి జనతా పార్టీ కాదుగానీ, 1989లో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ కొంత భిన్నంగా కనిపించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణలతో అదే పార్టీకి చెందిన వీపీ సింగ్ వంటి ముఖ్య నేతలు బయటకు రావటం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించి వేస్తున్నదనే ఫిర్యాదుతో పలు ప్రాంతీయ పార్టీలు, ప్రభుత్వాలు, ఎమర్జెన్సీ – జనతా పార్టీ దశలో ఒకటై తిరిగి చెదిరిపోయిన సోషలిస్టు వర్గాలు, ఉభయ కమ్యూనిస్టులు, దేశవ్యాప్తంగా సమాజంలోని ప్రజాస్వామికవాదులు ఒకే వేదికపైకి వచ్చి చేరారు. అంతేగాక, వీపీ సింగ్, ఎన్టీఆర్‌ల నాయకత్వాన బీజేపీని ఒక అడుగు దూరంలోనే ఉంచివేశారు. ఈ వైవిధ్యతల మధ్య అపుడు ప్రకాశ్ కరత్ ఉద్దేశిస్తున్నది ఒకటి జరిగింది. అది, ఎన్నికలకన్నా ముందే వివిధ పార్టీల మధ్య సుదీర్ఘ చర్చల ద్వారా 'కనీస ఉమ్మడి కార్యక్రమం' ఒకటి రూపొందించటం. అది దేశ ప్రజానీకానికి ఒక కొత్త విశ్వాసాన్ని కలిగించిన మాట నిజం. అయితే కొందరు సీనియర్ల అధికార కాంక్షలు, మందిర్–మండల్ వివాదాల మూలంగా ఆ ప్రయోగం భంగపడటం తెలిసిందే. అది జరగనట్లయితే దేశ రాజకీయాలు మరొక విధంగా ఉండేవేమో.

సీపీఎం సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ అపుడంతా జాతీయ స్థాయిలో ఈ పరిణామాలను ప్రత్యక్షంగా గమనించిన వ్యక్తి. ప్రస్తుత 'ఇండియా' కూటమికి సంబంధించిన పరిణామాల వరకు తనకు తెలియనిది లేదు. అందువల్లనే ఆ కూటమి ఏర్పాటు తీరు, లక్ష్యాలు, పనితీరు, పరిమితులు, సాఫల్య వైఫల్యాల గురించి అంత స్పష్టంగా చెప్పగలిగారు. ఈ విషయాన్ని కొంత ముందుకు తీసుకువెళ్ళినట్లయితే, ఆయన ఎత్తి చూపిన సైద్ధాంతిక, విధానపరమైన వైవిధ్యతలు, వైరుధ్యాల నుంచి, నాయకుల వ్యక్తిగత ధోరణుల నుంచి బీజేపీ యేతర పార్టీలు బయటకు రాగలగటం, నేషనల్ ఫ్రంట్ వలె కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించుకోవటం ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్న. అందుకు బీజేపీ వ్యతిరేకత అన్నదొక్కటే చాలదు. తమవైపు నుంచి ప్రజలకు చూపించే ప్రత్యామ్నాయ పాజిటివ్ ఆర్థిక, సామాజిక, అభివృద్ధి అజెండా తప్పనిసరి. ఎన్నికల తర్వాత ఏమిటన్న చర్చ 'ఇండియా' కూటమిలో ఎప్పుడూ జరగలేదని కరత్ ఎత్తిచూపింది ఈ విధమైన కొరతనే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



'ఇండియా' పేరిట ఏర్పడిన 26 బీజేపీ యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధానాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. లోక్‌సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవసరమా? అయితే ఏ విధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి.

– ప్రకాశ్ కరత్, సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త

సోషల్ మీడియా

ఇదా సమస్య?



2014 వరకూ రూపాయి, డాలర్ మధ్య వ్యత్యాసం గురించి ఆందోళన చెందిన బీజేపీ నాయకులు, ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తమిళనాడు ప్రభుత్వం తన రాష్ట్ర బడ్జెట్‌లో '₹' గుర్తును తొలగించినందుకు ఆందోళన చెందుతున్నారు.

– మహమ్మద్ జుబేర్, జర్నలిస్ట్

వాటికి వద్దా?



ఉపగ్రహ సమాచారం ద్వారా అత్యున్నత సమర్థతతో కూడిన ఇంటర్‌నెట్/బ్రాడ్‌బాండ్ సేవల కోసం 'స్టార్‌లింక్'తో భాగస్వాములు కావడానికి ఎయిర్‌టెల్, జియోకు భద్రతాపరమైన అనుమతి ఇస్తున్నప్పుడు, ప్రభుత్వం తన సొంత కంపెనీలైన బీఎస్ఎన్ఎల్, వోడాఫోన్ (పెద్ద భాగస్వామి)లకు ఆ ప్రయోజనాన్ని ఎందుకు నిరాకరిస్తోంది?

– ఎం.కె. వేణు, సంపాదకుడు

పద్ధతి లేదు!



సూపర్ పవర్‌గా ఎదుగుతున్నట్టు ఇండియా ఎన్ని గొప్పలయినా చెప్పుకోవచ్చు. కానీ భారతీయులు, ముఖ్యంగా కొంత చదువు, సంపద ఉండి, షికాగో నుంచి ఢిల్లీకి సుదీర్ఘ విమాన ప్రయాణం చేయగలిగే మధ్యతరగతి భారతీయులకు కనీసం టాయ్‌లెట్ ఎలా వాడాలో అయితే తెలీదు.

– రూపా సుబ్రమణ్య, కాలమిస్ట్

ఎన్నికల అంశం



2024 వరకూ ఎన్నడూ '₹' గుర్తు గురించి ఆలోచించని డీఎంకే నాయకులు, రానున్న ఎన్నికల కారణంగా దాన్ని మారుస్తున్నారు.

– శిల్ప సీఎన్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మారే నినాదం




యూఎస్ నూతన ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు, అనుసరిస్తున్న వాణిజ్య విధానాలు దోషపూరితమైనవి, ప్రమాదకరమైనవి. అవి 'మాగా'ను 'మోగా' చేస్తాయి. (మోగా– మేక్ 'అదర్స్' గ్రేట్ ఎగైన్ – ఇతరులను గొప్ప చేద్దాం.)

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

అవకాశాన్ని వదులుకోవద్దు!

దేశవ్యాప్తంగా 46 సెంట్రల్ యూనివర్సిటీలకు 2025–26 విద్యాసంవత్సరానికి గాను నాలుగు సంవత్సరాల డిగ్రీ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) 'కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్' నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 1వ తేదీన రిజిస్ట్రేషన్ మొదలయ్యింది. ఈ ప్రక్రియ 23వ తేదీ వరకూ కొనసాగుతుంది. 37 సబ్జెక్టులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు డొమెయిన్ సబ్జెక్టు (ప్రధాన సబ్జెక్టు)నూ, నిర్దేశించిన 13 భాషలలో ఒక భాషనూ ఎంచుకోవాలి. జనరల్ స్టడీస్‌ను అభ్యర్థులందరూ రాయాలి. కనీస భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా భాషకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్మీడియట్, ప్లస్ 2, 12వ తరగతి పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. ప్రతి విద్యార్థి ఐదు సబ్జెక్టుల వరకు పరీక్ష రాయడానికి ఎన్‌టీఏ అవకాశం కల్పించింది. ఈ ఒక్క పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి సెంట్రల్ యూనివర్సిటీల్లో, అనుబంధ కళాశాలల్లో విద్యార్థులు తమ ర్యాంకు ద్వారా, రిజర్వేషన్ల ఆధారంగా సీటు పొందడానికి అవకాశం ఉంటుంది.



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం (2020)లో భాగంగా అన్ని కేంద్ర విద్యా సంస్థలలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సును గత రెండు సంవత్సరాల క్రితం నుండి ప్రారంభించారు. ఒక విద్యార్థి 8 సెమిస్టర్లను పూర్తి చేసుకుంటే ఆ విద్యార్థికి డిగ్రీతోపాటు ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా విద్యార్థి టీచర్ నియామకానికి సంబంధించి పరీక్షను నేరుగా రాయడానికి అర్హత సాధిస్తాడు. దీంతో పాటు పీజీ సర్టిఫికెట్ కూడా పొందుతాడు. ఈ కోర్సులో విద్యార్థి 75% శాతం మార్కులు సాధిస్తే నేరుగా పీహెచ్‌డీలో చేరడానికి అర్హత లభిస్తుంది. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరడానికి అవసరమైన నెట్, సెట్ పరీక్షలు రాయడానికి విద్యార్థి అర్హత సాధిస్తాడు.

సైన్సు చదివే విద్యార్థి ఆర్ట్స్ సబ్జెక్టు చదవడం, ఆర్ట్స్ చదివే విద్యార్థి సైన్సు సబ్జెక్టు చదవడానికి వీలు ఉండేలా ఈ కోర్సులు డిజైన్ చేశారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడానికి కంప్యూటర్ శిక్షణతో పాటు, మాతృభాష, ఇతర భాషలను నేర్పే విధంగా బోధన ఉంటుంది.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇఫ్లూ, మాను, సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలు తెలంగాణలో; తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ట్రాన్సిట్ క్యాంపస్)లు ఏపీలో ఈ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. వివరాలకు ఎన్‌టీఏ వెబ్‌సైట్ (https://cuet.nta.nic.in/)ను చూడవచ్చు

– డా॥ చింత ఎల్లస్వామి, ములుగు

బ్యాటింగ్–బౌలింగుల్లో అరుదైన ఘనుడు



సి. వెంకటేశ్

కపిల్ దేవ్ కంటే చాలా ముందు భారత జట్టులో ఒక మంచి పేస్ బౌలింగ్ ఆల్రౌండర్ ఉండేవాడని ఇప్పటి తరం వారిలో చాలా మందికి తెలియదు. ఆయనే మన హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఆబిద్ అలీ. కపిల్ దేవ్‌తో పోలిస్తే ఆబిద్ గణాంకాలు చిన్నబోతాయి. కపిల్ నికార్సయిన ఫాస్ట్ బౌలర్ కాగా... ఆబిద్ ఓ మీడియం పేసర్ మాత్రమే. అయినా తన బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ సామర్థ్యాలతో భారత క్రికెట్‌కు ఆయన అమూల్యమైన సేవలందించారు. ముఖ్యంగా 1971లో మన జట్టు వెస్టిండీస్, ఇంగ్లండ్‌పై సాధించిన చరిత్రాత్మక సీరీస్ విజయాలలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు.

బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లతో పాటు వికెట్ కీపింగ్ కూడా చేయగల నేర్పరితనం ఆబిద్‌కు ఉండేది. నిజానికి ఆయన తన కెరీర్‌ను వికెట్ కీపర్‌గానే మొదలుపెట్టారు. కొత్త బంతితో బౌలింగ్ ప్రారంభించడంతో పాటు బ్యాట్స్‌మన్‌గా ఓపెనింగ్ కూడా చేయగల సామర్థ్యం ఆయనకు ఉండేది. ఇండియాకు బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ఓపెన్ చేసిన అరుదైన ఘనత ఆయనకు దక్కింది. ఏ స్థానంలో అయినా బ్యాటింగ్‌కు దిగగలిగినట్లే, ఫీల్డింగ్‌లో కూడా ఏ పొజిషన్‌లో అయినా ఆబిద్ రాణించేవారు. అయితే క్లోజ్ ఫీల్డర్‌గా ఆయన ఎక్కువ గుర్తుంటారు. హైదరాబాద్ గ్రామర్ స్కూల్, ఆల్ సెయింట్స్ స్కూల్లో చదువుకుంటున్నప్పటి నుంచి క్రికెట్ మీదే ఆయన ధ్యాస. ఆ రోజుల్లోనే ఫిట్‌నెస్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారాయన. లాల్ బహదూర్ స్టేడియం గ్యాలరీ మెట్ల మీద గంటల తరబడి పరుగులు పెట్టడం ఆయనకుదినచర్య. ఎమ్ఎల్ జయసింహ కెప్టెన్సీలో 1959లో రంజీ ట్రోఫీలో ఆరంగేట్రం చేసిన ఆబిద్ అలీకి ఓ ఎనిమిదేళ్ళ తర్వాత గానీ ఇండియాకు ఆడే అవకాశం రాలేదు. 1967–68 ఆస్ట్రేలియా టూర్ మొదటి టెస్ట్ నాటికి ఇండియా కెప్టెన్ టైగర్ పటౌడీకి గాయమవ్వడంతో ఆబిద్ అలీకి ఎలెవెన్‌లో చోటు దక్కింది. ఆ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి, తొలి టెస్ట్‌లోనే అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు పుస్తకాలకెక్కారు. అదే మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో కూడా రాణించి రెండు ఇన్నింగ్సుల్లో ఒక్కొక్కదానిలో 30 పరుగుల చొప్పున చేశారు. ఆ సీరీస్‌లోని ఆఖరు టెస్ట్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 78, రెండో ఇన్నింగ్స్‌లో 81 పరుగులు చేసి జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకున్నారు.



సయ్యద్ ఆబిద్ అలీ

1971వ సంవత్సరం భారత క్రికెట్‌లో ఒక సువర్ణాధ్యాయం లాంటిది. ఆ ఏడాది అజిత్ వాడేకర్ నాయకత్వంలో మన జట్టు వెస్టిండీస్, ఇంగ్లండుల్లో టెస్ట్ సీరీస్‌లు గెలిచి సంచలనం రేపింది. అంతకు ముందు ఆ రెండు దేశాల్లో ఇండియా కనీసం ఒక టెస్ట్ కూడా గెలవలేదు. ఆ జంట విజయాలలో గవాస్కర్, దిలిప్ సర్దేశాయ్ లాంటి ఆటగాళ్ళు హైలైట్ అయ్యారు. అయితే ఆబిద్ అలీ కూడా తన ఆల్‌రౌండ్ ప్రతిభతో కీలక పాత్ర పోషించారు. వెస్టిండీస్‌పై తొలి టెస్ట్ విజయమప్పుడు విన్నింగ్ రన్స్ కొట్టే అవకాశాన్ని మొదటి టెస్ట్ ఆడుతున్న గవాస్కర్ కోసం త్యాగం చేశారు ఆబిద్. కొత్తగా టెస్టుల్లోకి వచ్చిన బ్యాట్స్‌మన్‌కు ఆ ఛాన్సు ఇద్దామని ఓ ఫుల్‌టాస్ బంతిని ఫోర్ కొట్టకుండా డిఫెన్స్ ఆడానని తరువాత ఓ జర్నలిస్టుకి చెప్పారాయన. అయితే ఇంగ్లండ్‌పై అదే ఏడాది ఓవల్ టెస్ట్‌లో మనం గెలిచినప్పుడు విన్నింగ్ రన్స్ ఈసారి ఆబిద్ అలీనే కొట్టారు. 1971 వెస్టిండీస్ టూర్ హైదరబాదీయులకు బాగా గుర్తుంటుంది. ఎందుకంటే ఆ టూర్‌కు హైదరాబాద్ టీమ్ నుంచి ఐదుగురు ఆటగాళ్ళు – ఆబిద్ అలీతో పాటు, జయసింహ, జయంతిలాల్, క్రిష్ణ మూర్తి, గోవింద రాజ్ వెళ్ళారు.

1974 వరకు ఆబిద్ అలీ భారత టెస్ట్ జట్టులో కొనసాగారు. 1975లో జరిగిన తొలి ప్రపంచ కప్‌లో కూడా ఆడే అవకాశం దక్కింది. మొత్తం ఐదు వన్డే ఇంటర్నేషనల్స్‌లో ఆయన ఇండియాకు ప్రాతినిధ్యం వహించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగుల్లో ఆరితేరిన ఆబిద్.. ఈ తరంలో పుట్టి ఉంటే ఐపీఎల్‌లో ఆయనకు బోలెడంత డిమాండు ఉండేది. 29 టెస్టులాడి 47 వికెట్లు తీసి, వెయ్యికి పైగా పరుగులు చేశారు. రెండు వందలకు పైగా ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 13 సెంచరీలతో 8,732 పరుగులు చేసి, 397 వికెట్లు సాధించారు.

ఆబిద్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ జూనియర్ జట్టుకు, ఆంధ్ర జట్టుకు కోచ్‌గా పని చేశారు. ఆయన్ని క్రికెట్ వర్గాల్లో 'చిచ్చా' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. అమెరికా వెళ్ళి అక్కడ ఒక అకాడమీలో కోచ్‌గా స్థిరపడ్డారు. ఇప్పటి క్రికెటర్ల మాదిరిగా కోట్లకు కోట్లు సంపాదించుకోలేదు. 1995లో ఓపెన్ హార్ట్ సర్జరీ అవ్వడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారని సన్నిహితులు చెబుతున్నారు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈ ఆల్‌రౌండర్ ఎనభై మూడేళ్ళ వయసులో తుది శ్వాస (మార్చి 12)విడిచారని తెలిసి నిన్నటి తరం క్రికెట్ ప్రేమికులు ఒక ఆత్మీయుడిని కోల్పోయినట్టుగా బాధపడుతున్నారు.

వ్యాసకర్త క్రికెట్ వ్యాఖ్యాత

అసలైన తీర్థయాత్ర

దాదాపు ఒక వంద సంవత్సరాల క్రితం కాశీలో విశుద్ధానంద అనే సాధువు ఉండేవాడు. ఆయన గాలి, వెలుతురు లేని ఒక ఆలయపు గర్భగుడిలో ఉండేవాడు. ఆయన ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు గానీ ఎక్కువ సమయం 'ఓం'కారం లాంటి శబ్దం చేస్తూ ఉండేవాడు. 'ఓం'కారాన్ని ప్రణవమనీ, శబ్ద బ్రహ్మమనీ వేల ఏండ్ల కిందటే చెప్పారు భారతీయ ఋషులు. 'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' అని భగవద్గీత 8వ అధ్యాయం 13వ శ్లోకంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెబుతాడు.

శబ్దానికి నిజంగా ఏమైనా శక్తి ఉందా? అనేది చాలామందికి వచ్చే సందేహం. ఆధునిక విజ్ఞాన శాస్త్రం నిర్ద్వంద్వంగా శబ్దానికి ఎంతో శక్తి ఉందనీ, ఉపయోగాలూ ఉన్నాయనీ బాగా ఋజువు చేసింది. అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టమ్‌ను వినియోగించి ఒక వ్యక్తి శరీరంలో ఎక్కడెక్కడో అతి సూక్ష్మంగా దాగి ఉన్న లోపాల్ని కనుక్కోవటం అందరికీ తెలిసిన విషయమే. విశుద్ధానంద ఆనాడే ఇంగ్లాండ్ నుంచి వచ్చిన ముగ్గురు డాక్టర్లకు ప్రత్యక్షంగా, ఒక ప్రయోగం ద్వారా శబ్ద శక్తిని నిరూపించాడట. ఆ డాక్టర్లు ఒక పిచ్చుకను తెచ్చి, 'ఈ పిచ్చుకపై శబ్ద ప్రభావం ఏమైనా ఉండగలదా? ఉంటే నిరూపించ గలరా' అని విశుద్ధానందను అడిగారు. కొంత దూరంలో కూర్చొన్న విశుద్ధానంద కళ్ళు మూసుకొని ఏదో శబ్దాలు చేశాడు. ఆ పిచ్చుక గిలగిల కొట్టుకొని పడిపోయింది. డాక్టర్లు పరీక్షించి అది చని పోయిందని నిర్ధారించారు. కొంతసేపు తర్వాత విశుద్ధానంద మళ్లీ ఏవో శబ్దాలు చేశాడు. ఆశ్చర్యకరంగా ఆ పిచ్చుక బతికింది, రెక్కలు ఆడిస్తూ ఎగిరి పోయింది. (పుట 11 – హిడెన్ మిస్టరీస్ – ఓషో).



ఎన్నో శబ్దాలు మన మనసులో ప్రవేశించి తీవ్ర గందరగోళాన్ని కల్గిస్తాయి. అన్ని శబ్దాలకు మూలమైన 'ఓం'కారానికి మన మనస్సుని నడిపించి, దాన్ని కూడా అధిగమించి పోయే ధ్యాన పద్ధతులను ఆవిష్కరించారు మహర్షులు. బాహ్యం నుంచి అంతరంగానికి, లౌకికం నుంచి ఆధ్యాత్మికానికి పయనించే మార్గమది. అసలైన తీర్థయాత్ర అదే.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.02 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర ఉ.7.48 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** సా.5.02 నుండి 6.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.18 నుండి 7.47 వరకు, **అమృతఘడియలు:** రా.3.29 నుండి 5.15 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.13, **సూర్యాస్తమయం:** 6.06.



జలవనరుల్లో ఏపీ@3

దేశంలో నదులు, చెరువులు లాంటి జలవనరుల గణనను కేంద్ర జలశక్తి శాఖ 2018–19లో చేపట్టింది. దీని ప్రకారం దేశంలో 24,24,540 జలవనరులు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లోనే 23.55 లక్షలు ఉన్నాయి. అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 7.47 లక్షలు ఉంటే యూపీలో 2.45 లక్షలు ఉన్నాయి. ఏపీ 3వ స్థానంలో ఉంది. తెలంగాణలో 64,055 ఉన్నాయి.

రాష్ట్రం	జలవనరుల సంఖ్య (లక్షల్లో)
పశ్చిమ బెంగాల్	7.47
యూపీ	2.45
ఆంధ్రప్రదేశ్	1.91
ఒడిశా	1.82
అస్సాం	1.72
ఝార్ఖండ్	1.07
తమిళనాడు	1.07



వైభవంగా అప్పన్న డోలోత్సవం

పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఏటా చైత్రశుద్ధ ఏకాదశి రోజున జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని పాల్గుణ పౌర్ణమి రోజు డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా సింహగిరి నుంచి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఉదయం కొండదిగువకు తీసుకువచ్చి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి పుష్కరిణి కల్యాణమండపంలో ఉన్న ఉద్యానవన మండపంలో వేంజేపుచేసి వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించారు. తదుపరి డోలోత్సవాన్ని నిర్వహించారు. – సింహాచలం (విశాఖ)



అరుదైన నీటి కాకుల సందడి

తిరుపతి జిల్లా వాకాడులోని వైఎస్సార్ స్వర్ణముఖి బ్యారేజ్‌లో శుక్రవారం అరుదైన నీటి కాకులు నీటిలో జలకాలాడుతూ సందడి చేశాయి. ఇంతపెద్ద సంఖ్యలో నీటి కాకులు ఒకేచోట స్నానాలు ఆచరించి, సేదదీరడం కనిపించలేదని స్థానికులు తెలిపారు. ఇవి మామూలు సైజు కన్నా రెట్టింపు సైజులో ఉన్నాయన్నారు. అసలు ఇవి ఈ ప్రాంతంలోని నీటి కాకులు కాదని, విదేశీ వలస పక్షుల్లా ఉన్నాయని భావిస్తున్నారు. – వాకాడు



ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల శ్రీవారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసిన శ్రీ కుమారధార తీర్థ ముక్కోటి శుక్రవారం ఘనంగా జరిగింది. దీనికి వచ్చే భక్తులకు పాలు, కాఫీ, ఉప్మా, పొంగలి, సాంబారు అన్న ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరును టీటీడీ అందించింది. టీటీడీ విజిలెన్స్, పోలీస్, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. పాల్గుణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే కుమారధార తీర్థముక్కోటిలో స్నానమాచరించడాన్ని భక్తులు ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు. – తిరుమల

భక్తుల తలలపై పగిలిన కొబ్బరి కాయలు



శాంతిపురం: చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీలోని కదిరివృత్తనపల్లిలో జరుగుతున్న పంచరూప శివయ్య బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం కీలక ఘట్టం జరిగింది. దీనిలో భాగంగా భక్తులు తమ తలలపై కొబ్బరి కాయలు కొట్టించుకున్నారు. దేవర ఎద్దు తలపై కొబ్బరికాయ కొట్టాక.. నియమాల మేరకు పూజల్లో పాల్గొన్న భక్తుల తలలపై కొబ్బరి కాయలు కొట్టారు. రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి దాదాపుగా 3 లక్షలకు పైగా భక్తులు స్వామి వారి ఉత్సవాలను తిలకించారు. సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో పాటు మంత్రి సవిత, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు పంచరూప శివయ్యను దర్శించుకున్నారు. శనివారం స్వామి వారికి దీపారాధనలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

నేడు వెంకటపాలెంలో శ్రీనివాస కళ్యాణం

అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన టీటీడీ



సాక్షి, అమరావతి/తాడికొండ: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అంగరంగ వైభవంగా శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఘట్టానికి వేదికగా తిరుమల ఆలయం ఆవరణ నమూనాతో అలంకరించిన సభా వేదికను అత్యంత సుందరంగా అలంకరించారు. 27 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లుచేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఇక ఈ కళ్యాణ మహోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడును టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, జేఈఓ వెంకన్న చౌదరి శుక్రవారం ఆహ్వానించారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

300 బస్సుల ఏర్పాటు..

మరోవైపు.. ఈ ఉత్సవాన్ని 27వేల మంది వీక్షించేలా ఏర్పాట్లుచేసినట్లు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు వెల్లడించారు. వెంకటపాలెం ఆలయం వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు ఇక్కడకు వచ్చేందుకు వీలుగా టీటీడీ దాదాపు 300 బస్సులను ఏర్పాటుచేసిందన్నారు. అదేవిధంగా మందడం నుండి ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటుచేశారన్నారు.

సప్తగిరులపై సుందర దృశ్యం



తిరుమలేశుని సప్తగిరులు సుందర మనోహరంగా శోభిల్లుతున్నాయి. రెండవ ఘాట్ రోడ్‌లో వెండి మబ్బులు ఏడుకొండల ప్రకృతి అందాలను తిలకించేందుకు దివి నుంచి నేలపైకి వచ్చాయా అన్నట్లుగా దట్టంగా కమ్మేస్తున్నాయి. తిరుమల క్షేత్రాన్ని మేఘాలు ముద్దాడుతున్నట్లుగా కనిపిస్తున్న ఆ దృశ్యాలను భక్తులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ మురిసిపోతున్నారు. – తిరుమల

ఆంజనేయస్వామి ఆలయాన్ని కూల్చిన బీజేపీ నేతలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో బీజేపీ నేతలు ఆంజనేయస్వామి ఆలయాన్ని పునాదులతో సహా తవ్వేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మురకంబట్టులో 2009వ సంవత్సరంలో 1.40 ఎకరాల ప్రభుత్వ భూమిలో 50 సెంట్లలో శ్రీ సుందర వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని స్థానికులు నిర్మించారు. మిగిలిన 90 సెంట్లు ఆలయ మాన్యం కింద ఉండగా.. అక్కడ ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు తీర్మానం చేసి.. చందాలు వేసుకుని ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 16వ తేదీన స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సి ఉంది. అయితే ఆలయ భూమిపై కన్నేసిన స్థానిక బీజేపీ నాయకుడు చిన్ని, మరికొంతమంది కలిసి శుక్రవారం జేసీబీ తీసుకొచ్చి ఆంజనేయస్వామి



కూలిన ఆంజనేయ స్వామి ఆలయం

ఆలయాన్ని కూల్చేసి, పునాదులు కూడా తవ్వేశారు. నిందితులు బీజేపీ పార్టీకి చెందినవాళ్లు కావడంతో కూటమి ప్రజాప్రతినిధులు వాళ్లను కాపాడే ప్రయత్నం చేశారు. అయితే చిన్నితో పాటు ఈ దారుణానికి పాల్పడ్డ వాళ్లను పట్టుకుని శిక్షించాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో చిన్ని, అతని కుమారుడు రాజు, హీరోహోండా పుండరీకాక్షయ్య, ఆనంద్ అనే నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆనందం.. భావోద్వేగం ఆనంద భాష్పాలు!

40 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు



రాజంపేట టౌన్: ఒకటి కాదు.. రెండు కాదు.. 40 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో 1983–84లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం పట్టణంలోని చెర్రీస్ స్కూల్లో కలుసుకున్నారు. రాజంపేట పట్టణంలో ఉంటున్న రాఘవరెడ్డి ప్రేమలతారెడ్డి గత కొన్ని నెలలుగా చేస్తున్న కృషి ఫలించడంతో అమెరికా, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు సైతం తరలి వచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఆనంద భాష్పాలు రాల్చారు. ఈ సందర్భంగా తమ గురువులను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం దాకా ఎంతో సంతోషంగా గడిపి.. ఆ తర్వాత అక్కడి నుంచి భారంగా కదిలారు.

భగవంతుడా... ఇదేమి 'భద్రత'!

సెల్‌ఫోన్లు, లగేజితో ఆలయంలోకి వచ్చేస్తున్న భక్తులు, సిబ్బంది

- క్యూలైన్ల వద్ద అడిగే వాడే లేడు
- భద్రతను వదిలేసి, టికెట్లు తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ గార్డులు
- మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ డిటెక్టర్లు ఉన్నా వినియోగించని వైనం
- లగేజి స్కానర్ సైతం నిరుపయోగమే
- నిఘా విభాగం హెచ్చరించినా చర్యలు శూన్యం

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో ఆలయాల భద్రతను అధికారులు గాలికొదిలేశారు. క్షేత్రంలో అడుగడుగునా నిఘా, భద్రత లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఇక్కడ చేపట్టాల్సిన భద్రతపై పోలీసు, ఆక్టోపస్ భద్రతా దళం, నిఘా వర్గాలు పలు నివేదికలు ఇచ్చినప్పటికీ, వాటిని అమలు పరచడంలో దేవస్థానం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఉద్యోగులు, భక్తులు అందరూ సెల్‌ఫోన్లతో, లగేజి బ్యాగులతో ఆలయంలోకి ప్రవేశించేస్తున్నారు. ఆలయంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని ఈవో ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ సినా, కొందరు అధికారులు వాటిని బుట్టదాఖలు చేశారు. -శ్రీశైలం టెంపుల్

నిఘా కరువైన శ్రీశైలం దేవస్థానం



అలంకారప్రాయంగా హ్యాండ్ మెటల్ డిటెక్టర్



రూ.300 క్యూలైన్ ప్రవేశద్వారం వద్ద సిగ్నల్ ఇవ్వని డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్

శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనానికి సాధారణ రోజుల్లో రోజుకు 20 నుంచి 30వేల మంది, రద్దీ రోజుల్లో సుమారు 50 వేల మంది వస్తుంటారు. ఆలయంలో భద్రతకు సుమారు 40 మంది హోంగార్డులు, ఓ ఏజెన్సీ ద్వారా 180 మంది సెక్యూరిటీ గార్డులు, మరో రెండు ఏజెన్సీల ద్వారా 32 మంది సెక్యూరిటీ గార్డులు, ఐదుగురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు ఉన్నారు. హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ఆలయంలో, క్షేత్రంలోని వివిధ ప్రదేశాలలో సెక్యూరిట విధుల్లో ఉండాలి. అలాగే క్యూలైన్ల ప్రవేశ ద్వారాల వద్ద భక్తులు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పేలుడు పదార్థాలు తీసుకెళ్లకుండా తనిఖీలు చేయాలి. అయితే రూ.150, రూ.300 క్యూలైన్లు, ఆర్జితసేవల క్యూలైన్ వద్ద ఉండే సెక్యూరిటీ గార్డులు ఓ పర్యవేక్షకురాలి ఆదేశాలతో భద్రత విధులు వదిలేసి, టికెట్లు, ఆధార్ కార్డులు తనిఖీల్లో మునిగిపోతున్నారు. ఆ క్యూలైన్లలో పని చేసే హోంగార్డులు సైతం టికెట్ల తనిఖీలతోనే తలమునకలు అవుతున్నారు. ఈ వ్యవహారాన్ని ఇతర అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. దీంతో భక్తులు, సిబ్బంది ఆలయంలోకి యథేచ్ఛగా సెల్ ఫోన్లు, లగేజితో ప్రవేశిస్తున్నారు. ఎక్కడా ఏ దశలోనూ అడిగేవాడు, తనిఖీ చేసే వాళ్లు కనిపించడంలేదు.

సెక్యూరిటీ బాధ్యతలు వదిలేసిన గార్డులు



శ్రీశైలం ఆలయం

నిరుపయోగంగా భద్రత పరికరాలు

శ్రీశైల దేవస్థానం భక్తుల భద్రత దృష్ట్యా ఉచిత క్యూలైన్, ఆర్జిత సేవాకర్తల ప్రవేశ ద్వారం, శ్రీ కృష్ణదేవ రాయ గోపురం, రూ.150 క్యూలైన్, రూ.300 క్యూలైన్, హరిహరరాయగోపురం, అమ్మవారి ఆలయం వెనుక తదితర చోట్ల డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ డిటెక్టర్లను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఆర్జిత సేవా కర్తల ప్రవేశ ద్వారం, శ్రీకృష్ణదేవరాయగోపురం వద్ద డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఇటీవల తొలగించారు. మిగతా చోట్ల ఉన్నవీ పనిచేయక, అలంకారప్రాయంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం లగేజ్ స్కానర్‌ను దేవస్థానం ఏర్పాటు చేసినప్పటికీ ఇంతవరకు వినియోగించిన దాఖలాల్లేవు. ఇక ఆలయంలో సెల్‌ఫోన్ జామర్లు లేకపోవడం చూస్తే భద్రతను ఏ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారో అర్థమవుతోంది.

హెచ్చరికలు బేఖాతరు

శ్రీశైలం ఆలయం భద్రతపై ఆక్టోపస్ బృందాలు పలుమార్లు మాక్‌డ్రిల్ నిర్వహించాయి. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో స్వీయ పర్యవేక్షణ చేపట్టి పలు భద్రతా చర్యలు చేపట్టాలని సూచిస్తూ దేవస్థానానికి నివేదికలు కూడా ఇచ్చారు. నిఘా విభాగాలు కూడా క్షేత్ర భద్రతపై పలుమార్లు హెచ్చరించినా ఆలయ అధికారుల తీరులో మార్పురాలేదు.

స్క్రీనింగ్ చేస్తున్నాం



శ్రీశైలం దేవస్థానంలోని ఉభయ దేవాలయాల్లోకి ప్రవేశించే భక్తులు ఎలాంటి సెల్‌ఫోన్లు, నిషేధిత వస్తువులు తీసుకెళ్లకుండా స్క్రీనింగ్ చేస్తున్నాం. ఇప్పటికే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశాం. ఆలయంలో భద్రతను మరింత పటిష్టం చేస్తాం.

– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

11మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు

ఎస్పీ అమిత్ బర్దర్



పాడేరు (అల్లూరి జిల్లా): నిషేధిత సీపీఐ మావోయిస్టు గాలికొండ ఏరియా కమిటీకి చెందిన 11 మంది మిలీషియా సభ్యులు శుక్రవారం లొంగిపోయారు. ఎస్పీ అమిత్‌బర్దర్ వివరాలు వెల్లడించారు. పాంగి నర్సింగ్, తుంబేలి వెంకటరావు, పాంగి సాన్న, మర్రి కేశవరావు, మర్రి కామేశ్వరరావు, మర్రి సత్తిబాబు, మర్రి సింగ్రు, పాంగి రత్ను, పాంగి కృష్ణ, పాంగి రత్తు, మర్రి పూలు గాలికొండ ఏరియా కమిటీలో మిలీషియా సభ్యులుగా పనిచేసేవారు. వీరు జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో వీరవరం, నల్లబిల్లి, పెద్ద అగ్రహారం, చిన్న అగ్రహారం తదితర ప్రాంతాల్లో జరిగిన అనేక హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నారు. వీరందరిపై సుమారు 11 క్రిమినల్ కేసులున్నాయి. మావోయిస్టుల సిద్ధాంతాలు నచ్చక, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా లొంగిపోయారు. జిల్లా అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా, సీఆర్పీఎఫ్ అధికారి దుర్గేష్ రాయ్, ఎస్‌బీ సీఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

రెండు వేర్వేరు చోట్ల ప్రమాదాలు

తాడేపల్లిగూడెం రూరల్/కురబలకోట(అన్నమయ్య జిల్లా): రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడగా, అన్నమయ్య జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌కు చెందిన భోగెల్లి వెంకటసత్యసురేన్(37), నవ్య (35), వాసకికృష్ణ(5), శ్రీరమ్యలు తూర్పుగోదావరి జిల్లా ఏడిద గ్రామంలోని ఓ కార్యక్రమానికి కారులో వెళుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వీరి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటసత్యసురేన్, నవ్యలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన వారి కుమార్తె వాసకికృష్ణ, మరో మహిళ శ్రీరమ్యలను తణుకు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వాసకికృష్ణ మృతి చెందగా.. శ్రీరమ్యను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి అన్నమయ్య జిల్లా గాలివీడుకు కడప బండలతో వెళుతున్న లారీని తానామిట్ట వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఘటనలో కంటైనర్ డ్రైవర్ భాస్కర్(36), లారీ క్లీనర్ సయ్యద్ హసన్(28)లు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. లారీ డ్రైవర్ నాగేశ్వరరావును బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. భాస్కర్‌ది కర్ణాటక రాష్ట్రం కాగా, సయ్యద్ హసన్‌ది అన్నమయ్య జిల్లా రాయచోటి. మృతదేహాలకు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



కుంచనపల్లి వద్ద లారీని ఢీకొన్న కారు



తానామిట్ట వద్ద ఢీకొన్న వాహనాలు

దుబాయ్‌లో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



దుబాయ్‌లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐలు

కడప కార్పొరేషన్: దుబాయ్‌లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దుబాయ్‌లోని కరామా ఏరియాలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ సభ్యులంతా కలిసి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత సయ్యద్ అక్రమ్ మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. యంగ్ అండ్ డైనమిక్ లీడర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నడుస్తున్న పార్టీలో తాము పనిచేస్తున్నందుకు గర్విస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేసి, విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూఏఈ–దుబాయ్ విభాగం సభ్యులు చక్రి, ప్రేమ్ అన్నా, ఫయీమ్‌బాయ్, అజీజ్, అబ్దుల్లా, ఇర్షాద్‌బాయ్, అనిల్, విజయ్, రఫీక్, బాలయేసు, జోగయ్య, రాము, రమేష్, శ్రీను, భాస్కర్, చిన్నా, గాబ్రియేల్, జాన్సన్, సతీష్, విజయ, ప్రభావతి, కుమారి, సునీత, శాంత, శ్రీలక్ష్మి, భారతి, లక్ష్మి, శిరీషా, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.



ఆలయం వెలుపల సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు, ఏపీ హైకోర్టు జస్టిస్ వేణుగోపాల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్

తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. - తిరుమల



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.శ్రావణ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వేదాశీస్సులు, ఏఈవో కృష్ణారావు సత్యదేవుని చిత్రపటం, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. - అన్నవరం

వైభవంగా నృసింహుని రథోత్సవం



'జయ నరసింహ, జయ జయ లక్ష్మీ నరసింహ' భక్తజనుల నినాదాల మధ్య మంగళాద్రివాసుని దివ్య రథోత్సవం సాగింది. గుంటూరు జిల్లా, మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవాల్లో ఆఖరి ఘట్టమైన స్వామివార్ల దివ్య రథోత్సవం వైభంగా జరిగింది. స్వామివారిని, రథాన్ని, నూతన వస్త్రాలు, పూలమాలలు, గజమాలలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం 4 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 7 గంటలకు ముగిసింది.

- మంగళగిరి టౌన్



కోడిగుడ్లు ఇస్తారా.. ప్లీజ్!

డెన్మార్క్, యూరప్ దేశాలను వేడుకుంటున్న అమెరికా

వాషింగ్టన్: అమెరికాలో కోడిగుడ్ల ధరల ఆకాశాన్నంటుతున్నాయి. నానాటికీ పెరిగిపోతున్నాయే తప్ప ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. బర్డ్‌ఫ్లూ వల్ల కోళ్లు చాలావరకు చనిపోయాయి. దాంతో గుడ్ల కొరత తలెత్తింది. అమెరికా మార్కెట్‌లో గుడ్ల ధరలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుడ్ల ధరలను నేలకు దించడానికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి దిగుమతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. తమకు తగినన్ని కోడిగుడ్లు సరఫరా చేయాలని డెన్మార్క్‌తోపాటు ఇతర యూరప్ దేశాలకు తాజాగా విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అమెరికా వ్యవసాయ విభాగం ఆయా దేశాలకు లేఖలు రాసింది. ట్రంప్ ప్రభుత్వం ఒకవైపు యూరప్ దేశాల ఉత్పత్తులపై సుంకాలు విధిస్తూ, మరోవైపు గుడ్లు సరఫరా చేయాలని కోరుతుండడం గమనార్హం. యూరప్‌లో కూడా తగినంత గుడ్ల ఉత్పత్తి లేదని, అమెరికాకు ఇప్పట్లో భారీగా గుడ్లు ఎగుమతి చేయడం కష్టమేనని డెన్మార్క్ ఎగ్ అసోసియేషన్ వెల్లడించింది. ఇదిలా ఉంటే, డెన్మార్క్‌పై డొనాల్డ్ ట్రంప్ గుడ్లురుముతున్నారు. గ్రీన్‌లాండ్‌ను తమకు అప్పగించకపోతే డెన్మార్క్‌పై ఆర్థిక ఆంక్షలు విధిస్తామని ఇప్పటికే హెచ్చరించారు. అమెరికాలో గత ఏడాది డిసెంబర్ నుంచి గుడ్ల ధరలు క్రమంగా ఎగబాకుతున్నాయి. ఈ నెల 5వ తేదీన డజన్ గుడ్ల ధర 8.64 డాలర్లకు (రూ.751) చేరుకుంది. అంటే ఒక్కో గుడ్డు ధర 62 రూపాయలు. ఈ నెల 5 నుంచి గుడ్ల ధరలు తగ్గుతున్నట్లు అమెరికా వ్యవసాయ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం డజన్ గుడ్ల ధర 4.90(రూ.425) డాలర్లుగా ఉన్నట్లు పేర్కొంది.



అమెరికా విమానంలో మంటలు

రెక్కల మీదుగా ప్రయాణికులను తరలించిన సిబ్బంది

డెన్వర్: అమెరికాలో కొలరాడోలోని డెన్వర్‌లో పెను ప్రమాదం తప్పింది. నిలిపి ఉంచిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో మంటలు చెలరేగాయి. స్ప్రింగ్స్ నుంచి బయలుదేరిన బోయింగ్ 737–800 విమానం డెన్వర్ విమానాశ్రయంలో గేట్ సీ38 వద్ద నిలిపి ఉండగా విమానం నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. దీంతో.. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను ఖాళీ చేయించారు. మరోవైపు అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. విమానం తరలింపు స్లైడ్లను ఉపయోగించి.. ప్రయాణికులను రెక్కల మీదుగా తరలిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జెట్ ఫ్యూయల్ ఇగ్నిషన్ వల్ల మంటలు వచ్చాయని సమాచారం. విమానంలో పొగలు కమ్ముకున్నాయని, ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం వెల్లడించింది. అమెరికాలో వరుస ప్రమాదాల నేపథ్యంలో విమానయాన భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో మరో ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. అమెరికాలో రద్దీగా ఉండే డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ 1,500 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

గ్రీన్ కార్డు శాశ్వత నివాసానికి...

హక్కు కాదు: వాన్స్

బాంబు పేల్చిన అమెరికా ఉపాధ్యక్షుడు | గ్రీన్‌కార్డున్నా తిప్పి పంపుతామని వ్యాఖ్యలు



వాషింగ్టన్/న్యూఢిల్లీ: అమెరికా వలస విధానంపై ఇప్పటికే ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆందోళనలను మరింతగా పెంచే పరిణామం చోటుచేసుకుంది. డాలర్ డ్రీమ్స్‌ను నిజం చేసుకోవడానికి రాచబాటగా భావించే అమెరికా గ్రీన్‌కార్డుపై ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌కార్డు ఉన్నంతమాత్రాన అమెరికాలో నివాసానికి, పని చేయడానికి శాశ్వత హక్కులు దఖలు పడ్డట్టు కాదని స్పష్టం చేశారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ విద్యార్థి మహ్మద్ ఖలీల్ యూదు విద్వేష ఆరోపణలపై ఇటీవలే అరెస్టవడం తెలిసిందే. అతను గ్రీన్‌కార్డు హోల్డరే కావడాన్ని ప్రస్తావిస్తూ వాన్స్ పలు వ్యాఖ్యలు చేశారు. ''ఇదేమీ వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం కాదు. జాతీయ భద్రతకు సంబంధించిన అతి కీలకమైన విషయం. అంతకుమించి, అమెరికాలో శాశ్వత నివాసులుగా మాతోపాటు ఎవరుండాలన్న దానికి సంబంధించిన అంశం. దీన్ని నిర్ణయించేది అమెరికన్లు మాత్రమే'' అంటూ కుండబద్దలు కొట్టారు. ఆయన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా, ముఖ్యంగా భారత్‌లో దుమారం రేపుతున్నాయి. ఏటా భారీ సంఖ్యలో అమెరికా బాట పట్టే భారత విద్యార్థులందరికీ గ్రీన్‌కార్డు ఒక బంగారు కల. అది చిక్కిందంటే అమెరికాలో శాశ్వత నివాసం దక్కినట్టేనని భావిస్తారు. వాన్స్ వ్యాఖ్యలు వారినేగాక అమెరికాలో గ్రీన్‌కార్డు హోల్డర్లయిన లక్షలాది మంది భారతీయులను కూడా కలవరపాటుకు గురిచేస్తున్నాయి.

గురువారం ఫాక్స్ న్యూస్ చానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంగా వలస విధానాలకు సంబంధించి వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''కొలంబియా వర్సిటీలో హమాస్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న విద్యార్థి ఖలీల్ కూడా గ్రీన్‌కార్డు హోల్డరే. అందుకే చెబుతున్నా, గ్రీన్‌కార్డు హోల్డర్‌కు అమెరికాలో శాశ్వతంగా ఉండిపోయే హక్కు లేదు'' అని స్పష్టం చేశారు. గ్రీన్‌కార్డు హోల్డర్లయినా సరే, అమెరికా భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు అనుమానిస్తున్న విద్యార్థులు తదితరులపై కఠిన చర్యలకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోందని ఉపాధ్యక్షుడు ప్రకటించారు. ''వారి ఉనికి అమెరికాకు ముప్పని తేలిన పలువురిని త్వరలో తిప్పి పంపుతున్నాం. ఈ జాబితాలో విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ఉన్నారు'' అని వివరించారు. ట్రంప్ రాకతో అమెరికాలోకి అక్రమ వలసలు 95 శాతానికి పైగా తగ్గిపోయాయన్నారు.

ఏమిటీ గ్రీన్‌కార్డు?



పర్మనెంట్ రెసిడెంట్ (శాశ్వస నివాస) కార్డు. గ్రీన్‌కార్డుగా భారత్‌లో దాదాపు ఇంటింటికీ పరిచయం. ఇది విదేశీ పౌరులకు అమెరికాలో నివసించేందుకు, పని చేసుకునేందుకు హక్కు కల్పిస్తుంది. అంతేగాక కోరుకున్న కంపెనీలో పని చేయవచ్చు. సొంత వ్యాపారం వంటివీ చేసుకోవచ్చు. గ్రీన్‌కార్డు పొందిన మూడు నుంచి ఐదేళ్లకు పౌరసత్వం కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే నిజానికిది పేరుకే శాశ్వత నివాస కార్డు. వాన్స్ చెప్పినట్టుగా అమెరికాలో శాశ్వతంగా ఉండేందుకు హక్కు కల్పించదు. దీన్ని పదేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. కొన్ని పరిస్థితుల్లో గ్రీన్‌కార్డును రద్దు చేయవచ్చు. నేర కార్యకలాపాల్లో పాల్గొన్నా, చాలాకాలం పాటు అమెరికాకు దూరంగా ఉన్నా, వలస నిబంధనలను ఉల్లంఘించినా గ్రీన్‌కార్డును కోల్పోతారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులు దశాబ్దాలుగా గ్రీన్‌కార్డుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. వారిలో చాలామందికి కార్డు దక్కాలంటే 50 ఏళ్ల దాకా పట్టొచ్చట. కొన్ని కేటగిరీల వాళ్లకైతే ఇప్పుడున్న పరిస్థితులను బట్టి గ్రీన్‌కార్డు రావాలంటే 134 సంవత్సరాలు పడుతుంది! 3.4 కోట్ల మందికి పైగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తుండగా వారిలో 11 లక్షల మందికి పైగా భారతీయులే! వీరిలో 4 లక్షల మంది తమ జీవితకాలంలో కార్డును కళ్లజూడలేరన్నది ఇమిగ్రేషన్ నిపుణుల మాట. అమెరికా ఏటా గరిష్ఠంగా 6.75 లక్షల గ్రీన్ కార్డులు మాత్రమే జారీ చేస్తుంది. వాటిలో ఏ దేశానికీ 7 శాతానికి మించి ఇవ్వరాదన్న నిబంధన ఉంది. ఇదే భారతీయులకు పెద్ద అడ్డంకిగా మారింది. ప్రస్తుతం అమెరికాలో గ్రీన్‌కార్డున్న భారతీయుల సంఖ్య 3 లక్షలకు పైగా ఉంటుంది.

గోల్డ్ కార్డు రాకతో...

అమెరికాలో శాశ్వత నివాసానికి ట్రంప్ ఇటీవల కొత్తగా గోల్డ్ కార్డు స్కీమును ప్రకటించిన నేపథ్యంలో గ్రీన్‌కార్డు ప్రాధాన్యతను తగ్గించేలా వాన్స్ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''ఇప్పటి దాకా గ్రీన్‌కార్డుంది. ఇకపై గోల్డ్‌కార్డు తెస్తున్నాం. గ్రీన్‌కార్డు ఇచ్చే సదుపాయాలన్నింటినీ ఇదీ ఇస్తుంది. వాటితో అదనంగా అమెరికాలో శాశ్వత నివాసానికి, పౌరసత్వానికి కూడా గోల్డ్‌కార్డు రాచమార్గం'' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని అత్యున్నత వర్సిటీల్లో చదివే ప్రతిభావంతులు, భారతీయ విద్యార్థులు దేశం దాటకుండా ఆపడంలో తమ వలస విధానం విఫలమైందని ఆయన ఆక్షేపించారు. గోల్డ్‌కార్డుకు 50 లక్షల డాలర్లు (రూ.43.54 కోట్లు) ఫీజుగా నిర్ణయించారు. ''కనీసం కోటి గోల్డ్‌కార్డులు అమ్మాలన్నది మా లక్ష్యం. తద్వారా వచ్చే ఆదాయంతో అమెరికా అప్పు తీరుస్తాం'' అని ట్రంప్ ప్రకటించారు. 1990 నుంచి అమల్లో ఉన్న ఈబీ–5 వీసాలను గోల్డకార్డు భర్తీ చేసింది.


ఉగ్రవాద మూలకేంద్రం పాకిస్తానే

- ఆధారాల్లేకుండా భారత్‌పై ఆరోపణలు చేయొద్దు
- పాకిస్తాన్‌కు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హితవు

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని భారతదేశం ప్రోత్సహిస్తోందంటూ పాకిస్తాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గట్టిగా తిప్పికొట్టారు. అంతర్జాతీయ ఉగ్రవాదానికి మూలకేంద్రం ఏమిటో ప్రపంచం మొత్తానికి తెలుసని తేల్చిచెప్పారు. ఉగ్రవాదుల ఉత్పత్తి కర్మాగారం పాకిస్తానేనని పరోక్షంగా మండిపడ్డారు. ఆధారాల్లేకుండా ఆరోపణలు చేయొద్దని పాకిస్తాన్‌కు స్పష్టంచేశారు. రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతరులపై వేలెత్తి చూపించే బదులు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి, ఆత్మ సమీక్ష చేసుకోండి అని పాక్ పాలకులకు, అధికారులకు సూచించారు. మీ అంతర్గత సమస్యలు, వైఫల్యాలకు కారణాలను ఇతరులపైకి నెట్టేయడం మానుకోండి అని హితవు పలికారు. తప్పుడు ఆరోపణలు ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ ఘటన తర్వాత పాకిస్తాన్ విదేశాంగ శాఖ కార్యాలయ ప్రతినిధి షఫ్ఖత్ అలీ ఖాన్ గురువారం భారతదేశంపై నిందలు మోపారు. భారత ప్రభుత్వం ఉగ్రవాదులకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. రైలు హైజాక్ ఘటనకు భారతదేశమే కారణం అనే రీతిలో పరోక్షంగా విమర్శలు చేశారు.

ఉద్యోగాల కంటే నిరుద్యోగులు ఎన్నో రెట్లు ఎక్కువ

- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత పాటించాల్సిందే
- కొందరి స్వలాభం కోసం ఇతరులు నష్టపోవడానికి వీల్లేదు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: దేశంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల కంటే వాటిని ఆశించే నిరుద్యోగులు ఎన్నో రెట్లు ఎక్కువగా ఉన్నారని సుప్రీంకోర్టు వెల్లడించింది. వాస్తవ పరిస్థితి ఇదేనని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఆయా ఉద్యోగాలు కచ్చితంగా అర్హులకే దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవకతవకలకు చోటు లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను సంబంధిత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారానే భర్తీ చేయాలని, అక్రమ మార్గాలు అనుసరించకూడదని తేల్చిచెప్పింది. పరీక్షల్లో అక్రమాలను అరికట్టాలని పేర్కొంది. రాజస్తాన్‌లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో నిబంధనలు పాటించకుండా రాజీపడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు వ్యక్తులకు కింది కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజస్తాన్‌లో 2022లో అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) పోస్టుల భర్తీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఓ సెంటర్‌లో ఒక అభ్యర్థి బదులు మరో అభ్యర్థి(డమ్మీ) హాజరైనట్లు తేలింది. ఇద్దరు అధికారుల ప్రోద్బలంతోనే ఇదంతా జరిగినట్లు విచారణలో గుర్తించారు. ఆ ఇద్దరు అధికారులు రాజస్తాన్ హైకోర్టును ఆశ్రయించడంతో బెయిల్ మంజూరయ్యింది. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ రాజస్తాన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కింది కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వును తోసిపుచ్చింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఈ నెల 7వ తేదీన నిందితులను ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేలాది మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారని, వారికి అన్యాయం జరిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కొందరు స్వలాభం కోసం ఉద్దేశపూర్వకంగా చేసే తప్పులతో ఇతరులు నష్టపోవడానికి వీల్లేదని ఉద్ఘాటించింది. పోటీ పరీక్షల పారదర్శకతను దెబ్బతీయొద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

పిల్లలు ఫిర్యాదు చేయగానే...

టీచర్ల అరెస్టు కూడదు

నిర్ధారించుకున్నాకే చర్యలు... పోలీసులకు కేరళ హైకోర్టు ఆదేశం

- ఆందోళనకరంగా విద్యార్థుల ప్రవర్తన
- స్కూళ్లలోకి ఆయుధాలు, డ్రగ్స్, మద్యం
- టీచర్లపై బెదిరింపులు, భౌతిక దాడులు
- సదుద్దేశంతో శిక్షించినా వారిపై కేసులు
- ఉపాధ్యాయుల చేతిలో బెత్తం తప్పనిసరి
- అప్పుడే పిల్లల్లో భయం: న్యాయమూర్తి

కొచ్చి: ఉపాధ్యాయులు, ఇతర బోధన సిబ్బందిపై ఫిర్యాదుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగానే నేరుగా టీచర్ల అరెస్టు వంటి చర్యలకు దిగొద్దు. ప్రాథమికంగా దర్యాప్తు చేసి, నేరం జరిగినట్టు రుజువయ్యాకే చర్యలు తీసుకోవాలి'' అని పోలీసులను ఆదేశించింది. ఈ దిశగా తక్షణం సర్క్యులర్ జారీ చేయాల్సిందిగా డీజీపీకి ఆదేశాలు జారీచేసింది. విద్యార్థులు స్కూళ్లలోకి ఆయుధాలు, మద్యం, డ్రగ్స్ తదితరాలను యథేచ్ఛగా తీసుకెళ్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది తప్పనిసరని న్యాయమూర్తి జస్టిస్ పి.వి.కున్హికృష్ణన్ అభిప్రాయపడ్డారు. విద్యార్థిని బెత్తంతో కొట్టిన కేసులో ఓ టీచరుకు ఆయన ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. కేరళలో విద్యార్థులు, యువత ప్రవర్తన చాలా ఆందోళనకరంగా ఉందని ఈ సందర్భంగా ఆవేదన వెలిబుచ్చారు. ''వారు తీవ్ర నేరాలకు కూడా పాల్పడుతున్నారు. టీచర్లనే బెదిరిస్తున్నారు. వారిని ఘెరావ్ చేస్తున్నారు. భౌతిక దాడులకు దిగుతున్నారు. దీనికి తక్షణం అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది'' అన్నారు. క్లాసురూముల్లో బెత్తం పట్టుకునేందుకు టీచర్లను అనుమతించాలని అభిప్రాయపడ్డారు. ''ప్రతిసారీ బెత్తం వాడాలని కాదు. అది టీచర్ల చేతిలో ఉంటే చాలు, తప్పు చేసేందుకు విద్యార్థులు జంకుతారు. తప్పు చేసిన విద్యార్థులకు టీచర్లు చిన్నపాటి శిక్ష విధించాలి. అది నేరమేమీ కాదు. పైగా అంతిమంగా మన విద్యావ్యవస్థ మరింత బలోపేతమయ్యేందుకు తోడ్పడుతుంది. కానీ బాగుపడాలనే సదుద్దేశంతో గిల్లినా, గిచ్చినా, మందలించినా టీచర్లపై క్రిమినల్ కేసులు పెడుతున్నారు. దీన్నుంచి వారికి రక్షణ కల్పించాలి. లేదంటే పని చేయలేరు'' అన్నారు. ''టీచర్లంతా సాధుసత్తములని చెప్పడం లేదు. వాళ్లలోనూ కొందరు చెడ్డవాళ్లు ఉండవచ్చు. కానీ విద్యార్థిని మనిషిగా తీర్చిదిద్దడంలో టీచర్లది కీలక పాత్ర అని మర్చిపోవద్దు'' అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన

హోలీ, రంజాన్ ప్రార్థనలు



అహ్మదాబాద్‌లోని కాలూపూర్ స్వామినారాయణ్ ఆలయంలో..

న్యూఢిల్లీ: దేశమంతటా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. జనం రంగుల్లో మునిగితేలారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. హోలీ రంగులతో ఇళ్లు, వీధులు కొత్తరూపు సంతరించుకున్నాయి. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ప్రజలంతా ఆనందోత్సాహాలతో గడిపారు. పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు సైతం హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు రెండో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఏడాది హోలీ, రంజాన్ శుక్రవారం ప్రార్థనలు ఒకేరోజు వచ్చాయి. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అదనపు బలగాలను రంగంలోకి దించారు. మసీదుల వద్ద పెద్ద సంఖ్యలో సీసీటీవీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల డ్రోన్లు సైతం మోహరించారు. కొన్ని ప్రాంతాల్లో మసీదు కమిటీల పిలుపు మేరకు హోలీ ఉత్సవాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో మొఘల్ పాలకుల కాలంనాటి షాహీ జామా మసీదులో గత ఏడాది నవంబర్‌లో సర్వే ప్రారంభించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అక్కడ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి అవాంతరాలు తలెత్తలేదు. సంభాల్‌లో సంప్రదాయ 'చౌపాయ్ కా జులూస్' శాంతియుతంగా జరిగింది. పోలీసుల చర్యలు సత్ఫలితాలిచ్చాయి. దేశవ్యాప్తంగా హోలీ వేడుకలు, రంజాన్ ప్రార్థనలు ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఉక్రెయిన్ సైనికులను దయతలచి వదిలేయండి

పుతిన్‌కు ట్రంప్ ఫోన్

వాషింగ్టన్/మాస్కో: ''పాపం ఉక్రెయిన్ సైనికులు! అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వాళ్లను రష్యా సైన్యం అన్నివైపుల నుంచీ దిగ్బంధించింది. వారినింకా వేటాడితే సామూహిక హననానికి, రెండో ప్రపంచయుద్ధం తర్వాత అతి దారుణమైన రక్తపాతానికి దారితీస్తుంది. కనుక వాళ్లను చంపకండి. దయచేసి వదిలేయండి'' రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా విజ్ఞప్తులివి! ఈ విషయమై పుతిన్‌తో ఫోన్ చర్చలు జరిపినట్టు శుక్రవారం ఆయన ప్రకటించారు. ''చర్చలు ఫలప్రదంగా సాగాయి. ఉక్రెయిన్ యుద్ధానికి, భయానక రక్తపాతానికి అతి త్వరలో తెర పడుతుందని ఆశిస్తున్నా'' అని తన సొంత సోషల్ మీడియా హాండిల్ ట్రూత్‌లో చెప్పుకొచ్చారు. అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ఇప్పటికే అంగీకరించడం, పుతిన్ కూడా సూత్రప్రాయంగా సరేననడం తెలిసిందే. అయితే తాజాగా ఆయన స్వరం మార్చారు. కాల్పుల విరమణకు ముందు చర్చించుకుని తేల్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ''వాటిపై బహుశా అమెరికా, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చిస్తాం. ట్రంప్‌కు కూడా కాల్‌చేసి మాట్లాడతా'' అని ప్రకటించారు. దీనిపై ఉక్రెయిన్ మండిపడింది. కావాలనే శాంతిప్రక్రియకు మోకాలడ్డుతున్నారని ఆక్షేపించింది.

కెనడా ప్రధానిగా కార్నీ ప్రమాణం

టొరంటో: కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ (59) శుక్రవారం ప్రమాణం చేశారు. అమెరికాతో తీవ్రమవుతున్న విభేదాలు, టారిఫ్‌ల యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో కార్నీకి ఇది ముళ్లకిరీటమే కానుంది. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవమున్న ఆయన ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం.

'చిప్'ల కోసం ట్రంప్ స్కెచ్

- అమెరికాలో రూ.8.69 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న తైవాన్ సంస్థ
- చిప్‌ల తయారీ రంగం తరలిపోతుందంటూ విపక్షాల ఆందోళన
- ట్రంప్‌కు 'ప్రొటెక్షన్ ఫీజు' చెల్లిస్తున్నారని ప్రభుత్వంపై మండిపాటు
- తైవాన్ గతి చివరికి ఉక్రెయిన్‌లా మారుతుందని అనుమానాలు



వాషింగ్టన్/తైపీ: సెమీ కండక్టర్ల తయారీలో ద్వీప దేశమైన తైవాన్‌దే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తున్న సెమీ కండక్టర్లలో 90 శాతానికి పైగా తైవాన్‌లో తయారైనవే. సెల్‌ఫోన్ల నుంచి అత్యాధునిక డ్రోన్ల దాకా ప్రతి ఎలక్ట్రానిక్ పరికరంలో ఈ చిప్‌లు ఉండాల్సిందే. చిప్‌ల రారాజుగా తైవాన్ తలపై ఉన్న కిరీటాన్ని తన్నుకుపోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద స్కెచ్ వేశారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన సంస్థగా పేరున్న తైవాన్ సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ(టీఎస్ఎంసీ)తో అమెరికాలో 100 బిలియన్ డాలర్ల (రూ.8.69 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టిస్తున్నారు. ఈ మేరకు ఆ కంపెనీని ఒప్పించారు. గతవారం ఒప్పందం కూడా చేసుకున్నారు. ఈ నిధులతో టీఎస్ఎంసీ అమెరికాలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయనుంది. అంటే సెమీకండక్టర్లు అమెరికాలోనే ఉత్పత్తి అవుతాయి. అక్కడి నుంచే విదేశాలకు చిప్‌ల ఎగుమతి జరుగుతుంది. ఆదాయం చాలావరకు అమెరికా ఖాతాలోకి వెళ్లిపోతుంది. చిప్‌ల ఉత్పత్తిలో తైవాన్ ప్రాధాన్యం తగ్గిపోతుంది. ఇదే ఇప్పుడు తైవాన్‌లో మంటలు రాజేస్తోంది.

జాతీయ భద్రతా సంక్షోభం

తైవాన్ అధికార డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(డీపీపీ)పై మాజీ అధ్యక్షుడు మా యింగ్–జియూ నిప్పులు చెరిగారు. చైనా బారి నుంచి తైవాన్‌ను కాపాడుతున్నందుకు ట్రంప్‌కు 'ప్రొటెక్షన్ ఫీజు' చెల్లిస్తున్నారని డీపీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. టీఎస్ఎంఎస్‌ను అమెరికాకు అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం జాతీయ భద్రతా సంక్షోభమేనని తేల్చిచెప్పారు. అమెరికాలో 8.69 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడాన్ని తప్పుపట్టారు. చిప్‌ల తయారీలో తైవాన్ స్థానాన్ని దిగజార్చడం తగదని అన్నారు. ట్రంప్‌తో కుదుర్చుకున్న ఒప్పందం తైవాన్ ప్రజల విశ్వాసాన్ని, ఇతర సంబంధాలను దెబ్బతీస్తుందని మా యాంగ్–జియూ ఆందోళన వ్యక్తంచేశారు. భవిష్యత్తులో భౌగోళిక రాజకీయాల్లో తైవాన్ హోదాను దిగజారుస్తుందని అన్నారు. అయితే, అమెరికాలో పెట్టుబడులపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని తైవాన్ అధ్యక్షుడు లా చింగ్–తే స్పష్టంచేశారు. టీఎస్ఎంసీ విస్తరణ కోసమే ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. దేశ ప్రతిష్టకు వచ్చే ముప్పేమీ లేదని ప్రజలకు హామీ ఇచ్చారు.

తైవాన్‌ను గాలికొదిలేస్తారా?

తైవాన్‌పై పొరుగు దేశం చైనా ఎప్పటి నుంచో కన్నేసింది. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమేనని, ఏనాటికైనా విలీనం కాక తప్పదని చైనా చెబుతోంది. మరోవైపు అమెరికా మద్దతుతోనే తైవాన్ స్వతంత్ర దేశంగా మనుగడ సాగిస్తోంది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం తైవాన్ రక్షణ బాధ్యతను అమెరికా స్వీకరించింది. ఇందుకోసం తైవాన్ రిలేషన్స్ యాక్ట్ తీసుకొచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తైవాన్ విషయంలో అమెరికా స్వరం మారింది. ప్రధానంగా తైవాన్‌కు జీవనాడిగా ఉన్న చిప్‌ల తయారీ రంగంపై ట్రంప్ దృష్టి పెట్టారు. అక్కడి పరిశ్రమను క్రమంగా అమెరికా తరలించాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. తమ దేశాన్ని పీల్చిపిప్పి చేసి, ఆఖరికి గాలికి వదిలేయాలన్నదే ట్రంప్ ప్లాన్ అని తైవాన్ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తైవాన్ మరో ఉక్రెయిన్‌లా మారినా ఆశ్చర్యం లేదని అంటున్నాయి. అమెరికా–తైవాన్ సంబంధాల భవితవ్యంపై అనిశ్చితి నెలకొన్నట్లు తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. 'ఈ రోజు ఉక్రెయిన్, రేపు తైవాన్' అనే మాట తైవాన్‌లో తరచుగా వినిపిస్తోంది.



సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా శుక్రవారం కనువిందు చేసిన బ్లడ్ మూన్. చిలీలోని శాంటియాగో ఫోస్టర్ అబ్జర్వేటరీ ద్వారా దానిపైకి ఇలా లేజర్ కిరణాలను ఫోకస్ చేశారు. ఉత్తర, దక్షిణ అమెరికా, యూరప్, ఆఫ్రికా ఖండాలవారికి ఇది కనిపించింది. తదుపరి సంపూర్ణ చంద్రగ్రహణం మళ్లీ ఏడాది తర్వాత సంభవించనుంది.

24, 25 తేదీల్లో

బ్యాంకుల సమ్మె

సాక్షి, న్యూఢిల్లీ: మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మెకు బ్యాంకు ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. కీలక డిమాండ్లపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిపిన చర్చల్లో ఫలితం లేకపోవడంతో ప్రకటించిన విధంగానే రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) తెలిపింది. నియామకాలు, ఐదు రోజుల పనిదినాలు సహా పలు డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సీబీఈ) జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ తెలిపారు.

యునెస్కో తాత్కాలిక జాబితాలోకి తెలంగాణలోని ముడమాల్ నిలువురాళ్లు

న్యూఢిల్లీ: తెలంగాణలోని నారాయణపేట జిల్లా ముడుమాల్‌లో ఉన్న నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా తాత్కాలిక జాబితాలో చోటు దక్కింది. వీటితోపాటు అశోకుని శాసన నిలయాలు, చౌసట్టీ యోగినీ దేవాలయాల వంటి ఆరు చారిత్రాత్మక కట్టడాలను జాబితాకు భారత్ నామినేట్ చేసింది. వీటిని మార్చి 7న తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు యునెస్కోలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం ఎక్స్‌లో తెలిపింది. ఒక ఆస్తిని ప్రపంచ వారసత్వ గుర్తింపు రావాలంటే.. వరల్డ్ హెరిటేజ్ సెంటర్ తాత్కాలిక జాబితాలో చేర్చాలి. ఈ ఏడాది భారత్ చేర్చిన జాబితాలో ఛత్తీస్‌గఢ్‌లోని కంగెర్ వ్యాలీ నేషనల్ పార్క్, తెలంగాణలోని ముడుమాల్ మెగాలితిక్ మెన్హిర్స్, పలు రాష్ట్రాల్లోని అశోకుడి శాసన స్థలాలు, మౌర్య రూట్స్, పలు రాష్ట్రాల్లోని చౌసత్ యోగిని దేవాలయాలు, ఉత్తర భారతంలోని గుప్తుల దేవాలయాలు, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలోని బుందేలాల రాజభవనాలు, కోటలు ఉన్నాయి. వీటితో భారత్ నుంచి యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్న ప్రాంతాల సంఖ్య మొత్తం 62కు చేరింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం ׀ 15 ׀ మార్చి ׀ 2025

వెన్నెల రారాజు



పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆకాశంలో నిండు జాబిల్లి ప్రకాశించింది. చల్లని వెన్నెలను ప్రజలు ఆస్వాదించారు. బెళగావిలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

వర్సిటీల మూసివేతపై తీర్మానం కాలేదు



సభలో సభ్యులకు అభివాదం చేస్తున్న సీఎం సిద్దరామయ్య



మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత ఆర్.అశోక్

- అప్పుడే జేపీ నేతలకు ఆందోళన ఎందుకు?
- అసెంబ్లీలో ప్రశ్నించిన సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: విశ్వవిద్యాలయాలను మూసివేయడంపై ఎలాంటి తీర్మానం కాలేదు.. కేబినెట్ ఉపసంఘం నివేదిక ఇంతవరకు రాలేదు, అప్పుడే బీజేపీకి ఆందోళన ఎందుకు? అని ముఖ్యమంత్రి సిద్దరామయ్య శాసనసభలో శుక్రవారం ఘాటుగా ప్రశ్నించారు. ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీలో ఈ విషయంపై ప్రస్తావించిన విషయంపై స్పందించిన సీఎం, ఉపముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ విషయంపై కూలంకుషంగా పరిశీలనకు ఉపసంఘం ఏర్పాటు చేశామన్నారు. ఉపసంఘం నివేదిక సమర్పణ పెండింగ్‌లో ఉంది. నివేదిక రాగానే దానిని కేబినెట్ ముందు ఉంచి చర్చించి ఆ తరువాత తీర్మానం తీసుకొంటామన్నారు. నివేదిక రాకముందే విశ్వవిద్యాలయాలను మూసివేస్తామని చెప్పటం సరికాదు. ఇటువంటి తీర్మానం తమ ద్వారా కాలేదని సిద్దరామయ్య స్పష్టం చేశారు. అంతకు ముందు బీజేపీ సభ్యుడు డాక్టర్ సీ.ఎన్.అశ్వత్తనారాయణ సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టి, చర్చకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. ఆ సమయంలో స్పీకర్ యూ.టీ.ఖాదర్ ప్రతిరోజు వాయిదా తీర్మానం ఇస్తే ఎలా? బడ్జెట్ ప్రసంగంలో అవకాశముంది. ఈ విషయంపై రెండు మూడు సార్లు చర్చ కూడా జరిగింది. అందువల్ల నియమం 69కి మార్చి వచ్చేవారం చర్చకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సమయంలో మాట్లాడిన అశ్వత్తనారాయణ, విశ్వవిద్యాలయాలను కాపాడాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను మూసివేసే ఆందోళన నిర్మాణమైందన్నారు. ఇందుకు ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, బీజేపీ సభ్యుడు బసనగౌడ పాటిల్ యత్నాళ్ జోక్యం చేసుకొని విశ్వవిద్యాలయాలను మూసివేయరాదని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలను మూతవేయనున్నట్లు ఇప్పటికే డీసీఎం డీ.కే.శివకుమార్ వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం సీఎం పరిశీలన చేస్తామని చెబుతున్నారా? ఇందులో వివాదం ఎదురైంది. అందువల్ల ఈ విషయంపై వివరణ ఇవ్వాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈ సమయంలో సీఎం మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను మూసివేయాలో లేదో కేబినెట్ సబ్ కమిటీ నివేదిక వచ్చిన తరువాత తీర్మానం తీసుకుంటామని తెలిపారు.

బెంగళూరు చెత్త ఓ మాఫియా

- ఎమ్మెల్యేలే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు
- పరిషత్‌లో డీ.కే.శివకుమార్ ఆరోపణ

శివాజీనగర: బెంగళూరు చెత్త అనేది ఒక మాఫియా, ఎమ్మెల్యేలే తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని డీసీఎం డీ.కే.శివకుమార్ విధాన పరిషత్‌లో ఆరోపించారు. జీరో అవర్‌లో కాంగ్రెస్‌కు చెందిన నాగరాజ్ యాదవ్ బెంగళూరు చెత్త సమస్యపై ప్రస్తావించారు. సమాధానం ఇచ్చిన డీసీఎం చెత్త అనేది మాఫియా, చెత్త విషయమై బెంగళూరు ఎమ్మెల్యేలే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇందులో అన్ని పార్టీల వారు ఉన్నారు. చెత్త తొలగింపునకు రూ.800 కోట్లు అంటే తనకే షాక్ తగిలింది. మూడు నెలల నుంచి మహాదేవపురలో చెత్త లారీ అలాగే నిలబడిందన్నారు. బెంగళూరు పరిధి నుంచే చెత్త వెళ్లాలి అనేది తన అభిప్రాయం. ఇందుకోసం తగిన స్థలం కోసం వెదుకుతున్నామన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రామమూర్తి వ్యాఖ్యలను ప్రస్తావించిన డీకే శివకుమార్, ఎవరో ఆ మహావ్యక్తి టెండర్ పిలువకుండా ఉన్నాడు. డీ.కే.శివకుమార్ రూ.15 వేల కోట్లు కొల్లగొట్టాడని విలేకరుల సమావేశం జరిపాడని ఎద్దేవా చేస్తూ ఎమ్మెల్యేపై మండిపడ్డారు.

దళితుల నిధులు ఎలా మళ్లిస్తారు ?

- గ్యారెంటీలకు దళిత పథకాల నిధులపై రచ్చ
- విధాన పరిషత్‌లో మాటల యుద్ధం
- 10 నిమిషాల పాటు సభ వాయిదా

శివాజీనగర: గ్యారెంటీ పథకాలకు ఎస్సీ, ఎస్ఈపీ, టీఎస్‌పీ నిధులను వినియోగించుకోవటంపై అధికార, ప్రతిపక్షాల మధ్య భారీ మాటల యుద్ధం నెలకొని సమావేశం పదినిమిషాలు వాయిదా పడింది. శుక్రవారం విధాన పరిషత్‌లో ప్రశ్నోత్తరాల కాలావధిలో జేడీఎస్ సభ్యుడు టీ.ఏ.శరవణ, బీజేపీ హేమలత నాయక్ మాట్లాడుతూ దళితుల నిధులు పక్కదారి పడుతున్నాయన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హెచ్.సీ.మహదేవప్ప మాట్లాడుతూ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలకు ఎస్‌సీ, ఎస్ఈపీ, టీఎస్‌పీ నిధులను వినియోగించటం లేదన్నారు. భవిష్యత్‌లో కూడా వినియోగించుకోబోమన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ పథకాలన్ని అమలులోకి తెచ్చింది తమ ప్రభుత్వమని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా ఈ పథకానికి అధికంగా నిధులను కేటాయించారన్నారు.

గత ప్రభుత్వాలు నిధులు వాడాయి

కేంద్ర ప్రభుత్వం 5 లక్షల కోట్ల బడ్జెట్‌లో 30 శాతం ఎస్సీ, ఎస్టీ జనాభాకు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించాలి. అయితే ఎస్సీలకు రూ.1.69 లక్షల కోట్లు, ఎస్టీలకు రూ.1.29 లక్షల కోట్ల నిధులు కేటాయించారు. ఇది సామాజిక న్యాయమా? అని మంత్రి ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు పథకాలకు రిజర్వు చేసిన నిధులను ఉపయోగించుకొన్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వ అధికార అవధిలో మంత్రిగా ఉన్న గోవింద కారజోళ ఈ పథకం నిధులను వేర్వేరు పథకాలకు వినియోగించుకొన్నపుడు అసెంబ్లీలో ఆమోదించారని ఎదురుదాడికి దిగారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అయితే మంత్రి సమాధానంతో తృప్తి చెందని శరవణ, హేమలత గ్యారెంటీ పథకాలకు ప్రత్యేకంగా రూ.52 వేల కోట్లు రిజర్వు చేసి ఉంటే ఎస్ఈపీ టీఎస్‌పీ సొమ్ము ఎందుకు అవసరముంది. బడ్జెట్‌లో రిజర్వు చేసిన ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు.

గ్యారంటీలకు వేరే సొమ్ము లేదా?

ప్రతిపక్ష నాయకుడు ఛలవాది నారాయణస్వామి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్ఈపీ టీఎస్‌పీ పథకం సొమ్మును గ్యారెంటీ పథకాలకు వినియోగించుకుంటున్నారని ప్రభుత్వంపై విరుకుపడ్డారు. ఈ సమయంలో అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రశ్నోత్తరాల సమయం, చర్చకు అవకాశం లేదన్నప్పుడు అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఆ సమయంలో సభాపతి సభను చల్లబరిచేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. సభలో గందరగోళం నెలకొనటంతో 10 నిమిషాల పాటు సభను వాయిదా వేశారు. ఆ తరువాత సభ సమావేశం కాగా పలువురు మాట్లాడారు.

ఐదుగురు పీఎఫ్ఐ కార్యకర్తల అరెస్ట్

- మూడు పిస్తోళ్లు, ఆరు తూటాలు జప్తు
- 12 కేజీల గంజాయి, మూడు కార్లు స్వాధీనం



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు సీసీబీ పోలీసులు దాడి చేసి కేరళకు చెందిన నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కార్యకర్తలు ఐదుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మూడు పిస్తోళ్లతో ఆరు తూటాలు, 12 కేజీల గంజాయి, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు మంగళూరు నగర పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు. కేరళలోని కాసరగోడు భీమనడి గ్రామం కున్నంక్కె వెస్ట్‌కు చెందిన నౌఫల్(38), సుంకదకట్టెకు చెందిన మన్సూర్(36), మంగల్పాడి పంచాయతీ నివాసి అబ్దుల్ లతీఫ్(29), కాసరగోడు జిల్లా మోర్నానకు చెందిన మహమ్మద్ అస్గర్(27), మహమ్మద్ సాలి(31)లను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

అనుమానాస్పదంగా తిరుగుతుండగా..

ఈ నెల 12న మంగళూరు సమీపంలోని నాటికల్‌లో స్కార్పియోలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా నౌఫల్, మన్సూర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో నటోరియస్ క్రిమినల్స్ అబ్దుల్, లతీఫ్‌లను అర్కళ వద్ద అరెస్ట్ చేశారు. వీరు కేరళ నుంచి అక్రమంగా మంగళూరుకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో బయట పడింది. తలపాడి దేవిపురం వద్ద గంజాయి అమ్ముతుండగా మహమ్మద్ అస్గర్, మహమ్మద్ సాలిలను అరెస్ట్ చేశారు.

ఫ్యాన్సీ నంబర్‌పై వాహనదారుల మక్కువ

- రూ. 28 లక్షలు పలికిన కేఏ01-ఎన్ఎఫ్-0001 నంబర్

సాక్షి బెంగళూరు: రాష్ట్ర ఖజానాకు అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రాంతీయ రవాణా కార్యాలయాలు (ఆర్టీవోలు) బెంగళూరులోనే ఉన్నాయి. ఈ ఆర్టీవోలల్లో వాహనాల రిజిస్ట్రేషన్ ఫ్యాన్సీ నంబర్ల వేలం ప్రక్రియలో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. తాజాగా శుక్రవారం శాంతినగర ఆర్‌టీవో ముఖ్య కార్యాలయంలో జరిగిన వేలంలో ఒక నంబర్ ప్లేట్‌ను సుమారు రూ. 28.60 లక్షలకు కొనుగోలు చేశారు. ఒక్కరోజులోనే ఫ్యాన్సీ నంబర్ల వేలం ప్రక్రియ ద్వారా సుమారు రూ. 1.11 కోట్ల మేర ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. కోరమంగల 0001 అనే ఫ్యాన్సీ నంబర్ సుమారు రూ. 28 లక్షల మేర వేలం ప్రక్రియలో ధర పలికింది. ఇప్పటివరకు ఏ ఫ్యాన్సీ నంబర్‌కు పలకని రికార్డు ధర ఇది. గతంలో కేఏ01-ఎన్ఈ-001 ఫ్యాన్సీ నంబర్‌కు రూ. 21.15 లక్షల మేర ధర పలికింది. ఇప్పటివరకు ఇదే అత్యధిక ధర. తాజాగా కేఏ01-ఎన్ఎఫ్-0001 నంబర్‌కు రూ. 28.60 లక్షలను పెట్టి వినియోగదారుడు కొనుగోలు చేశాడు. ఈ వేలం ప్రక్రియలో మొత్తం 65 నంబర్ల పైకి 14 ఫ్యాన్సీ నంబర్లను వేలం వేశారు. వేలం ప్రక్రియలో ప్రభుత్వానికి రూ. 1.11 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

అత్యధిక ధర పలికిన ఫ్యాన్సీ నంబర్లు..

కేఏ01-ఎన్ఎఫ్-0001	- రూ. 28. 60 లక్షలు
కేఏ01-ఎన్ఎఫ్-9999	- రూ. 4.80 లక్షలు
కేఏ01-ఎన్ఎఫ్-0333	- రూ. 2.80 లక్షలు
కేఏ01-ఎన్ఎఫ్-7777	- రూ. 2.50 లక్షలు
కేఏ01-ఎన్ఎఫ్-0009	- రూ. 2 లక్షలు



కలబురిగిలో రంగులు చల్లుకుంటున్న దృశ్యం



హొసపేటలో హోలీ సంబరాలు



హోలీ.. రంగుల కేళి..

కన్నడనాట శుక్రవారం హోలీ సంబరాలు ఆనందోత్సవాల మధ్య మిన్నంటాయి. యువత రంగుల వర్షంలో తడిసి ముద్దయ్యింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపైకి చేరుకొని పరస్పరం రంగులు చల్లుకొని హోలీ సంబరాలను సంతోషంగా నిర్వహించుకున్నారు. భువిపై ఇంద్రధనస్సు వెలిసిందా అన్నట్లుగా రంగుల నీళ్లతో పరిసరాలు వర్ణ రంజితంగా మారాయి.



బెంగళూరు శేషాద్రిపురంలో హోలీ సంబరాల్లో యువత



న్యూస్‌రీల్

రూ. 50 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

కోలారు: కోలారు జిల్లాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. నైజీరియా, ఇతర దేశాల నుంచి తక్కువ ధరకు ఎండీఎం మాదక ద్రవ్యాన్ని ఖరీదు చేసి కోలారులోని పారిశ్రామిక ప్రాంతం, కళాశాలలు తదితర ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో సైబర్ క్రైం పోలీసులు నగర సమీపంలోని మడేరహళ్లి వద్ద శుక్రవారం కాపుగాచారు. ఆ సమయంలో వచ్చిన బైక్‌ను సోదా చేయగా రూ. 50 లక్షల విలువైన 806 గ్రాముల ఎండీఎం లభ్యమైంది. డ్రగ్స్, బైక్‌ను స్వాధీనం చేసుకొని సయ్యద్ పుర్కాన్ అనే డ్రగ్ పెడ్లర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ బి నిఖిల్ తెలిపారు. డ్రగ్స్‌ను పట్టుకున్న పోలీసులకు 10 వేల రూపాయల నగదు బహుమతిని ప్రకటించారు.

వ్యక్తిగత హాజరుపై స్టే

శివాజీనగర: మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్పపై నమోదైన పోక్సో కేసులో నేరుగా విచారణకు హాజరు కావాలని ఇచ్చిన ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలపై హైకోర్టు స్టే ఇచ్చింది. కేసు రద్దు కోరుతూ యడియూరప్ప హైకోర్టులో పిటిషన్ వేశారు. మార్చి 15న నేరుగా హాజరు కావాలని బెంగళూరులోని 1వ త్వరిత గతి న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను ప్రశ్నిస్తూ యడియూరప్ప హైకోర్టు మెట్లెక్కారు. శుక్రవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపి, కాగ్నిజెన్స్ సమన్ల ఆదేశాలపై స్టే ఇచ్చింది. దీంతో యడియూరప్పకు మధ్యంతర ఊరట లభించింది.

ప్రసన్న నంజుండేశ్వర స్వామి వైభవం



మైసూరు: మైసూరులోని పాత సంతెపేటలో కొలువైన చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ ప్రసన్న నంజుండేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం వివిధ పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించిన రథంలో కొలువు దీర్చారు. ఎమ్మెల్యే హరీష్‌గౌడ, గౌరి దంపతులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య రథం ముందుకు కదిలింది. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

కైవారంలో బ్రహ్మరథోత్సవం



అమరనారాయణస్వామి రథోత్సవం

చింతామణి: పౌర్ణమిని పురస్కరించుకొని కైవారంలో శుక్రవారం అమరనారేయణస్వామి బ్రహ్మరథోత్సవం ఘనంగా జరిగింది. కైవార ధర్మాధికారి జయరాం దంపతులు స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తిని రథంలో ఉంచి ఊరేగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని రథోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. చింతామణి వారిచే దానవీరశూరకర్ణ నాటకం భక్తాదులను ఆకట్టుకొంది. ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

తరగతి గదిలోనే విద్యార్థిని హఠాన్మరణం



విద్యార్థిని పూర్విక(ఫైల్)

యశవంతపుర: ఓ చిన్నారి తరగతి గదిలో హఠాన్మరణం చెందింది. ఈ విషాద ఈ ఘటన కొడగు జిల్లా సోమవారపేటలో జరిగింది. క్యాతె గ్రామంలోని అబ్దుల్ కలాం వసతి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పూర్విక గురువారం పాఠశాలకు వచ్చింది. తరగతి గదిలో పాఠాలు వింటూ కుప్పకూలడంతో కొడ్లిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హాసన పట్టణలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

రన్యరావ్ స్నేహితుడు తరుణ్‌రాజ్‌కు రిమాండ్

బనశంకరి: బంగారం అక్రమరవాణా కేసులో అరెస్ట్ అయిన నటి రన్యరావ్ స్నేహితుడు తరుణ్‌రాజ్‌కు 14 రోజుల పాటు జుడీషియల్ రిమాండ్ విధిస్తూ బెంగళూరు ఆర్థిక నేరాల విభాగం కోర్టు ఆదేశించింది. తరుణ్‌రాజ్‌ను కస్టడీ గడువు ముగియడంతో డీఆర్ఐ అధికారులు అతన్ని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన కోర్టు 14 రోజుల పాటు జుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించింది.

రసాయన రంగులు చల్లిన ఆకతాయిలు

- నలుగురు యువతులకు అస్వస్థత

దొడ్డబళ్లాపురం: హోలీ సందర్భంగా ఆకతాయిలు రసాయన మిశ్రిత రంగులు చల్లడంతో నలుగురు యువతులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా సువర్ణగిరి తాండాలో చోటుచేసుకుంది. గౌరి పూజార, దివ్య లమాణి, అంకిత లమాణి, తనూషలు శుక్రవారం బస్టాప్‌లో నిలబడి ఉండగా ఎక్కడి నుంచో వచ్చిన ఆకతాయిలు వారిపై రంగులు చల్లి పరారయ్యారు. తక్షణం నలుగురూ అస్వస్థతకు గురయ్యారు. లక్ష్మేశ్వర పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. రంగుల్లో కోడిగుడ్లు, మట్టి, ఎరువు, కెమికల్ మిశ్రిత రంగులు కలిపినట్టు తెలిసింది.

కేఎస్ ఆర్టీసీ బస్సుపై రాళ్ల దాడి

యశవంతపుర: కేఎస్ఆర్‌టీసీ బస్సుపై మరాఠీ ఆకతాయిలు రాళ్ల దాడికి పాల్పడ్డారు. మహారాష్ట్రలోని కొల్హాపుర జిల్లా ఇచలకరంజి గ్రామం నుంచి బస్సు శుక్రవారం చిక్కోడికి వెళ్తుండగా హోలీ ఆడుతున్న ఆకతాయిలు బస్సుకు మసి పూసి, రాళ్లతో దాడి చేశారు. ఇటీవల కేఎస్ ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై దాడి జరిగి రెండు రాష్ట్రాల మధ్య కొన్ని రోజుల పాటు బస్సుల సంచారం నిలిచిపోయిన విషయం తెలిసిందే.

స్వామీజీ కాళ్లపై పడ్డ పోలీసుల బదిలీ

దొడ్డబళ్లాపురం: యూనిఫాంలో ఉంటూ స్వామీజీ కాళ్లపై పడి ఆశీర్వాదం తీసుకున్న ఆరుమంది పోలీసులకు ఉన్నతాధికారులు బదిలీ శిక్ష విధించారు. బాగలకోటె జిల్లా బాదామి పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఆరుమంది ఒక స్వామీజీ కాళ్లమీదపడి ఆశీర్వాదం తీసుకుని తలా రూ.500 డబ్బు కూడా తీసుకున్నారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో జిల్లా ఎస్పీ అమరనాథ్ రెడ్డి ఆరుమంది పోలీసులపై బదిలీ వేటు వేశారు.

ఏనుగు దాడిలో మహిళ మృతి



సుశీలమ్మ(ఫైల్)

మండ్య: ఏనుగు దాడిలో మహిళ మృతి చెందినఘటన హాసన్ జిల్లా బేలూరు తాలూకా కూగోడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన సుశీలమ్మ కాఫీ తోటలో పనులు ముగించుకొని వస్తుండగా మాటు వేసిన ఏనుగు దాడి చేసింది. తొండంతో విసిరేయడంతో తల భాగంలో తీవ్ర గాయాలై మృతి చెందింది. మహిళ మృతితో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. చీకనహళ్లి-బేలూరు రోడ్డులో టైర్లకు నిప్పు పెట్టి బైఠాయించారు. వారు మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో ఇద్దరు వ్యక్తులు ఏనుగు దాడిలో మృతి చెందారని, అయినా అటవీశాఖ ఏనుగులను నియంత్రించడం లేదని మండిపడ్డారు. అనంతరం అటవీశాఖ అధికారులు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

కపట ప్రేమకు మరో యువతి బలి

- హావేరిలో ప్రియురాలిని చంపిన ప్రియుడు
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు



హతురాలు స్వాతి, ప్రధాన నిందితుడు నయాజ్(ఫైల్)

హుబ్లీ: మరో దారుణం జరిగింది. ముక్కుపచ్చలారని యువతి ప్రాణాలను ప్రేమ పేరుతో ఓ యువకుడు పొట్టన బెట్టుకున్నాడు. హావేరి జిల్లా రాణిబెన్నూరు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్న యువతి హత్యకు గురి కాగా ఈ కేసులో ముగ్గురు నిందితులను అనుమానిస్తుండగా, ప్రధాన నిందితుడు నయాజ్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు గురైన యువతిని రత్తిహళ్లి మసూరు గ్రామానికి చెందిన స్వాతి రమేష్ బ్యాడగి(22)గా గుర్తించారు. ఈ నెల 6న యువతి మృతదేహాన్ని రాణిబెన్నూరు తాలూకా పత్తెపుర గ్రామం వద్ద తుంగభద్ర నది సమీపంలో కనుగొన్నారు. ముందుగా గుర్తు తెలియని యువతి శవంగా భావించిన హలగేరి పోలీసులు వారసుదారులు లేని నేపథ్యంలో పోస్టుమార్టం నిర్వహించి చట్టప్రకారం స్వాతి శవాన్ని పూడ్చిపెట్టారు. పోస్టుమార్టంలో స్వాతి హత్యకు గురైనట్లు ధ్రువ పడింది. దీంతో దర్యాప్తు చేపట్టిన హలగేరి పోలీసులు ఈ నెల 3న కనిపించకుండా పోయిన యువతి ఆచూకీని కనుగొన్నారు. ఈ క్రమంలో స్వాతి తల్లి హిరేకెరూరు పోలీస్ స్టేషన్‌లో తమ కుమార్తె కనిపించలేదని ఫిర్యాదు చేసినట్లుగా తెలుసుకున్నారు. స్వాతి తండ్రి మృతి చెందగా, తల్లితో పాటు యువతి నివసిస్తోంది. ఈ కేసులో ముగ్గురిని నిందితులుగా అనుమానిస్తున్నారు. దర్యాప్తు చురుగ్గా చేపట్టినట్లు హలగేరి పోలీసులు తెలిపారు. కాగా హిందూ సంఘాలు సోషల్ మీడియాలో జస్టిస్ ఫర్ స్వాతి అభియాన్‌ను ప్రారంభించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

హోలీ సంబరాలు



రంగులు చల్లుకుంటున్న దృశ్యం

కృష్ణరాజపురం: కృష్ణరాజపురం దొడ్డబనహళ్లిలో శుక్రవారం రంగుల పండగ హోలీ సంబరాలు మిన్నంటాయి. చంద్రగిరి అపార్ట్‌మెంట్‌లో ప్రజలు రంగులు చల్లుకొని ఉత్సాహంగా గడిపారు.

గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి



ధర్నాలో పాల్గొన్న రైతులు

తుమకూరు : తుమకూరు జిల్లా చీలగానహళ్లి సమీపంలోని గనుల్లో అనధికారికంగా సాగుతున్న తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు రైతులు, రైతు నాయకులు కోరటిగెరె పట్టణంలోని మినీ విధానసౌధ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఆందోళనకారులు మాట్లాడుతూ అక్రమ తవ్వకాలతో వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి తవ్వకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. హసిరు సేన నాయకులు పాల్గొన్నారు.

పునీత్, దర్శన్ ఒక్కటే



రక్షిత్ గీసిన చిత్రం

యశవంతపుర: పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్, దర్శన్ మంచి స్నేహితులు. కొందరు ఇద్దరి మధ్య పొసగకుండా సామాజిక మాధ్యమాల్లో అనేక పోస్టులు పెట్టేవారు. ఇద్దరూ కలిసి సినిమాలో నటించారు. అయితే అభిమాని ఒకరు ఫ్యాన్స్‌వార్, స్టార్‌వార్‌కు బ్రేక్ వేశారు. పునీత్ నటించిన మొదటి సినిమా అప్పు రీ రిలీస్ అయింది. అభిమాని రక్షిత్ దర్శన్, పునీత్ కలిసి కౌగలించుకోంటున్న ఫోటోను పెయింట్ చేసి అందరినీ ఆకర్షించేలా చేశారు. ఇద్దరు అభిమానుల మధ్య ఉన్న భేదాభిప్రాయులను పక్కన పెట్టేలా చిత్రాన్ని గీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కన్నడ సినిమాలో ఫ్యాన్స్‌వార్ కాదు కన్నడ సినిమాలను చూసి సపోర్ట్ చేయాలంటూ మనవి చేశారు. పునీత్ రాజ్‌కుమార్, దర్శన్ వేర్వేరు కాదు. తమకు ఇద్దరూ ఒక్కటే అంటూ సందేశాన్ని రాశాడు. సుదీప్, ఉపేంద్రతో పాటు కన్నడ హీరోలు నటించిన అన్ని సినిమాలను చూసి ఆదరించాలని రక్షిత్ మనవి చేశారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రురాలి మృతి



జ్యోతి(ఫైల్)

యశవంతపుర: హాసన జిల్లా బేలూరు పట్టణంలో భవనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఘటన జరిగిన రోజు ఇద్దరు మహిళలు మృతి చెందగా జ్యోతి అనే మహిళ(45) గాయపడిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జ్యోతి కూడా శుక్రవారం మృతి చెందింది.

ఘనంగా మారెమ్మదేవి ఉత్సవాలు



విశేష అలంకరణలో మారెమ్మ

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో కొలువైన గ్రామ దేవత మారెమ్మ దేవి 16వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు వినయ్ కుమార్ దీక్షిత్ అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు.
వేదపారాయణం, లలిత సహస్ర నామ పారాయణ, గంగపూజ, గణపతిపూజ, పున్యాహవాచన, రక్షాబంధన, ప్రధాన కలశ స్థాపన, మహా గణపతి హోమం, వాస్తు హోమం, నవగ్రహ హోమం నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



కోలారులో సోమేశ్వర స్వామి రథోత్సవ దృశ్యం



మండ్యలో అరకేశ్వర స్వామి రథోత్సంలో పాల్గొన్న భక్తులు



కేజీఎఫ్‌లో ప్రసన్నవేంకటేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

మిన్నంటిన రథోత్సవాల సందడి

కేజీఎఫ్ : నగరంలోని రాబర్ట్‌సన్ పేటలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వర స్వామి 90వ బ్రహ్మ రథోత్సవ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని రథంపైకి అరటి పండ్లు, దవనం విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పానకం, పెసరబేడలు, మజ్జిగ పంచారు. అన్న సంతర్పణ జరిగింది. తహసీల్దార్ నాగవేణి పాల్గొన్నారు.

కోలారు : నగరంలోని పురాణ ప్రసిద్ధ కామాక్షంభ శ్రీ ప్రసన్న సోమేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం రథోత్సవానికి దేవాదాయ శాఖ తహసీల్దార్ శ్రీకారం చుట్టారు. రథోత్సవానికి నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దవనం, అరటి పండ్లు రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పానకం, పెసరబేడలు, మజ్జిగ పంచారు.



చిక్కబళ్లాపురంలో కైవార తాతయ్య పల్లకీ ఊరేగింపు

మండ్య : మండ్య నగరంలో కొలువైన అరకేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వేలాది మంది భక్తుల నిర్వహించారు. వేకువజామున ఆలయంలో రుద్రాభిషేకం, పంచమూర్తిపవన హోమం, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఆర్కేశ్వర స్వామివారి ఉత్సవమూర్తిని రథంలో ఉంచి రథోత్సం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చిక్కబళ్లాపురం: జిల్లా పాలకమండలి ఆధ్వర్యంలో యోగి నారాయణ యతీంద్రుల జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రంగనాథ స్వామి ఆలయం వద్ద నుంచి యోగి నారాయణ తాతయ్య పల్లకీ ఊరేగింపు ప్రారంభమై యోగి యతీంద్రుల ఆలయం వరకు సాగింది. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడారు.బలిజ సముదాయానికి 2ఎ రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఉద్యోగంలో రిజర్వేషన్ కల్పించడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. లాయర్ అశ్వత్థనారాయణ పాల్గొన్నారు. టెన్త్, పీయూసీలో ప్రతిభ చూపిన సముదాయ విద్యార్థులను సత్కరించారు. కలెక్టర్ పీఎస్ రవీంద్ర, ఏడీసీ భాస్కర్, నగరసభ ఉపాధ్యక్షుడు నాగరాజ్, కన్నడ, సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం



తేరును లాగుతున్న భక్తులు

గౌరిబిదనూరు: తాలూకాలోని బాలరెడ్డిపల్లిలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గురువారం రాత్రి కల్యాణోత్సవం జరిగింది. పూజారి చిక్కబాలప్ప, శ్రీనివాస భట్టర్, రంగరాజ భట్టర్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం అభిషేకాలు, సత్యనారాయణపూజ, కళశారాధన. రథాంగ హోమం, రథబలి మెదలైన ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. వేలాది మంది భక్తులు పాల్గొని రథోత్సవాన్ని వీక్షించారు. భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రికి దూళోత్సవం వైభవంగా జరిగింది.

స్కూల్ బ్యాగుల వితరన



విద్యార్థులకు బ్యాగులు అందించిన దృశ్యం

గౌరిబిదనూరు: తాలూకాలోని అలకాపురంలో ఉన్న జ్ఞానోదయ అప్పర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు నగరసభ సభ్యుడు, సమాజ సేవకుడు జయరాం శుక్రవారం స్కూల్ బ్యాగులు వితరణ చేశారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించాడు. చంద్రమౌళి, సునిత, మంజునాథ్, మనవంత్, నిశాంత్ పాల్గొన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించిన దృశ్యం

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడిగా గంగరెకాలువ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పేరేసంద్ర రామప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సభ్యుల మద్దతుతో బ్యాంకును అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ అధ్యక్షుడు నాగేశ్ కాళేగౌడ, గిరీశ్, మూర్తి, మరళకుంటె కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రమణీయంగా తేరు ఉత్సవాలు



ప్రసన్న వేంకటరమణస్వామి రథోత్సవం



గుట్టె లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకాలో పలు చోట్ల రథోత్సవాలు ఘనంగా జరిగాయి. తూబుగెరెలోని పురాతన ప్రసిద్ధ శ్రీ ప్రసన్న లక్ష్మీ వేంకటరమణస్వామి రథోత్సవం శుక్రవారం అభిజిత్ లగ్నంలో వైభవంగా జరిగింది. అంతకుముందు మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. తాలూకా నుంచే కాకుండా చిక్కబళ్లాపురం, కోలారు, బెంగళూరు జిల్లాల నుంచి వందలాదిగా భక్తులు తరలి వచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఇదే తాలూకాలోని కామేనహళ్లిలో వెలసిన గుట్టె లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం కూడా శుక్రవారం ఎంతో ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. దాతలు భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

వైభవంగా కైవార తాతయ్య జయంతి



కైవార తాతయ్య పల్లకీల ఊరేగింపు దృశ్యం



తాతయ్య విగ్రహాన్ని అలంకరించిన దృశ్యం

కోలారు : కైవార యోగి నారాయణ తాతయ్య జయంతి వేడుకలను శుక్రవారం నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి పుష్కరిణి వద్ద ఉన్న కైవార తాతయ్య విగ్రహానికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం నగర, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన 40కిపైగా పల్లకీలను ప్రముఖ వీధులలో ఊరేగించారు. అనంతరం టీ చెన్నయ్య రంగమందిరం వద్ద ఏర్పాటు చేసిన వేదిక కార్యక్రమంలో ఎంపీ ఎం మల్లేష్‌బాబు, జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఓం శక్తి చలపతి, నగరసభ అధ్యక్షురాలు మహాలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు సంగీతా, బలిజ సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు. సముదాయ ప్రతిభావంత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీ ఎస్ మునిస్వామి హాజరై మాట్లాడారు. కైవార తాతయ్య రచించిన కాలజ్ఞానం అందరికీ అందించే ప్రయత్నం చేయాలన్నారు. శ్రీ యోగినారాయణ కైవార తాతయ్య అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించడానికి అంతరగంగ పర్వతంపై ఉన్న తేరహళ్లిలో 10 ఎకరాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అప్పు రీ రిలీజ్.. అభిమానుల సంబరాలు

యశవంతపుర: దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ 50వ జన్మదినం సందర్భంగా ఆయన మొదటిసారిగా నటించిన అప్పు సినిమాను రీ రిలీజ్ చేశారు. దీంతో అభిమానులు శుక్రవారం సినిమా థియేటర్లకు పోటెత్తారు. గురువారం నుంచి బెంగళూరు నగరంలో అనేక సినిమా థియేటర్ల వద్ద భారీ కటౌట్లను కట్టారు. పుట్టినరోజు సందర్భంగా కటౌట్లకు క్షీరాభిషేకం చేసి స్వీట్లను పంచి టపాసులను పేల్చారు. కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు నరసింహులు, మాజీ అధ్యక్షుడు సారా గోవిందు, ఎస్ఎం సురేశ్ అభిమానులతో కలిసి అప్పు సినిమాను వీక్షించారు. ఉదయం ఆరు గంటల నుంచి సినిమా ప్రదర్శన ప్రారంభమైంది. తెరపై పూలను చల్లి అభిమానులు పునీత్ పుట్టిన రోజును ఆచరించారు.

బస్సులో వక్కాకు ఉమ్మేసిన మహిళ

- ప్రశ్నించిన కండక్టర్‌పై ప్రయాణికుల దాడి



కండక్టర్‌పై దాడి చేస్తున్న ప్రయాణికులు

తుమకూరు : కేఎస్ఆర్‌టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ వక్కాకు వేసుకొని ఉమ్మి వేయడంతో కండక్టర్ ప్రశ్నించాడు. ఆగ్రహానికి గురైన ప్రయాణికులు కండక్టర్‌పై దాడి చేశారు. ఈఘటన తుమకూరు జిల్లా పావగడలో చోటు చేసుకుంది. పావగడ నుంచి తుమకూరుకు వస్తున్న కేఎస్ఆర్‌టీసీ బస్సులో బెంగళూరు నగరానికి వెళ్లడానికి ఆరుగురు ప్రయాణికులు ఎక్కారు. వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. కండక్టర్ అనిల్ కుమార్ ఈ బస్సు బెంగళూరుకు వెళ్లదు, తుమకూరులో మరో బస్సును ఎక్కాలని సూచించారు. బస్సు దిగుతున్న సమయంలో ఒక మహిళ వక్కాకును బస్సులో ఉమ్మి వేసింది. శుభ్రం చేయాలని కండెక్టర్ సూచించగా ఆమె వెంట వచ్చినవారు వాగ్వాదానికి దిగారు. కండక్టర్‌ను కిందికి దించి కొట్టారు. కండక్టర్ పావగడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మండ్య : రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా ఆమె ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. ఈఘటన మండ్య జిల్లా మళవళ్లి పట్టణ సమీంలోని కొళ్లెగాల రోడ్డులో కుణిగల్ వద్ద జరిగింది. తాలూకాలోని కుందూరు గ్రామానికి చెందిన ప్రసాద్, శిల్ప (39) దంపతుల కుమార్తెలు అనన్య(7), మాన్య(5)తో కలిసి కూడమళవళ్లి పట్టణంలోని రోటరీ పాఠశాలలో చదువతున్నారు. శిల్ప తన పిల్లలను పాఠశాల నుంచి స్కూటీలో తీసుకెళ్తుండగా కుందూరు వైపు నుంచి వచ్చిన బొలెరో ఢీకొంది. శిల్ప మృతి చెందగా చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు వచ్చి చిన్నారులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

చంపేందుకు కుట్ర పన్నారు

చిక్కబళ్లాపురం : నన్ను చంపేందుకు ఇద్దరు అధికారులు కుట్ర పన్నారని అంకాలమడుగు భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఈమేరకు ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ గొడవలు, వ్యక్తిగత కక్షలతో తనపై కుట్ర పన్నారని ఆరోపించారు. ఈనెల 8న కోణనకుంటె కొండ రోడ్డులో తనపై దాడి చేశారని, అదృష్టవశాత్తు తప్పించుకున్నట్లు తెలిపారు. పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని, తనపై కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కొలిక్కి రాని చెత్త డంపింగ్ సమస్య



బసవరాజ మార్కెట్ సమీపంలోని చెన్నరాయ స్వామి ఆలయ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



మిట్టగానహళ్ల డంపింగ్‌యార్డు వద్ద కంప్యాక్టర్లు నిలిపివేసిన దృశ్యం

- మిట్టగానహళ్లి వద్ద యార్డులోకి నిలిచిపోయిన చెత్త తరలింపు
- బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోయిన చెత్త సేకరణ

బనశంకరి: మిట్టగానహళ్లి డంపింగ్‌యార్డుకు అశాస్త్రీయంగా చెత్తను డంపింగ్ చేస్తుండటాన్ని నిరసిస్తూ కణ్ణూరు గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామస్తులు గత మంగళవారం చెత్త లారీలను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఫలితంగా చెత్త నింపుకున్న లారీలు నగరంలోని కొన్ని లేఔట్లలో రోడ్లలో నిలబడ్డాయి. దీంతో గురువారం నగరంలో ఇంటింటి చెత్త సేకరించలేదు. బెంగళూరునగరజిల్లాపంచాయతీ సీఈఓ లతాకుమారి కణ్ణూరు గ్రామపంచాయతీ కార్యాలయ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. మిట్టగానహళ్లి డంపింగ్‌యార్డు సమస్య గురించి సమాచారం సేకరించారు. ఈనెల 19న స్థల పరిశీలన చేపట్టి సమస్యపై చర్చిస్తామని తెలిపారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినిరజనీశ్‌కు కణ్ణూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడు అశోక్ లేఖరాసి అశాస్త్రీయంగా చెత్త తరలించడం నిలిపివేయాలని, ప్రజలు ఆరోగ్యం కాపాడాలని మనవిచేశారు. ఈ లేఖను జెడ్పీ సీఈఓ లతాకుమారికి పంపించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోలారు వార్తలు...

పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకుందాం



కొండపై ప్లాస్టిక్ బాటిల్స్ సేకరిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

కోలారు : పరిసరాల సంరక్షణకు యువత చొరవ చూపాలని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు చౌడేశ్వరి రాము సూచించారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ , రోవర్‌ల ఆధ్వర్యంలో వక్కలేరి మార్కండేయస్వామి కొండపై శుక్రవారం చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన చుట్టుపక్కల ఉన్న పాఠశాల, దేవాలయం, ఆస్పత్రి, బస్టాండు, తదితర స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇది ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమన్నారు. ప్రతి కళాశాలలో నెలకోమారు గ్రామీణ స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించడానికి సమయం కేటాయించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజల నుంచి కూడా తగిన సహకారం అవసరం ఉంటుందన్నారు. జిల్లా సహకార్యదర్శి స్కౌట్ బాబు, కళాశాల ఉపన్యాసకుడు గురు ప్రకాష్, నాగమణి, వందన , వేణుగోపాల్ పాల్గొన్నారు.

కైవార తాతయ్య వచనాలు ఆదర్శం



తహసీల్దార్ మహేశ్ పత్రిని సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: కైవార తాతయ్య వచనాలు ఆదర్శమని బలిజ సముదాయం నాయకులు అన్నారు. తాలూకా కార్యాలయంలో బలిజ సామాజిక వర్గం నాయకులు ,ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం కైవార తాతయ్య జయంతిని నిర్వహించారు. తాతయ్య చిత్రపటానికి పూజలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ హిందూపురం–గౌరిబిదనూరు రోడ్డుకు కైవార నారాయణతాత పేరు పెట్టాలని, సముదాయభవనం, దేవాలయ నిర్మాణానికి రెండెకరాల స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్ మహేష్ పత్రిని కోరారు. శ్రీనివాసగౌడ, ఆవులప్ప వెంకటేశ్,మార్కెట్ మోహన్, రూపా అనంతరాజు, పద్మావతమ్మ, రాజకుమార్, ప్రదీప్,రమేశ్, బాలప్ప పాల్గొన్నారు.

గందరగోళంగా కోముల్ ప్రత్యేక సమావేశం

- ఎండీ గోపాలమూర్తిపై దాడికి యత్నం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి

కోలారు : కోలారు జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య (కోముల్)విశేష సర్వసభ్య సమావేశం గందరగోళం మధ్య సాగింది. కోముల్ ఎన్నికలకు క్షేత్రాలను నిర్ణయించడానికి హైకోర్టు సూచన మేరకు నగర సమీపంలోని ప్రైవేటు కళ్యాణ మంటపంలో శుక్రవారం కోముల్ పాలనాధికారి డాక్టర్ మైత్రి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. బంగారుపేట ఎమ్మెల్యే ఎస్.ఎన్.నారాయణస్వామి, మాలూరు ఎమ్మెల్యే కేవై నంజేగౌడ, వారి వర్గీయులు పాల్గొన్నారు. కోముల్ పాలనాధికారి మైత్రి, డైరెక్టర్ గోపాలకృష్ణమూర్తిలు హైకోర్టు సూచన మేరకు క్షేత్ర పునర్విభజనకు సభ్యుల ఆమోదం కోరారు. బంగారుపేట ఎమ్మెల్యే నారాయణస్వామి, కోముల్ డైరెక్టర్ హరీష్ తదితర ఇతర డైరెక్టర్లు దీనిపై చర్చ జరపాలని పట్టుబట్టారు. అయితే పాలనాధికారి డాక్టర్ మైత్రి చర్చకు అవకాశం కల్పించలేదు. ఇంతలో క్షేత్రాల పునర్విభజనకు మూడింట రెండు వంతుల సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారని ప్రకటించారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలు, వారి వర్గీయుల మధ్యన తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక దశలో ఎమ్మెల్యే నారాయణస్వామి క్షేత్రాల పునర్విభజన ఏ నియమ నిబంధనల ఆధారంగా చేశారు, సమావేశానికి ముందు గ్రామాలకు వెళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులతో మాట్లాడారా? అని కోముల్ ఎండీ గోపాలమూర్తిని నిలదీశారు. ఒక దశలో ఆయన అనుచరులు ఎండీ గోపాలమూర్తిపై దాడికి యత్నంచగా పోలీసులు అతనిని పక్కనే ఉన్న గదిలోకి తీసుకు వెళ్లారు. 30 నిమిషాల అనంతరం కోముల్ భద్రతా సిబ్బంది, పోలీసు రక్షణ మధ్య ఎండీ గోపాలమూర్తి కారులో బయలుదేరారు.

కన్నడలో చదివితే ఉన్నత శిఖరాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీకె వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం తగిన వేదికలను కల్పించాలని ఎమ్మెల్యే జీకె వెంకటశివారెడ్డి సూచించారు. తాలూకాలోని లక్ష్మీపుర గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో వారి సామర్థ్యానికి అనుగుణంగా వారి సర్వతోముఖ అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని ప్రతి పాఠశాలలోనూ కల్పించాలన్నారు. కన్నడ మీడియంలో చదివినవారిలో ఎంతో మంది మేధావులు అయ్యారన్నారు. అలాంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం భైరేగౌడ, డైరెక్టర్ కె రాజణ్ణ, ఈసీఓ కేసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న డీఈఓ కృష్ణమూర్తి

కోలారు : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో అధికారులు, సిబ్బంది పరీక్షా మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని డీఈఓ కృష్ణమూర్తి సూచించారు. నగరంలోని స్కౌట్స్ భవనంలో జిల్లాలోని 65 పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్‌లతో ఆయన సమావేశమై మాట్లాడారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి అనధీకృత వ్యక్తులను అనుమతించరాదని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగిలిన సిబ్బంది ఎవరూ మొబైల్ ఫోన్ వినియోగించరాదన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటితో పాటు, గాలి, వెలుతురు, టేబుల్ తదితర మౌలిక సౌలభ్యాలు కల్పించాలన్నారు. ఏ పరీక్షా కేంద్రంలోనైనా సమస్య ఉన్నట్లయితే వాట్సప్ గ్రూప్‌లో సమాచారం అందించాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీకెమెరాలు ఉండాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు తగిన సౌలభ్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీవైఎస్పీ రాజేశ్వరి, కోలారు బీఈఓ మధు మాలతి పడువణి, వివిధ తాలూకాల బీఈఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



శ్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అలంకరణ

గౌరిబిదనూరు: కదిరి పున్నమిని పురస్కరించు కొని పట్టణ శివారులోని శ్రీ రాజలక్ష్మీ ఆలయ ఆవరణలో లక్ష్మీనరసింహస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు భూమరాజు నరేంద్ర శర్మ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, ప్రాకారోత్సవం , మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం ప్రసాద వినియోగం, అన్నదానం కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ట్రేడింగ్‌లో లాభాలంటూ వంచన

మైసూరు: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు ఉంటాయని నమ్మించిన వంచకులు ఓ వ్యక్తి నుంచి రూ. 17 లక్షలు కొల్లగొట్టారు. మైసూరులోని కుంబారకొప్పలు నివాసి వినయ్ కుమార్‌కు ఇన్‌స్టాలో పరిచయమైన వ్యక్తి షేర్‌మార్కెట్ గురించి వివరించారు. తక్కువ రోజుల్లోనే ఎక్కువ లాభాలు ఉంటాయని నమ్మించాడు. దీంతో అతను చెప్పిన కంపెనీల్లో వినయ్‌కుమార్ కొద్దిగా డబ్బు పెట్టుబడి పెట్టాడు. అనంతరం వంచకుడు తొలుత రూ.8వేలు పంపాడు. నమ్మకం ఏర్పడిన వినయ్ కుమార్ రూ.17.09 లక్షలు వంచకుడి ఖాతాకు బదిలీ చేశాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. మోసం జరిగిందని గుర్తించిన వినయ్‌కుమార్ మైసూరులోని సెన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విజయంతో దేశానికి ఖ్యాతి తేవాలి



కాంబోడియా దేశ పర్యటనకు వెళుతున్న రేణుకాను అభినందిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: కాంబోడియా దేశంలో జరుగనున్న క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు బయల్దేరిన పారా త్రోబాల్ భారత్ జట్టు క్రీడాకారిణి, కెప్టెన్ రేణుకా శ్రీనివాస్‌కు శుక్రవారం ఆనేకల్ పట్టణ ప్రముఖులు వీడ్కోలు పలికారు. శ్రీధర్మస్థల గ్రామీణాభివృద్ధి పథకం, జన జాగృతి, జ్ఞాన వికాస సమన్వయ విభాగం పదాధికారులు, ఆనేకల్ పురసభ అధ్యక్షురాలు సుధా నిరంజన్, ఉపాధ్యక్షురాలు భువనా దినేష్, అధికారులు దర్శన్, సుధ, కళావతి, జయంతి లు అభినందనలు తెలిపి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

రౌడీషీటర్ హత్య

మైసూరు: రౌడీషీటర్ హత్యకు గురైన ఘటన మైసూరు తాలూకా హనగళ్లిలో ఈనెల 12న జరిగింది. గ్రామానికి చెందిన దొరెస్వామి, అలియాస్ సూర్యను దుండగులు మారణాయుధాలతో నరికి హత్య చేశారు. దోరెస్వామి గ్రామ సమీపంలోని తోటలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. భార్య దీపికా అతనితో విభేదించి వెళ్లిపోయింది. మరో యువతితో అతను సహజీవనం చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 12న అర్ధరాత్రి సమయంలో దుండగులు దొరెస్వామిని హత్య చేశారు. జయపుర పోలీసులు వెళ్లి పరిశీలించగా ఘటన స్థలంలో మద్యం, ఆహార పొట్లాలు కనిపించాయి. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

కైవార తాతయ్య చిత్రపటం ఊరేగింపు



చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మైసూరు: మైసూరులోని డీ దేవరాజు అరుసు రోడ్డులో శ్రీయోగి నారాయణ కైవార తాతయ్య జయంతి వేడుకలను బలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం కళాబృందాల మధ్య ఊరేగించారు. భక్తులకు లడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేశారు. మజ్జిగ, పానకం అందజేశారు. సాహితీవేత్త గూడు రమేష్ పాల్గొన్నారు.

బాలుడు ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దొడ్డ పట్టణ శివారులోని పిండకూరుతిమ్మనహళ్లి వద్ద చోటుచేసుకుంది. పిండకూరు తిమ్మనహళ్లి నివాసులైన సుబ్బరాయప్ప, మంజమ్మ దంపతుల కుమారుడు రవికుమార్(15) నిర్జనప్రదేశంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దొడ్డ గ్రామీణ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పోషకాల దివ్యౌషధం ఖర్జూరం

- బెంగళూరులో 500 టన్నులకు పైగా విక్రయం
- రంజాన్ నెలలో రాయితీ ధరలతో విక్రయాలు



రస్సెల్ మార్కెట్ ఖర్జూర మేళాలో అరుదైన ఫలాల కొనుగోలులో వినియోగదారులు



ఖర్జూరం గురించి వివరిస్తున్న వ్యాపారి మహమ్మద్ ఇద్రిస్ చౌదరి

శివాజీనగర: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు దాదాపు 12 గంటలకు పైగా సాగే తమ ఉపవాస వ్రతాన్ని కేవలం ఒక ఖర్జూర పండుతో విరమిస్తారు. ఇందుకు కారణమేమంటే గంటల కొద్దీ అన్న పానీయాలను తీసుకోని కారణంగా దేహంలోని చక్కెర ప్రమాణం గణనీయంగా తగ్గిపోతుంది. ఒకటి, రెండు ఖర్జూర పండ్లను సేవించటం వల్ల కొద్ది నిమిషాల అవధిలోనే దేహం మళ్లీ శక్తిని పుంజుకుంటుంది. ఔషధ గుణాలు, పౌష్టికాంశాలు పుష్కలంగా కలిగిన ఖర్జూర పండ్లను అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఇష్టంగా స్వీకరిస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 350కు పైగా ఖర్జూర రకాలు

బెంగళూరు శివాజీనగర్‌లో ఖర్జూర పండ్ల మేళా ఏర్పాటైన నేపథ్యంలో రస్సెల్ మార్కెట్ వ్యాపారస్తుల సంఘం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇద్రిస్ చౌదరి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 350కు పైగా ఖర్జూర పండ్ల రకాలు ఉండగా, వాటిలో అత్యంత విశిష్ట ఔషధ గుణాలు కలిగిన 42 రకాల ఖర్జూర పండ్లను నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రత్యేకించి సౌదీ ఆరేబియా, ఇరాన్, ఇరాక్, జోర్డాన్, ట్యునీసియా, దక్షిణాఫ్రికా దేశాల నుంచి వచ్చే ఖర్జూర పండ్లను ప్రజలు అమితంగా ఇష్టపడతారన్నారు.

చక్కెర వ్యాధిగ్రస్తులకు మేడ్జుల్ రకం ప్రత్యేకం

ఖర్జూర పండ్లలో ఎన్నెన్నో రకాలు ఉన్నాయని ఇద్రిస్ చెప్పారు. చక్కెర వ్యాధి ఉన్న వారి కోసం మేడ్జుల్ రకం ప్రత్యేకమన్నారు. కాగా రుత్బసుక్రి, కల్మి, అంబర, మరియం, మబరూమ్ ఖుద్రి ఇలా కిలో రూ.100 నుంచి కిలో రూ.2 వేల విలువ చేసే ఖర్జూర పండ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏటా రంజాన్ మాసంలో 15 టన్నుల వరకు ఖర్జూర పండ్ల విక్రయం జరుగుతుందని వివరించారు. నిత్యం రెండు, మూడు ఖర్జూర పండ్లు, కొన్ని బాదం పప్పులు, ఒక గ్లాసు పాలతో కలిపి తీసుకుంటే అద్భుతమైన రోగనిరోధక శక్తి, ఎముకల పుష్టి, రక్త శుద్ధీకరణ వంటి ప్రయోజనాలు దక్కుతాయన్నారు. హృద్రోగ, కిడ్నీ సమస్యలు ఉన్న వారికి ఖర్జూర పండ్లు దివ్య ఔషధమన్నారు.

అద్భుత ఔషధ గుణాలున్నాయి..

ఖర్జూర పండ్లలో అద్భుత ఔషధ గుణాలున్నాయని పలు పరిశోధనల్లో శాస్త్రీయంగా రుజువైందన్నారు. తమకు తెలిసి బెంగళూరు నగరంలో ప్రతి యేటా 500 టన్నుల వరకు ఖర్జూర పండ్ల విక్రయం జరుగుతుందని ఇద్రిస్ వివరించారు. ఈసారి ప్రత్యేక ఆకర్షణగా ఎనర్జీ టానిక్ డేట్ సిరప్, ఖర్జూర హల్వాలను ఉంచామన్నారు. బీబీఎంపీ నిర్వహణలోని రస్సెల్ మార్కెట్‌లో అద్దె తదితర నిర్వహణా ఖర్చులు తక్కువ కావడంతో లాభాల్లో కొంత భాగాన్ని వినియోగదారులకే తిరిగి ఇస్తున్నామన్నారు. రాయితీలతో పాటుఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. రకరాల అరుదైన మార్కెట్ మేళాను రంజాన్ మాసంలో సందర్శించాల్సిందే మరి.



ఖర్జూర మేళాలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన వివిధ రకాల ఖర్జూరం, బాదామి, పిస్తా తదితర ఫలాలు

బస్సు కిందపడి బైకిస్టు మృతి

దొడ్డబళ్లాపురం: బస్సు కిందపడి బైకిస్టు మృతిచెందిన ఘటన గదగ్ జిల్లా ముళగుంద పట్టణం వద్ద చోటు చేసుకుంది. వేగంగా వచ్చిన బైక్ స్కిడ్ అయ్యి ముందు వెళ్తున్న బస్సుకింద చిక్కుకుంది. బైకిస్టు ఈరప్ప కూడా బస్సు చక్రాలకింద చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందాడు.ముళగుంద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భారీగా డ్రగ్స్ స్వాధీనం



డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ బి.దయానంద్

బనశంకరి: బెంగళూరులో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. కలాసిపాళ్యలోని గణేశ్‌కంపెనీ పొగాకు ఉత్పత్తుల గోదాముపై ఈనెల 11న సీసీబీ పోలీసులు దాడి చేశారు. రూ.45 లక్షల విలువచేసే హాన్స్, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఒక డ్రగ్స్ పెడ్లర్‌ను అరెస్ట్ చేయగా మరొకరు తప్పించుకున్నారు. చెన్నమ్మనకెరె అచ్చుకట్టు కత్రిగుప్పె రామ్‌రావ్‌లేఔట్ ప్లేగ్రౌండ్ పార్కింగ్ వద్ద ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 55.20 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్, కిలో 905 గ్రాముల గంజాయి, కారు, రూ.10.50 లక్షల విలువ చేసే వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు.

సత్తేగాల ప్రాజెక్టు పూర్తయితే చెన్నపట్టణకు నీరు



వాయినం సమర్పిస్తున్న సీపీ యోగేశ్వర్

దొడ్డబళ్లాపురం: సత్తేగాల నీటిపారుదల ప్రాజెక్టు పూర్తయితే చెన్నపట్టణకు ఏడాదంతా నీరు లభిస్తుందని చెన్నపట్టణ ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ తెలిపారు. చెన్నపట్టణ తాలూకాలోని మాకళి గ్రామం చెరువుకు శుక్రవారం ఆయన వాయినం సమర్పించి మాట్లాడారు. సత్తేగాల నీటిపారుదల ప్రాజెక్టు అంతిమ దశకు చేరుకుందన్నారు. ఆరు నెలల్లో ఈ ప్రాజెక్టు ద్వారా నీరు ఇగ్గలూరు దేవేగౌడ బ్యారేజ్‌కు చేరుతుందన్నారు. ఫలితంగా తాలూకాలోని అన్ని చెరువులకు నీరు చేరుతుందన్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



హతుడు లోకనాథన్(ఫైల్)



పట్టుబడ్డ నిందితులు

దొడ్డబళ్లాపురం: తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా శూలగిరి పోస్ట్ వీబీపీ నగర్ నివాసి లోకనాథన్(24) హత్యకేసులో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. కృష్ణగిరి జిల్లా దొడ్డూరు గ్రామానికి చెందిన సత్యవాణి ఆలియాస్ సత్య(27), కోనేరపల్లికి చెందిన వరదరాజ్(23), ఆలూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్(25)అనే నిందితులను బెంగళూరు గ్రామీణ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. గతనెల 19న నెలమంగల–చిక్కబాణావర రైల్వే స్టేషన్‌ల మధ్య పట్టాలపై యువకుడి మృతదేహం ఉండగా రైల్వే పోలీసులు వెళ్లి పరిశీలించారు. శరీరంపై కత్తి పోట్లు కనిపించగా హత్యగా నిర్ధారణ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. హతుడు సత్యవాణితో సజీవనం చేసే వాడని తేలింది. అయితే సత్యవాణి మరో నిందితుడు వరదరాజుని వివాం చేసుకుంది. విషయం తెలుసుకున్న లోకనాథన్ సత్యవాణిని హెచ్చరించాడు.దీంతో లోకనాథన్‌ను హత్య చేయాలని సత్యవాణి, వరదరాజు నిర్ణయించుకుని శ్రీనివాస్‌తో కలిసి పథకం పన్నారు. పథకం ప్రకారం లోకనాథన్‌ను శూలగిరి నుంచి బెంగళూరు తీసుకువచ్చి హత్య చేసి రైలు పట్టాలపై మృతదేహాన్ని పడుకోబెట్టి వెళ్లిపోయారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- హత్యాయత్నంగా భావించి కేసు నమోదు



నిందితుడు సతీశ్‌కుమార్

యశవంతపుర: కారు బైక్‌స్టును ఢీకొని అనంతరం మహిళపై దూసుకెళ్లిన ఘటన మంగళూరు పట్టణ సమీపంలోని బిజ్జై కాఫీకాడు 6వ క్రాస్‌లో గురువారం జరిగింది. అయితే పోలీసులు ఈఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాఫీకాడుకు చెందిన కేఎం సతీశ్‌కుమార్, మురళీ ప్రసాద్‌లు పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. ఏదో విషయంపై ఇద్దరి మధ్య అప్పుడప్పుడు గొడవ జరిగేది. గురువారం ఉదయం 8:15 గంటలకు మురళీప్రసాద్ బైకుపై వెళుతుండగా కారులో కాపుకాసిన సతీశ్‌కుమార్ ఢీకొట్టారు. అనంతరం కారు అదుపు తప్పి మహిళపైకి దూసుకెళ్లింది. మురళీతో పాటు మహిళ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మురళీ మంగళూరు నగర పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాలను పరిశీలించారు. సతీశ్ ఉద్దేశపూర్వకంగా కారును నడిపి హత్యకు యత్నించినట్లు మంగళూరు నగర ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు. కారు బైక్‌ను ఢీకొట్టిన భయానక దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి.

ఇద్దరు దొంగల అరెస్ట్, నగలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

బనశంకరి: యలహంకలోని ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగను శుక్రవారం యలహంక పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్దనుంచి రూ. 2.40లక్షల విలువైన విగ్రహాలు, కిరీటాలు, దీపాలు, 2 కిలోల 740 గ్రాములు వెండి రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. ఇళ్లలోకి చొరబడి చోరీకి పాల్పడిన వ్యక్తిని బండేపాళ్య పోలీసులు అరెస్టుచేసి రూ.3.5 లక్షల విలువచేసే 8 గ్రాములు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పూలకుండీలు లేదా తపాలాబాక్సుల్లో ఇంటి తాళం పెట్టరాదని కమిషనర్ నగర ప్రజలకు సూచించారు.

గోవిందనామ స్మరణతో మార్మోగిన అగర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపైన ఊరేగుతున్న స్వామివారు

- నేత్రపర్వంగా శ్రీనివాసుడి బ్రహ్మరథోత్సవం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరం బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు అగర గ్రామం గోవిందనామస్మరణతో మార్మోగింది. గ్రామంలో కొలువైన శ్రీనివాస స్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. వేకువజామున మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆనంతరం మూల విరాట్‌తోపాటు ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చారు. బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి, జేడీఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు డి.కుపేంద్ర రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం రథానికి పూజలు చేసి ముందుకు లాగారు. దీంతో ఒక్కసారిగా గోవింద నామస్మరణతో ఆప్రాంతం మార్మోగింది. దారి పొడవునా మహిళలు స్వామివారికి దీప హారతులు అందజేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా వచ్చిన భక్తుల కోసం అగర గ్రామస్తులు మజ్జిగ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. సన్నాయి వాయిద్యాలు, డొల్లుకుణిత, జానపదకళా బృందాలు భక్తులను కనువిందు చేశాయి.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి తదితరులు



రథానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు వార్తలు..

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

కెలమంగలం: రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి చెందిన ఘటన కెలమగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కెలమంగలం సుల్తాన్‌పేటకు చెందిన గులాబ్(40) బట్టల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఓమిని కారులో కెలమంగలం– బారందూరు రోడ్డుపై వెళ్తుండగా సెవెంత్‌డే పాఠశాల వద్ద ఎదురుగా వచ్చిన పికప్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గులాబ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కెలమంగలం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పంటల సాగును పరిశీలించిన రైతులు

హోసూరు: కాయగూరల సాగు, ఎక్కువ దిగుబడి నిచ్చే రకాలపై తళి వ్యవసాయ శాఖ రైతులను బెంగళూరులోని ఐసీఏఆర్ భారత ఉద్యానవన పరిశోధన కేంద్రానికి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఆత్మా పథకం అమలు అధికారిణి సింధన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంకర జాతి రకాలైన అర్కా కగన్, అర్కా తన్వి, అర్కా యశశ్విని, అర్కా నూతన్, అర్కా కీర్తి, అర్కా సుగుణ, అర్కా కళ్యాణ్ తదితర కరాలకు చెందిన మిరప, టమాట, క్యాప్సికం సాగుపై అవగాహన కల్పించారు.

నాణ్యమైన న్యాయ విద్యా బోధన అవసరం

- విశ్రాంత న్యాయమూర్తి వెంకటాచలయ్య ప్రతిపాదన

శివాజీనగర: పట్టుదలతో సాధన చేసే వారిని అడ్డుకోవడం ఎవరి వల్లా కాదని విశ్రాంత న్యాయమూర్తి ఎం.ఎన్.వెంకటాచలయ్య తెలిపారు. విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో సహకార రంగ భీష్ముడు కే.హెచ్.పాటిల్ అభిమాని బృందం, బెంగళూరు నగర వివిధ సహకార సంఘాలు, సహకార రంగ భీష్మ కే.హెచ్.పాటిల్ మెమోరియల్ ట్రస్ట్ చేపట్టిన కే.హెచ్.పాటిల్ జన్మ శతమానోత్సవ ఆచరణ, కేహెచ్.పాటిల్ స్కూల్ ఆఫ్ లాను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగం, సంపాదన ఎవరు పడితే వారు సంపాదించవచ్చు. విద్యార్థులు దీనికంటే ముఖ్యంగా అత్యుత్తమ ధ్యేయాలతో నాణ్యమైన విద్య కలిగి ఉండాలన్నారు. ఈ కాలేజీలో దేశమంతా మెచ్చుకునేలా నాణ్యమైన బోధన లభించాలన్నారు. కే.హెచ్.పాటిల్ అత్యంతం స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అన్నారు. ఆయన పేరుతో న్యాయశాస్త్ర పాఠశాల ప్రారంభించటం తన అదృష్టం. ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను హులకోటిలో చేశారన్నారు. ఆసుపత్రి, విద్య, ఇంజనీరింగ్ కాలేజీ, నైపుణ్యాధారిత కేంద్రాలను తెరిచారన్నారు. సామాజిక, ఆర్థికంగా ప్రజలకు అతిపెద్ద సేవలు చేసిన ఆయన ఒక శక్తి అయ్యారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మాజీ సీఎం వీరప్ప మొయిలీ లా పాఠశాల లోగోను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ మంత్రి కే.జే.జార్జ్, మాజీ మంత్రి ఆర్.వీ.దేశపాండే, విధాన పరిషత్ సభాపతి బసవరాజ్ ఎస్.హొరట్టి, శాసనసభా స్పీకర్ యూ.టీ.ఖాదర్, మంత్రులు హెచ్.కే.పాటిల్, డాక్టర్ జీ.పరమేశ్వర్, కే.హెచ్.మునియప్ప, ప్రియాంక ఖర్గే, దినేశ్ గుండూరావు, శరణ గౌడ పాటిల్, ఎన్.ఎస్.బోసురాజు, కృష్ణబైరేగౌడ, ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గుట్కా తరలిస్తున్న కారు బోల్తా



స్వాధీనం చేసుకున్న గుట్కా ఉత్పత్తులు

క్రిష్ణగిరి: కారు బోల్తా పడటంతో నిషేధిత గుట్కా రవాణా వెలుగు చూసింది. ఈ ఘటన ఊత్తంగేరి సమీపంలో జరిగింది. క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలో క్రిష్ణగిరి నుంచి తిరువణ్ణామలైకు అతివేగంగా వెళ్తున్న కారు ఊత్తంగేరి వద్దకు రాగానే బోల్తా పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఊత్తంగేరి పోలీసులు చేరుకునే లోపు కారు డ్రైవర్ పరారైయ్యాడు. కారును సోదా చేయగా 290 కిలోల గుట్కా పట్టుబడింది. కారుతో పాటు గుట్కాను స్వాధీనం చేసుకున్నారు.

గుట్కా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

బస్సులో గుట్కా తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వివరాలు.. తమిళనాడు– కర్ణాటక సరిహద్దు జూజువాడి చెక్‌పోస్ట్ సిఫ్‌కాట్ పోలీసులు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన బస్సును సోదా చేయగా ఇద్దరు వ్యక్తులు సంచుల్లో గుట్కా తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులను తిరునల్వేలి జిల్లా రవణసంద్రం గ్రామానికి చెందిన ఇబ్రహీం(29), ఇస్మాయిల్(46)గా గుర్తించి అరెస్ట్ చేశారు.

నేత్రపర్వం..చంద్రచూడేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హోసూరు: హోసూరు తేరుపేటలో వెలసిన చారిత్రక ప్రసిద్ధ మరకతాంభ సమేత శ్రీ చంద్రచూడేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని శివనామ స్మరణం చేస్తూ రథాన్ని లాగారు. వేకువజాము నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తేరుపేటలోని కళ్యాణ చంద్రచూడేశ్వరస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్‌కలెక్టర్ ప్రియాంక, హోసూరు మేయర్ ఎస్.ఏ. సత్య, ఉపమేయర్ ఆనందయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎం.నాగరాజ్, ఎన్.ఎస్.మాదేశ్వరన్ రథానికి పూజలు నిర్వహించి ముందుకు లాగారు. స్థానిక కళాకారుల కోలాటం, భాజా భజంత్రీల మధ్య రథోత్సవం సాగింది. దాతలు భక్తులకు చల్లని పానీయాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హోసూరు, డెంకణీకోట, అంచెట్టి, సూళగిరి తదితర ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. హోసూరు పట్టణంలోని రోడ్లన్నీ జనసందడితో కిక్కిరిసిపోయాయి. జిల్లా ఎస్పీ తంగదురై నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా కాముని పున్నమి వేడుకలు




బైక్‌పై రతిమన్మథులు

బొమ్మనహళ్లి: వందేళ్లుగా గ్రామీణ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కాముని పున్నమి వేడుకలను బెంగళూరు గ్రామీణ జిల్లా చెన్నపట్టణ నగరంలో ఉన్న మండిపేటె వీధి గరుడగంబడలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రతి మన్మథుల విగ్రహాలను ప్రతిష్ఠించి 12 రోజులపాటు పూజలు నిర్వహించారు. చివరి రోజు హోలీ సందర్భంగా పూజారి గంగాధరయ్య నేతృత్వంలో రతి మన్మథుల ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు ఎంతో ఉత్సాహంతో పరస్పరం రంగులు చల్లుకున్నారు. 12 రోజులుగా రతి, మన్మథుల విగ్రహాలను కారు, బైక్‌లపై ఊరేగించారు. వేడుకల్లో భాగంగా సత్యనారాయణ, గురు రాఘవేంద్ర పూజలు నిర్వహించారు. గురువారం కృత్రిమ ఏనుగుపై రతి మన్మథులను ఊరేగించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, కృష్ణుడు తదితర దేవతా రూపాలను ఊరేగించారు.

దక్షిణాదిలోనే ఓటర్లు ఎక్కువ

ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా ఎక్కువ కానీ, ఓటర్లుగా నమోదైనవారి సంఖ్య తక్కువ. కానీ, దక్షిణాదిలో అలా కాదు. లోక్‌సభ నియోజకవర్గాల విషయానికొస్తే ఉత్తరాదిలో యూపీ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో సగటున ఒక లోక్‌సభ స్థానంలో 32 లక్షల జనాభా ఉంటే.. దక్షిణాదిలో 22–23 లక్షల మంది ఉన్నారు. కానీ ఒక్కో సెగ్మెంటులోనూ ఉత్తరాదిలో సగటున 19 లక్షల మంది ఓటర్లు ఉంటే కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లోనూ సగటున అంతమందే ఓటర్లు ఉన్నారు.





ఆధారం : ఎన్నికల సంఘం

ఉత్తరాంధ్ర జలాలు ఉత్తి మాటే

జూన్‌లో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలిస్తామన్న సీఎం చంద్రబాబు

- 9 నెలలుగా తట్టెడు మట్టి కూడా ఎత్తని దుస్థితి
- 2024–25 బడ్జెట్‌లో రూ.79.97 కోట్లు కేటాయింపు
- ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని వైనం
- పోలవరం ఎడమ కాలువను 17,560 క్యూసెక్కులతో చేపట్టిన వైఎస్సార్
- 2009 జనవరి 2న ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అంకురార్పణ
- ఆయన హఠాన్మరణంతో కదలని పనులు
- 2019 ఎన్నికలకు ముందు తొలి దశ పనులు చేపట్టకుండానే చేతులెత్తేసిన టీడీపీ సర్కార్
- రూ.17,411 కోట్లతో 2022లో పనులు చేపట్టిన నాటి సీఎం వైఎస్ జగన్
- రెండు దశల పనులు కాంట్రాక్టర్లకు అప్పగింత.. డిజైన్‌లన్నీ 2023 నాటికే ఆమోదం
- పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు.. కూటమి ప్రభుత్వం రాగానే గ్రహణం



సాక్షి, అమరావతి : ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు 1,200 గ్రామాల్లో 30 లక్షల మంది దాహార్తిని తీర్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి గ్రహణం పట్టింది. తొమ్మిది నెలలుగా తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. ఈ పథకం పనులకు 2024–25 బడ్జెట్‌లో రూ.79.97 కోట్లు కేటాయించినా, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పోలవరం ఎడమ కాలువలో 162.409 కి.మీ నుంచి రోజుకు 8 వేల క్యూసెక్కుల చొప్పున 63.2 టీఎంసీల గోదావరి జలాలను తరలించి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 జనవరి 2న నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. ఈ పథకాన్ని వేగంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో అప్పట్లో టెండర్లు కూడా పిలిచారు. కానీ.. వైఎస్సార్ హఠాన్మరణంతో ఆ పథకం పనులు ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం.. 2019 ఎన్నికలకు ముందు ఈ పథకం తొలి దశ పనులను రూ.2020.20 కోట్లతో చేపట్టి, 4.85 శాతం అధిక ధరకు కాంట్రాక్టర్లకు అప్పగించింది. కానీ.. తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. 2022లో నాటి సీఎం వైఎస్ జగన్ రూ.17,411 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చారు. తొలి దశలో పోలవరం ఎడమ కాలువలో 162.40 కి.మీ నుంచి 23 కి.మీల పొడవున కాలువ తవ్వకం, రెండు ఎత్తిపోతలు, పెదపూడి రిజర్వాయర్ నిర్మాణం, ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీ పనులను రూ.954.09 కోట్లతో, రెండో దశలో పాపయ్యపాలెం ఎత్తిపోతల, 121.62 కి.మీల పొడవున ప్రధాన కాలువ, ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీ పనులను రూ.5,134 కోట్లతో కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీటికి అనుబంధంగా నిర్మించాల్సిన భూదేవి, వీరనారాయణపురం, తాడిపూడి రిజర్వాయర్‌ల నిర్మాణాన్ని దశల వారీగా చేపట్టాలని నిర్ణయించారు. తొలి దశ, రెండో దశ పనులు చేపట్టడానికి అవసరమైన డిజైన్‌లు అన్నింటినీ 2023 నాటికే ప్రభుత్వం ఆమోదించింది. దాంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. తొలి దశ పనులు చేపట్టేందుకు 3,822 ఎకరాలు, రెండో దశ పనులు చేపట్టేందుకు 12,214.36 ఎకరాల సేకరణ ప్రక్రియను కొలిక్కి తెచ్చారు.

ఆ తర్వాత ఎక్కడి పనులు అక్కడే

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు నిలిచిపోయాయి. 2025 జూన్ నాటికే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలిస్తామని అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో సీఎం చంద్రబాబు అనకాపల్లి జిల్లా పర్యటనలో ప్రకటించారు. 2024–25 బడ్జెట్లో ఈ పథకానికి రూ.63.02 కోట్లు తొలుత కేటాయించారు. ఆ తర్వాత సవరించిన బడ్జెట్‌లో ఆ పథకానికి రూ.79.97 కోట్లు కేటాయించారు. కానీ.. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. తొమ్మిది నెలలుగా తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. 2025–26 బడ్జెట్‌లో ఆ పథకానికి రూ.605.75 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో ఒక్క పైసా కూడా ఖర్చు చేయని నేపథ్యంలో.. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేస్తారా.. లేదా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తరాంధ్రకు గోదావరి జలాభిషేకం ఇలా..

- వెనుకబడిన ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలించి, సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పోలవరం ఎడమ కాలువను 17,560 క్యూసెక్కుల సామర్థ్యంతో 2004లో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. 162.409 కి.మీ నుంచి రోజుకు 8 వేల క్యూసెక్కుల చొప్పున అనకాపల్లి జిల్లా పాపయ్యపాలెం వరకు 23 కి.మీల పొడవున తవ్వే కాలువ ద్వారా తరలిస్తారు. ఈ కాలువలో 4.5 కి.మీ నుంచి మరో లింక్ కెనాల్ తవ్వి జామద్దులగూడెం నుంచి కొత్తగా 3.16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే పెదపూడి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు.
- పాపయ్యపాలెం నుంచి 45 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి, 106 కి.మీల పొడవున విజయనగరం జిల్లా గాదిగెడ్డ రిజర్వాయర్ వరకు తవ్వే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా తరలిస్తారు. ఈ కాలువలో 14 కి.మీ నుంచి తవ్వే లింక్ కెనాల్ ద్వారా నీటిని మళ్లించి.. కొత్తగా 6.2 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే భూదేవి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు.
- ప్రధాన కాలువలో 49.50 కి.మీ నుంచి తవ్వే మరో లింక్ కెనాల్ ద్వారా నీటిని తరలించి, వీఎన్ (వీరనారాయణ) పురం వద్ద ఎత్తిపోతల ద్వారా కొత్తగా 6.55 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే వీఎన్ పురం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు.
- ప్రధాన కాలువలో 73 కి.మీ నుంచి తవ్వే మరో లింక్ కెనాల్ ద్వారా నీటిని తరలించి.. తాడిపూడి ఎత్తిపోతల ద్వారా కొత్తగా 3.80 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే తాడిపూడి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు.
- ప్రధాన కాలువలో 102 కి.మీ నుంచి తవ్వే మరో లింక్ కెనాల్ ద్వారా నీటిని తరలించి.. కొండగండరేడు నుంచి 60 కి.మీల పొడవున తవ్వే కాలువలోకి నీటిని ఎత్తిపోస్తారు. ఈ కాలువ నుంచి బీఎన్ వలస బ్రాంచ్ కెనాల్, జి.మద్రివలస లిఫ్ట్ కెనాల్, బూర్జువలస లిఫ్ట్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు నీళ్లందిస్తారు. మొత్తంమీద ఈ పథకం ద్వారా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3.21 లక్షలు, విజయనగరం జిల్లాలో 3.94 లక్షలు, శ్రీకాకుళం జిల్లాలో 85 వేల ఎకరాలకు నీళ్లందిస్తారు.

క్లుప్తంగా...

శ్రీకాళహస్తి యువకుడిపై అమెరికాలో కాల్పులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం



ఏర్పేడు (రేణిగుంట): తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గోవిందవరానికి చెందిన యువకుడు పోతుగుంట మోహన్‌సాయి (25)పై అమెరికాలోని మెమ్ఫిస్ టెనస్సీలో గురువారం రాత్రి కాల్పులు జరిగాయి. వివరాలు.. గోవిందవరం గ్రామానికి చెందిన మురళి, అరుణ కొన్నేళ్ల కిందట శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్లి స్థిరపడ్డారు. రెండేళ్ల కిందట వారి కుమారుడు మోహన్‌సాయి అమెరికాలో ఎంఎస్ చదివేందుకు వెళ్లాడు. అక్కడే ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ క్రమంలో అమెరికాలోని మెమ్ఫిస్ టెనస్సీ ప్రాంతంలో స్నేహితుడి కారులో ఉండగా, గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.దీంతో మోహన్‌సాయి కుటుంబీకులు తీవ్ర కలత చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మోహన్‌సాయి కుటుంబ సభ్యులతో మాట్లాడి.. ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

విద్యారంగ–ఆర్థిక సమస్యలపై రేపు సదస్సు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) ఆధ్వర్యంలో విద్యారంగ–ఆర్థిక సమస్యలపై ఆదివారం (రేపు) రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.

వైఎస్ జగన్ ఫొటోల మార్ఫింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు

- మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో నడిచే ఐటీడీపీ నుంచే మొత్తం వ్యవహారం
- కఠినంగా శిక్షించాలని కోరిన వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుల కమిటీ నేతలు



మాట్లాడుతున్న పార్టీ ఫిర్యాదుల కమిటీ నేతలు

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో, ఇతర మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై, ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్న ఘటనలపై ఆ పార్టీ రాష్ట్ర ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంకిరెడ్డి నాగనారాయణమూర్తి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరు కనకారావులు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో నడిపే ఐటీడీపీ టీమ్ నుంచి వైఎస్ జగన్ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో, ఇతర సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఓ టీడీపీ కార్యాలయంగా మారిందని, ఎలాంటి ఫిర్యాదు ఇచ్చినా కనీసం విచారణ కూడా చేయడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత స్థలంలో.. టీడీపీ తిష్ట

- అర్ధరాత్రి వేళ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ స్థలం ప్రహరీ కూల్చివేత
- నెల్లూరు నగరంలో ఘటన
- ఎమ్మెల్యే ఒత్తిడి చేసినా పార్టీ మారనందుకు వేధింపులు!



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌కు చెందిన స్థలం ప్రహరీని కూల్చివేసిన దృశ్యం

నెల్లూరు(బారకాసు): టీడీపీ మూక రెచ్చిపోయింది. గురువారం అర్ధరాత్రి వేళ హల్‌చల్ చేసింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మొయిళ్ల గౌరీకి చెందిన స్థలం ప్రహరీని ధ్వంసం చేసి అందులో ఉన్న గదిని నేలమట్టం చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. కార్పొరేటర్ గౌరిని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి రమ్మని కోరినా నిరాకరించడంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. పడారుపల్లి కళ్యాణ్‌నగర్‌లోని సర్వే నంబరు 93/2లో 66 అంకణాల స్థలాన్ని కార్పొరేటర్ గౌరీ భర్త సురేష్‌రెడ్డి కొన్నారు. రూ.3 కోట్ల విలువైన ఈ స్థలాన్ని పక్కా డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇటీవల ప్రహరీ, మధ్యలో గది నిర్మించి సిమెంట్ బస్తాలు నిల్వ చేశారు. అయితే, టీడీపీకి చెందిన చోటా నేత ఈ స్థలంపై కన్నేశారు. సర్వే నంబరుకు సంబంధం లేని డాక్యుమెంట్‌తో వచ్చి.. స్థలం తమదేనంటూ వేధింపులకు దిగాడు. గురువారం రాత్రి జేసీబీతో ప్రహరీ కూల్చివేయించారు. మట్టిని తరలించుకుపోయారు. బాధితులు వేదాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పి పంపించారు. మళ్లీ వేకువజామున టీడీపీ నేత దౌర్జన్యంగా వచ్చి గదిని పడగొట్టి టెంట్ వేసి కూర్చున్నారు. పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేసినా స్పందించలేదని, పైగా ఎమ్మెల్యే చెప్పినట్లు నడుచుకోవాలని సూచించారని బాధితులు వాపోతున్నారు. నెల్లూరు భక్తవత్సలనగర్‌లో వీరికి ఓ ప్రైవేట్ కళాశాల ఉంది. అయితే, టీడీపీలోకి రమ్మని కోరినా వినకపోవడంతో ఎమ్మెల్యే తమపై కక్ష పెంచుకున్నారని గౌరీ దంపతులు ఆరోపిస్తున్నారు. తమ కళాశాల ఎదుట అనధికారికంగా దుకాణాన్ని ఏర్పాటు చేయించారని, దీనిని తొలగించాలని కార్పొరేషన్ అధికారులను కోరినా వారు స్పందించలేదని చెప్పారు. సురేష్‌రెడ్డి దగ్గర అప్పు తీసుకున్న వారిని కూడా తిరిగివ్వొద్దని సూచిస్తున్నట్లు తెలిపారు. కాగా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫోన్‌లో సురేష్‌రెడ్డితో మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అండగా ఉంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకే దేవుడు.. మాజీతో చెడుగుడు!

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని నడిరోడ్డుపై అడ్డుకున్న పోలీసులు
- పోలేపల్లి ఆలయ వార్షికోత్సవానికి వెళ్లకూడదని ఆంక్షలు



జాతీయ రహదారిపై తోపుదుర్తిని అడ్డుకున్న పోలీసులు

కనగానపల్లి : రాష్ట్రంలో పోలీసులు సైతం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ అధికార పార్టీ నేతల ఆదేశాలతో అకారణంగా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పోలేపల్లిలో జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవానికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని శుక్రవారం నడిరోడ్డుపై దౌర్జన్యంగా అడ్డుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు అనంతపురం నుంచి జాతీయ రహదారి మీదుగా పోలేపల్లికి వెళ్తున్న ప్రకాష్ రెడ్డిని కనగానపల్లి మండలం దాదులూరు సమీపంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రామగిరి సర్కిల్ పోలీసులు అడ్డుకున్నారు. దైవకార్యానికి వెళ్తున్న తనను ఎందుకు అడ్డుకొన్నారని ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ గ్రామానికి ఎమ్మెల్యే పరిటాల సునీత వస్తున్నందున మీరు వెళ్లడానికి వీల్లేదని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే మిమ్మల్ని అనుమతించలేమని చెబుతూ.. పోలీసులు ఆయన్ను బలవంతంగా వెనక్కు పంపారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికార టీడీపీ నాయకుల మాటలు విని ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో పోలీసులు లేనిపోని ఆంక్షలు పెడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పరిటాల సునీతకు వత్తాసు పలుకుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తారు.

టీడీపీలో తొట్టి గ్యాంగ్!

- నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఓ పత్రికలో రాయిస్తున్నారు
- హాఫ్, క్వార్టర్ బాటిల్ బ్యాచ్
- వారికి చెప్పుదెబ్బలు ఇచ్చే సమయం వచ్చింది
- టీడీపీ నేతలపై జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే థామస్ ఫైర్



జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే థామస్ సెల్ఫీ వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : సొంత పార్టీలోని కొందరిపై చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే థామస్ మండిపడ్డారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని.. పనికిమాలిన తొట్టిగ్యాంగ్ అంటూ వారిని సంబోధించారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఈ వీడియో ఇప్పుడు జిల్లాలో వైరల్‌గా మారింది. అందులో ఆయన ఏమన్నారంటే..

'సొంత పార్టీలోని ఐదుగురు నాయకులు, ఓ దమ్మున్న పత్రిక నాతోపాటు నా పీఏ, గన్‌మెన్‌పై మా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా దుష్ప్రచారం చేస్తూ, పత్రికల్లో రాయిస్తున్నారు. ఎవరెన్ని చేసినా నన్నేమీ చెయ్యలేరు. ఎన్నికల సమయంలో నన్ను ఓడించడానికి ఆ ఐదుగురు నాయకులు ప్రయత్నించారు. ఓ ట్రక్కును (మద్యంతో వస్తున్న వాహనం) పట్టించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధి కాకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నాయి. ఆ తొట్టిగ్యాంగ్ తిరుపతి, చిత్తూరులో కూర్చుని.. క్వార్టర్, హాఫ్ మద్యం సేవించి సమావేశాలు నిర్వహిస్తూ విష ప్రచారం చేస్తోంది. గలీజు నాయాళ్లు.. వారికి సిగ్గు, లజ్జలేదు. ఎన్నికల సమయంలో నేను ఎస్సీని కాదని ప్రచారం చేసింది కూడా వాళ్లే. వారికి చెప్పుదెబ్బలు ఇచ్చే సమయం దగ్గరపడింది'.. అంటూ ఆ వీడియోలో థామస్ హెచ్చరించారు.

అది హిందూ ధర్మంపై జరిగిన దాడి

- కాశీనాయన జ్యోతిక్షేత్రం ధ్వంసానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- అటవీశాఖ కూల్చివేతలకు పాల్పడితే మంత్రి పవన్ ఎందుకు మౌనంగా ఉన్నారు?
- ఇదేనా ఆయన సనాతన ధర్మ పరిరక్షణ?
- సంబంధంలేని లోకేశ్ క్షమాపణలు చెప్పడమేంటి?
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫైర్



సాక్షి, అమరావతి : కాశీనాయన జ్యోతిక్షేత్రంలో జరిగిన నిర్మాణాల ధ్వంసానికి టీడీపీ కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడు రాష్ట్రాల్లోని లక్షలాది మంది భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్రంలో జరిగిన కూల్చివేతలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని.. ఇది హిందూ ధర్మంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. సనాతన ధర్మ పరిరక్షకుడిగా చెప్పుకునే పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అటవీశాఖే ఈ కూల్చివేతలకు తెగబడటాన్ని ఎలా అర్థంచేసుకోవాలని ప్రశ్నించారు. విష్ణు ఇంకా ఏమన్నారంటే..

అటవీశాఖ మంత్రిగా ఉన్న పవన్‌కళ్యాణ్‌కు తెలీకుండానే ఆ శాఖాధికారులు ఈ ధ్వంసానికి పాల్పడ్డారా? ఈ ఘటనపై ఆయనెందుకు మౌనంగా ఉన్నారు? ఇదేనా ఆయనకు హిందూ ధర్మంపై ఉన్న గౌరవం? సంబంధంలేని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందించడాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? తిరుపతి తొక్కిసలాట ఘటనలో హడావుడిగా క్షమాపణలు చెప్పిన పవన్ ఇప్పుడెందుకు ముఖం చాటేశారు? ఇక సీఎం చంద్రబాబుకు ఈ విషయంపై సమాచారంలేదని తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.


ఆ భూములపై అప్పట్లోనే జగన్ లేఖ..

ఇదిలా ఉంటే.. నల్లమల అటవీ ప్రాంత పరిధిలో ఉన్న ఈ క్షేత్రంలోని 13 హెక్టార్లను రిజర్వ్ ఫారెస్ట్ నుంచి మినహాయించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్ 2023 ఆగస్టు 18న కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేష్ యాదవ్‌కి లేఖ రాశారు. ఇలాగే కేంద్రాన్ని పవన్ ఎందుకు కోరలేదు? ఇలాంటి పార్టీల కూటమి నేడు హిందూ ధర్మంపై మాట్లాడటం విడ్డూరంగా ఉంది.

ఉర్దూ అకాడమీలో అలజడి

నిధుల గోల్‌మాల్‌లో ఇంటి దొంగల కలవరం

- త్వరలో విచారణ షురూ?
- దీంతో మంత్రి ఫరూక్‌తో మంత్రాంగం
- టీడీపీ మైనార్టీ నాయకుడి మధ్యవర్తిత్వం
- రూ.3.15 కోట్ల గోల్‌మాల్‌పై విచారణ కమిషన్ వేసిన కూటమి ప్రభుత్వం
- టీడీపీ హయాంలో రూ.4 కోట్లు మళ్లింపుపై సీఐడీ కేసు పెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఆ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసిన సీఐడీ
- మరో 11 మంది అరెస్టుకూ రంగం సిద్ధం



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: ఏపీ ఉర్దూ అకాడమీ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో విస్తుపోయే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రూ.కోట్లాది నిధుల అవకతవకల వ్యవహారం ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని ఇంటి దొంగల్లో కలవరం తీవ్రమైంది. ''ఉర్దూ అకాడమీలో అంతులేని అక్రమాలు'' శీర్షికన ''సాక్షి'' ప్రచురించిన కథనంతో అకాడమీలో అలజడి మొదలైంది. తాజాగా రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కొందరు అకాడమీ ఉద్యోగులు టీడీపీకి చెందిన మైనార్టీ నాయకుడి మధ్యవర్తిత్వంలో మంత్రాంగం సాగించడం చర్చనీయాంశమైంది.

త్వరలో విచారణ

గత టీడీపీ హయాం(2016–17)లో రూ.3.15 కోట్లు తెలంగాణ ఉర్దూ అకాడమీకి అప్పుగా ఇచ్చినట్టు ఏపీ ఉర్దూ అకాడమీ ఆడిట్ రిపోర్టులో లెక్కలు చూపించారు. దీనిపై ఏపీ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్‌మీరా తెలంగాణ ఉర్దూ అకాడమీని సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా తాము ఏపీ నుంచి ఎలాంటి అప్పు తీసుకోలేదని తేల్చిచెప్పింది. దీంతో చర్యలు తీసుకోవాలని నాగుల్‌మీరా లోకాయుక్తను ఆశ్రయించారు. ఫిర్యాదును క్షుణ్నంగా పరిశీలించి విచారణకు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త రిజిస్ట్రార్ గతేడాది నవంబర్ 26న ఏపీ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శికి నోటీసు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం జనవరి 6న విచారణ కమిషన్‌ను నియమించింది. రూ.3.15 కోట్ల గోల్‌మాల్‌పై రహస్యంగా విచారణ చేసి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తాను ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్నందున.. విచారణ పూర్తికి మరికొంత గడువు కావాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ సీహెచ్ శ్రీధర్ ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో విచారణ ప్రారంభించే ఆకాశం ఉంది.

దూకుడు తగ్గేలా చూడండి..

మరోవైపు 2018–19 మధ్య టీడీపీ హయాంలో దాదాపు రూ.4 కోట్లు ఉర్దూ అకాడమీ నిధులను 67 మంది వ్యక్తిగత ఖాతాలకు మళ్లించిన వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021లో సీఐడీ కేసు నమోదు చేసి.. నలుగురిని అరెస్టు చేసింది. ఐపీసీ సెక్షన్ 420, 409 రెడ్ విత్ 120(బి) కేసులో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలీ (ప్రస్తుతం రిటైర్డ్), సూపరింటెండెంట్ జాఫర్ (ప్రస్తుతం తెలంగాణ ఉర్దూ అకాడమీలో పనిచేస్తున్నారు)లను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ అనంతరం బెయిల్‌పై వచ్చారు. తాజాగా ఏపీకి చెందిన ఉర్దూ అకాడమీ ఉద్యోగితో పాటు బయటి వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. మరో 11 మందిని సీఐడీ అరెస్టు చేస్తుందనే లీకులు ఇవ్వడంతో వారంతా టీడీపీ మైనార్టీ నేత మధ్యవర్తిత్వంతో ప్రభుత్వ పెద్దల శరణు కోరుతున్నారు. ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని కలవరపడుతున్నారు. సీఐడీ దూకుడుకు కళ్లెం వేసి తమను కాపాడాలని మంత్రిని కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, గత టీడీపీ హయాంలో ఉర్దూ అకాడమీని హద్దులేని అక్రమాలకు అడ్డాగా మార్చేశారని, రూ.30కోట్ల నిధులు ఎవరెవరు కొల్లగొట్టారో తేల్చాలని ముస్లిం సమాజం కోరుతోంది.

19న యూకే పార్లమెంట్‌లో చిరంజీవికి సత్కారం

సాక్షి, హైదరాబాద్: కళారంగానికి, సమాజానికి నాలుగున్నర దశాబ్దాల సేవలకు గుర్తింపుగా ప్రముఖ నటుడు చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ యూకే పార్లమెంట్‌లో గౌరవించనున్నారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందింది. ఈనెల 19న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో యూకేకి చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు నవేందు మిశ్రా చిరంజీవిని ఘనంగా సత్కరించనున్నారు. సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మన్ సహా ఇతర పార్లమెంట్ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ఒకే రోజు రెండు గుడ్లు!



వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం కొండూరుకు చెందిన చెంచిరెడ్డి కోడి శుక్రవారం ఉదయం సాధారణ పరిమాణంలో ఓ గుడ్డు పెట్టింది. మళ్లీ సాయంత్రం చిన్న పరిమాణంలో మరో గుడ్డు పెట్టింది. సాధారణంగా కోడి రోజుకు ఒకు గుడ్డు మాత్రమే పెడుతుంది. అయితే ఒకే రోజు రెండు గుడ్లు పెట్టి ఆశ్చర్యానికి గురి చేసింది. – అట్లూరు

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 15-3-2025



ఆమె పేరు వసుంధర.. విధి పెట్టిన అన్ని పరీక్షల్లో నెగ్గింది.. వీల్ చెయిర్‌తోనే విజయానికి అడుగులు వేసింది! మాతృత్వాన్నీ సాధించింది! డేరెస్ట్ ఉమన్‌గా మన్ననలు అందుకుంటున్నారు హైదరాబాద్‌కు చెందిన వసుంధర. ఈ విజేత గురించి ఆమె మాటల్లోనే..

భర్త నరేందర్, బాబుతో వసుంధర

వీల్ పవర్

'మన దగ్గర ఫిజికల్లీ చాలెంజ్డ్ వాళ్లకు అనువైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇప్పటికీ లేదు. అంటే నా చిన్నప్పటి పరిస్థితి ఊహించుకోండి.. ర్యాంప్స్, సపరేట్ వాష్ రూమ్స్ అనే ఊసే ఉండేది కాదు. ఫిజికల్లీ చాలెంజ్డ్ పిల్లలు చదువుకోవాలన్నా.. ఏదైనా యాక్టివిటీ నేర్చుకోవాలన్నా వాళ్లతో ఒక మనిషి ఉండాల్సిందే పనులన్నీ మానుకొని! అందుకే సాధారణంగా దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో వైకల్యం ఉన్న పిల్లలను ఇంట్లోనే ఉంచేస్తారు. కానీ నన్ను మా అమ్మ చదివించింది. ఆవిడ సింగిల్ పేరెంట్. పెద్దగా చదువుకోలేదు. కానీ బ్రహ్మాండమైన లీడర్‌షిప్ క్వాలిటీస్‌తో నెగ్గుకొచ్చింది. టైలరింగ్ చేసేది అమ్మ. వీల్ చెయిర్ కొనేంత స్తోమత లేదు. అయినా నా చదువు విషయంలో వెనకడుగు వేయలేదు. స్కూల్‌కి, కాలేజ్‌కి తమ్ముడే నన్ను ఎత్తుకుని తీసుకెళ్లేవాడు. కాలేజ్‌లో క్లాసెస్ మారాల్సి వచ్చినప్పుడు ఫ్రెండ్స్ హెల్ప్ చేసేవారు.

> నేనొక డిజేబుల్డ్ పర్సన్‌ని అన్న విషయమే మర్చిపోయాను. సమీక్ష కురాలిగా... కంటెంట్ రైటర్‌గా, కొన్నిసార్లు న్యూస్ రీడర్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా.. ఇలా అన్ని బాధ్యతలూ తీసుకున్నాను. రిపోర్టర్ లేకుండా అరగంట విమెన్ బులెటిన్‌ని ఆరునెలల పాటు రన్ చేశాను.

కలాం గారిని అడిగాను కానీ...

నేను సీఏ చదువుతున్నప్పుడు అబ్దుల్ కలాం గారిని కలిశాను. ఫిజికల్లీ చాలెంజ్డ్ పర్సన్స్ నడుపుకోగలిగే వెహికిల్స్‌ని సమకూర్చొచ్చు కదా అని అడిగాను. అడిగాక ఆలోచించాను.. వాళ్లకోసం నేను కూడా ఏమైనా చేయొచ్చు కదా.. మాకున్న సమస్యల గురించి మనమే పోరాడాలి.. ఒకరికొకరం సపోర్ట్ చేసుకోవాలనిపించింది. అది మీడియాలో ఉంటేనే సాధ్యమవుతుందని గ్రహించాను. దాంతో సీఏ డ్రాప్ అయిపోయి, పీజీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం చదివాను.

చాలా నేర్చుకున్నాను..

జర్నలిస్ట్‌గా నా పయనాన్ని ఆరంభించాను. చాలెంజింగ్‌గా ఉండిందా జాబ్. నేనొక డిజేబుల్డ్ పర్సన్‌ని అన్న విషయమే మర్చిపోయాను. సమీక్షకురాలిగా... కంటెంట్ రైటర్‌గా, కొన్నిసార్లు న్యూస్ రీడర్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా.. ఇలా అన్ని బాధ్యతలూ తీసుకున్నాను. రిపోర్టర్ లేకుండా అరగంట విమెన్ బులెటిన్‌ని ఆరునెలల పాటు రన్ చేశాను. దాంతో చాలా నేర్చుకున్నాను. అయితే పది గంటలపాటు అలా ఒకేచోట కూర్చోవడం వల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చాయి. దాంతో ఆ ఉద్యోగాన్ని వదిలేశాను. కానీ దివ్యాంగుల సమస్యలను తెలపడానికి ఒక వేదికైతే ఉండాలి కదా! అందుకే వేవ్ మీడియాను స్టార్ట్ చేశాను. దివ్యాంగులకు అన్నిరకాల అవకాశాలను అందించడానికి 'గుర్తింపు ఫౌండేషన్'ను మొదలుపెట్టాను. దివ్యాంగుల్లోని అంట్రప్రెన్యూర్ స్కిల్స్‌ని వెలికి తీసి, వాళ్లను అంట్రప్రెన్యూర్స్‌గా తయారుచేయడానికి 'డీ హబ్'ను ప్రారంభించాను. రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ పూర్తి చేసుకున్నాను. దీనికి తెలుగు రాష్ట్రాల నుంచి నేనొక్కదాన్నే సెలెక్ట్ అయ్యాను.

వైవాహిక జీవితానికి వస్తే..

డిజేబుల్డ్ పర్సన్స్ వైవాహిక జీవితానికి పనికిరారనే అపోహ, ఆరోగ్యవంతుడు డిజేబుల్ అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడంటే అతనిలో ఏం లోపం ఉందో అనే కామెంట్ల మధ్య.. నన్నర్థం చేసుకొనే స్నేహితుడు నరేందర్‌ని పెళ్లి చేసుకున్నాను. తల్లిని కావాలనీ ఆశపడ్డాను. కానీ నా ఆరోగ్యం అందుకు సహకరిస్తుందో లేదో అనే భయం ఉండేది నరేందర్‌కి. దాంతో ఆయన్ని కౌన్సెలింగ్‌కి తీసుకెళ్లాల్సి వచ్చింది!

ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ అయ్యే వరకు చాలా కాన్ఫిడెంట్‌గానే ఉన్నాను కానీ.. తర్వాతే చాలా ఒత్తిడి ఫీలయ్యాను. నాలాగే నా బిడ్డకూ వైకల్యం వస్తుందేమోననే భయం. పోలియో తప్ప జెనెటికల్‌గా నాకెలాంటి ప్రాబ్లం లేదు. అయినా టెస్ట్‌లు చేయించుకున్నాను. బ్యాక్ బోన్ పెయిన్ వల్ల ఒకసారి ఆర్థోపెడిక్ డాక్టర్ దగ్గరికీ వెళ్లాను. అప్పుడే నాకు సివియర్ స్కోలియోసిస్ ఉందని తేలింది. 150 డిగ్రీల వంపు తిరిగినట్లు ఉంటుంది నా బాడీ. దీనివల్ల నాకు ఒక లంగ్ చిన్నగా.. ఒక లంగ్ పెద్దగా, ఒక కిడ్నీ చిన్నగా.. ఒక కిడ్నీ పెద్దగా ఉంటుంది. అలాగే నా గర్భాశయంలో కూడా బిడ్డ ఒక సైడ్‌కు పెరుగుతోందని తెలిసింది.

ఎన్నో పరీక్షలను తట్టుకుని...

డీ హబ్‌ని డెవలప్ చేస్తున్న సమయంలోనే ప్రెగ్నెన్సీ రావడంతో ఫైనాన్సియల్‌గా కూడా స్ట్రగుల్ అయ్యాం. ఫ్యామిలీ సపోర్ట్ ఎక్కడా లేదు. ముందు జాగ్రత్తగా ఏడోనెలలోనే ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు డాక్టర్. ఆసుపత్రిలోంచే వర్క్ చేశాను డెలివరీ ముందు రోజు వరకు. లక్కీగా ఏ కాంప్లికేషన్స్ లేకుండా తొమ్మిదోనెల వరకు రాగలిగాను. సిజేరియన్ డెలివరీతో బాబు పుట్టాడు. కానీ జాండీస్‌తో ఐసీయూలో పెట్టారు. వాడు ఇంటికి రావడానికి 27 రోజులు పట్టింది. వచ్చాక అనిమియా .. వీక్లీ చెకప్ అన్నారు. అది జనరల్ కండిషన్‌నే అని తెలిసినా... తలసేమియానా? నా డిజేబిలిటీ వల్లే ఇలా అవుతోందేమో అనే భయం. ఆ మానసిక వేదనను మాటల్లో చెప్పలేను. అన్ని అవాంతరాలు దాటి బిడ్డ ఆరోగ్యంగా కేరింతలు కొడుతుంటే అన్నీ మరచిపోయాను. ఇప్పుడనిపిస్తుంటుంది.. నేనేనా అంతలా భయపడ్డది అని! నాకున్న కండిషన్‌లో మాతృత్వమనేది నిజంగానే నేను సాధించిన అతిపెద్ద అచీవ్‌మెంట్ అనిపిస్తుంది'' అంటూ తన విజయగాధను వివరించారు వసుంధర.

– శిరీష చల్లపల్లి



మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్‌షిప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం! ఈ వారం స్కీమ్ .. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎమ్).



పశు పోషణతో పారిశ్రామికవేత్తలుగా..



నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎమ్)

కేంద్ర ప్రభుత్వ పథకమైన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గొర్రెలు, మేకలు, పందులు, నాటుకోళ్ల పెంపకానికి 50 శాతం సబ్సిడీతో రుణ సదుపాయాన్ని అందిస్తోంది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో అన్ని సామాజిక వర్గాలూ దీన్ని పొందవచ్చు. అయితే ఈ లోన్ కోసం బ్యాంకులను సంప్రదించినప్పుడు ఎన్.ఎల్.ఎమ్. ద్వారా అందుతున్న ముందస్తు సబ్సిడీ అవకాశం గురించి సిబ్బందికి చెప్పాలి. సిబిల్ స్కోర్ కూడా బాగుండాలి. సొంత లేదా కనీసం అయిదేళ్ల లీజు కింద ఎకరం నుంచి అయిదు ఎకరాల వరకు భూమిని కలిగి ఉండాలి. నాటుకోళ్లు, పందుల పెంపకానికైతే ఎకరం భూమి సరిపోతుంది. గొర్రెలు, మేకలకు సంబంధించి అయితే.. 500 గొర్రెలకు గడ్డిసాగు, షెడ్డులాంటి వాటికోసం అయిదు ఎకరాల భూమి కావాలి. తగిన అర్హత ఉంటే ఒకే కుటుంబంలో ఎంతమందైనా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు.

దరఖాస్తుకు..

ఉద్యమ్ మిత్ర పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు, వ్యక్తిగత గుర్తింపు, చిరునామా వగైరాలన్నిటికీ రుజువుగా పాస్‌పోర్ట్ లేదా ఆధార్‌కార్డ్, పాన్ కార్డ్ వంటివి సమర్పించాలి. ఆదాయ రుజువు పత్రం, గడచిన రెండేళ్ల ఐటీఆర్, బ్యాంక్‌స్టేట్‌మెంట్, ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొటేషన్స్‌తోపాటు ఎక్కడైతే యూనిట్ పెట్టాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రాముఖ్యం, అక్కడ వ్యాపార అనుకూలతలు మొదలైన అంశాలతో పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్‌నూ సమర్పించాలి. పై వివరాలన్నిటిలో ఏ మాత్రం తప్పుల్లేకుండా చూసుకోవాలి. దరఖాస్తును, ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను పశుసంవర్ధక శాఖా సిబ్బంది పరిశీలించి, అప్రూవ్ చేసిన పత్రాన్ని సంబంధిత బ్యాంకుకు పంపిస్తారు. అప్పుడు బ్యాంకు ద్వారా రుణం పొంది, సొంతపెట్టుబడినీ కూడబెట్టుకోవాలి. సబ్సిడీకి కూడా అప్లయ్ చేసుకోవాలి. సబ్సిడీ పొందడానికి కొంత సమయం పడుతుంది. సబ్సిడీ పొందిన వెంటనే యూనిట్‌ను ప్రారంభించవచ్చు. ఈలోపు ఎక్కడైతే యూనిట్‌ను పెట్టాలనుకుంటారో అక్కడ గ్రాసాన్ని పెంచాలి. ప్రభుత్వం సూచించిన నమూనాలోనే షెడ్డును నిర్మించాలి. అందులోని పశువులకు పోషకాహారం, పశువైద్య సౌకర్యం వంటివీ చూసుకోవాలి.

ఇటు గ్రామీణ... అటు పట్టణప్రాంతాల్లో విజయవంతంగా ముందుకు సాగుతోందీ పథకం.



– బి.ఎస్. రత్న,
బిజినెస్ కన్సల్టెంట్, దలీప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ : ownership.sakshi@gmail.com

నిర్వహణ : సరస్వతి రమ



కేరెంటింగ్

మన మీద పవర్ ఇవ్వకూడదు

స్కూల్ ఫంక్షన్ నుంచి చిన్నబుచ్చుకుని ఇంటికొచ్చిన కూతురిని చూసి 'ఏమైంది?' అడిగింది అమ్మ.

'నా డ్రెస్ ఏం బాగో లేదట, ఇది నాకస్సలు సూటవలేదంది రీతూ' బాధగా చెప్పింది శ్రుతి.

అమ్మ చిన్నగా నవ్వుతూ ఫ్రిజ్‌లోంచి జామకాయ తీసి 'జామకాయ ఆరోగ్యానికి మంచిది' అంటూ కూతురికి ఇచ్చింది. అవునన్నట్టుగా తలాడించింది శ్రుతి. 'జామకాయ ఆరోగ్యానికి మంచిది అనేది నిజమా? ఒపీనియనా?' అడిగింది అమ్మ.

'నిజం' చెప్పింది శ్రుతి. 'జామకాయను మించిన పండులేదు..' అంటూ సాభిప్రాయంగా కూతురి వైపు చూసింది అమ్మ.

'అది నీ ఒపీనియన్' శ్రుతి.

'కదా.. అలాగే నీ డ్రెస్ బాగాలేదు, నీకు సూటవలేదు అనేది కూడా రీతూ ఒపీనియనే! నిజాలకు విలువివ్వాలి, అది నిజమో కాదో సమీక్షించుకోవాలి. ఒపీనియన్స్, కామెంట్స్‌కి ఫీలైపోయి ఎదుటివాళ్లకు మన మీద పవర్ ఇవ్వకూడదు' చెప్పింది అమ్మ.

అర్థమైనట్టుగా శ్రుతి ముఖంలో నవ్వు.

మీ పిల్లలు తమ తోటివాళ్ల దగ్గర్నుంచి ఇలాంటివి ఎదుర్కొన్నప్పుడు వాళ్లను ఓదార్చడానికి బదులు ఇలా నిజాలకు, అభిప్రాయాలకు మధ్య తేడాను గ్రహించేలా చేయాలి. దానివల్ల విమర్శలను పాజిటివ్‌గా తీసుకునే తత్వాన్ని అలవరచుకుంటారు. ప్రతికూల పరిస్థితులకు కుంగిపోకుండా వ్యక్తిత్వాన్ని దృఢంగా మలచుకుంటారు.

వెయ్యి కళ్ల పహారా



కనురెప్పే కాటేస్తే..?

'ఆ దుర్మార్గాన్ని గురించి చెప్పడానికి మాటలు రావు' అంటుంటాం.

అయితే అలాంటి పరిస్థితుల్లోనే మాట్లాడడం తప్పనిసరి. ఎందుకంటే 'మౌనం' 'పరువు భయం' మరిన్ని దుర్మార్గాలు జరిగేలా చేస్తాయి.

దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట ఉపాధ్యాయుల ద్వారా లైంగిక వేధింపులు, దాడులకు గురి అవుతున్న చిన్నారుల గురించిన వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బడి అనేది పిల్లలను భయపెట్టేలా ఉండకూడదు. బడి అనేది సురక్షిత ప్రదేశంగా ఉండేలా తగిన కార్యాచరణ ఉండాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

కామారెడ్డి జిల్లా స్కూళ్లలో లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనల్లో 15 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇటీవల నవోదయ విద్యాలయంలో విద్యార్థినులను వేధించిన కేసులో నలుగురు టీచర్లు, సిబ్బందిపై పోక్సో కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కొన్ని కేసుల్లో విషయాన్ని దాచిపెట్టిన పాఠశాల హెడ్మాస్టర్లు, ఇతరులపైనా కేసులు నమోదు చేశారు. స్కూళ్లలో లైంగిక వేధింపుల సంఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ సింధుశర్మ, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి స్రవంతి తదితరులు స్కూళ్లలో ఆడపిల్లలపై వేధింపులను నిరోధించేందుకు చర్యలు మొదలు పెట్టారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా స్కూళ్లు, ఆదర్శ పాఠశాలలన్నింటిలో 'చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్'గా మహిళా ఉపాధ్యాయురాలిని నియమించారు. మహిళా టీచర్లు లేని స్కూళ్లలో ఉపాధ్యాయుడిని నియమించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్/ప్రిన్సిపాల్ కూడా బాధ్యుడిగా ఉంటారు. వీరికి పోక్సో చట్టంపై ఓరియంటేషన్ ఇచ్చారు.

– ఎస్.వేణుగోపాల్‌చారి,
సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

అదే మా లక్ష్యం



చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలతో పాటు 'సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్స్ ఇన్ స్కూల్' కాన్సెప్ట్‌పై అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లలో వేధింపులు అనేవి లేకుండా చేయడమే లక్ష్యం.

– ఆశీష్ సంగ్వాన్,
జిల్లా కలెక్టర్, కామారెడ్డి

ఆడపిల్లలు ఇబ్బందులు పడకుండా...



చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌తో పాటు పాఠశాల హెడ్మాస్టర్లకు పోక్సో చట్టం, ఇతర అంశాలపై యునిసెఫ్ రిసోర్స్ పర్సన్లతో ఓరియంటేషన్ ఇప్పిస్తున్నాం. జిల్లాలో 1250 స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.

– ప్రమీల,
జిల్లా సంక్షేమ అధికారి, కామారెడ్డి

ఇంటిప్స్



- రోజూ వాడని వెండి వస్తువులు నల్లగారంగు మారుతుంటాయి. అలాంటప్పుడు వాటిని క్లీనింగ్ పౌడర్‌తో శుభ్రం చేసిన తర్వాత పచ్చిపాలతో కాని పాలు కలిపిన నీటితో కాని కడిగితే నలుపు వదులుతుంది. అలా కుదరనప్పుడు పాలలో ముంచిన క్లాత్‌తో తుడిచినా కూడా ఫలితం ఉంటుంది.
- లెదర్ చెప్పులు కాని షూస్ కాని కొత్తవాటిలా మెరవాలంటే ఉల్లిపాయ తొక్కలతో రుద్దాలి.

దావత్ చేసుకుందాం..

వంటిల్లు

తెలుగు రుచుల్లో తెలంగాణది ఒక ప్రత్యేకత. కడుపు నిండా తినాలనుకునేవారికి మనసు నిండా ప్రేమతో కొసరి కొసరి తినిపిస్తారు. అందుకే తెలంగాణా ఆతిథ్యానికి 'అదబ్ ఔర్ ఖాతిర్దానీ' అని పేరు. దావత్ కి పిలిస్తే తప్పకుండా వెళ్ళండి... బగారా రైస్, నాటు కోడి కూర, పచ్చిపులుసు, చేప వేపుడు, సర్వప్ప అస్సలు వదిలి పెట్టద్దు. దిల్‌ఫుల్‌గా దావత్ చెయ్యండి.

సర్వప్ప



కావల్సినవి: **బియ్యప్పిండి**–కప్పు; **తెల్ల నువ్వులు** – పావు కప్పు (వేడి నీళ్లలో నానబెట్టి, నీళ్ల వడకట్టి, పక్క నుంచాలి); **శనగపప్పు** – 3 టేబుల్ స్పూన్లు, **పల్లీలు** – 2 టేబుల్ స్పూన్లు (వేయించి, పొట్టు తీసి, పలుకులు చేయాలి); **పచ్చిమిర్చి** – 5 (తరగాలి); **పచ్చిమిర్చి ముద్ద** – అర టీ స్పూన్; **జీలకర్ర** – టీ స్పూన్; **వెల్లుల్లి** – 10 రెబ్బలు (తరగాలి); **ఉల్లి పాయ** – 1 (తరగాలి); **కొత్తిమీర తరుగు** – పావు కప్పు, **ఉల్లికాడలు** (సన్నగా తరిగినవి) – పావు కప్పు; **కారం** – పావు టీ స్పూన్; **కరివేపాకు** – 2 రెమ్మలు (సన్నగా తరగాలి); **ఉప్పు** – రుచికి తగినంత ; **నీళ్లు** – ముప్పావు కప్పు (తగినన్ని); **నూనె** – 3 టీ స్పూన్లు

తయారీ: ● నువ్వులను, శనగపప్పును విడివిడిగా గంట నానబెట్టి, వడకట్టాలి. ఉల్లి తరుగును కచ్చాపచ్చాగా దంచాలి. పెద్ద గిన్నెలో బియ్యప్పిండి, నువ్వులు, శనగపప్పు, పల్లీల పలుకులు, ఉప్పు, పచ్చిమిర్చి తరుగు–ముద్ద, కారం, వెల్లుల్లి, కరివేపాకు, కొత్తిమీర, ఉల్లి తరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. కొద్దిగా నీళ్లు వేసి, కలిపి గట్టి ముద్ద చేయాలి. ● మందపాటి గిన్నె (సర్వ) అడుగున నెయ్యి రాసి, పిండిని చిన్న చిన్న ముద్దలుగా తీసుకొని రొట్టెలా చేత్తో వెడల్పుగా వత్తి, సన్నని మంట మీద కాల్చాలి. (పిండిని రొట్టెలా చేసి, పెనం మీద నూనె వేసి రెండు వైపులా కాల్చుకోవచ్చు)

పచ్చి పులుసు



కావల్సినవి: **చింతపండు** – నిమ్మకాయ పరిమాణం (వేడి నీళ్లలో నానబెట్టి, గుజ్జు తీయాలి); **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – 3 కప్పులు; **పచ్చిమిర్చి** – 4; **జీలకర్ర** – టీ స్పూన్; **కొత్తిమీర** – టేబుల్‌స్పూన్; **పసుపు** – పావు టీ స్పూన్; **ఉల్లి పాయ** – 1; **ఎండుమిర్చి** – 2; **వెల్లుల్లి** – 4 రెబ్బలు; **నూనె** – 2 టేబుల్ స్పూన్లు; **కరివేపాకు** – రెమ్మ; **ధనియాల పొడి** – అర టీ స్పూన్.

తయారీ: ● చింతపండు గుజ్జులో నీళ్లు కలపాలి. ● రోట్లో పచ్చిమిర్చి, ఉప్పు, అర టీ స్పూన్ జీలకర్ర, కొత్తిమీర, పసుపు వేసి కచ్చాపచ్చాగా దంచాలి. ఈ మిశ్రమాన్ని చింతపండు రసంలో కలపాలి. ● స్టౌ మీద మూకుడు పెట్టి నూనె వేసి అందులో మిగిలిన జీలకర్ర, ఎండుమిర్చి, వెల్లుల్లి, కరివేపాకు, ధనియాల పొడి వేసి, వేయించి ఈ పోపు మిశ్రమాన్ని చింతపండు రసంలో కలపాలి. తీపి కావాలనుకున్న వారు టీ స్పూన్ పంచదార / బెల్లం కలుపుకోవచ్చు. ● ఉల్లిపాయ తరుగు పైన వేసి, అన్నంలోకి వడ్డించాలి.

చేప వేపుడు



కావల్సినవి: **చేప ముక్కలు** – 6; **కారం** – అర టీ స్పూన్; **మొక్కజొన్న పిండి** – టీ స్పూన్; **ఉప్పు** – తగినంత; **నిమ్మరసం** – అర టీ స్పూన్; **గుడ్డు** – 1; **నూనె** – తగినంత; **ధనియాల పొడి** – టీ స్పూన్; **గరం మసాలా** – అర టీ స్పూన్; **అల్లం–వెల్లుల్లి పేస్ట్** – టీ స్పూన్; **కొత్తి మీర** – టీ స్పూన్; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు (తగినంత).

తయారీ: ● గిన్నెలో చేప ముక్కలు వేసి కారం, మొక్కజొన్న పిండి, ఉప్పు, నిమ్మరసం, గుడ్డు, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం వేసి కలిపి అరగంట పక్క నుంచాలి. కడాయిలో నూనె వేసి అందులో చేప ముక్కలు వేసి, వేయించాలి. ● చేప ముక్కలు వేగిన తర్వాత కొత్తిమీర చల్లి దించాలి. ● గుండ్రంగా తరిగిన ఉల్లిపాయలను అలంకరించి చేప ముక్కలను అన్నంలోకి సైడ్ డిష్‌గా వడ్డించాలి. ఇవి స్నాక్స్‌గానూ బాగుంటాయి.

బగారా రైస్



కావల్సినవి: **బాస్మతి బియ్యం/బియ్యం** – 2 కప్పులు+ **ఉల్లిపాయలు** – 3 (సన్నగా నిలువుగా తరగాలి); **బిర్యానీ ఆకు** – 3; **పచ్చిమిర్చి** – 7 (సన్నగా తరగాలి); **కొత్తిమీర** – 2 టేబుల్ స్పూన్లు ; **పుదీనా ఆకులు** – గుప్పెడు; **అల్లం – వెల్లుల్లి పేస్ట్** – 2 టీ స్పూన్లు; **ఉప్పు** – తగినంత; **నెయ్యి / నూనె** – అర కప్పు; **నీళ్లు** – 5 కప్పులు; **లవంగాలు** – 10; **యాలకులు** – 7; **కరివేపాకు** – 2 రెమ్మలు

తయారీ: ● గిన్నెలో నూనె వేడి చేసి, ఉల్లి తరుగు గోధుమరంగు వచ్చేవరకు వేయించాలి. అందులో పచ్చిమిర్చి, లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు, కరివేపాకు, పుదీనా ఆకులు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి సన్నని మంట మీద పచ్చివాసన పోయేవరకు వేయించాలి. ● దీంట్లో బియ్యం వేసి 2 నిమిషాలు వేయించాలి. ● ఉప్పు కూడా వేసి మరో మారు కలిపి, 5 కప్పుల నీళ్లు పోసి ఉడికించాలి. చివరగా కొత్తిమీర, వేయించిన ఉల్లి తరుగు చల్లి దించాలి.

నోట్: పోపులో పచ్చిబఠాణీలు, మొక్కజొన్న గింజలు, బీన్స్ వేసి కూడా బగారా రైస్ చేసుకోవచ్చు. దీనిలోకి మాంసాహార వంటకాలే కాదు బంగాళదుంప కూర, గుత్తి వంకాయ కూర, పప్పు వంటి శాకాహార రుచులను కూడా వడ్డించవచ్చు.

నాటు కోడి కూర



కావల్సినవి: **నాటు కోడి ముక్కలు** – అరకేజీ; **పచ్చిమిర్చి** – 4, **టొమాటోలు** – 2(తరగాలి); **అల్లం–వెల్లుల్లి పేస్ట్** – 2 టీ స్పూన్లు; **గరం మసాలా** (లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, ధనియాలు) – 2 టీ స్పూన్లు; **ఉల్లి పాయలు** – 2, **ఎండుమిర్చి** – 2; **పసుపు** – అర టీ స్పూన్; **ఉప్పు** – తగినంత; **కారం** – టీ స్పూన్; **ఎండుకొబ్బరి** – 2 టీ స్పూన్లు; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు; **కొత్తిమీర తరుగు** – 2 టేబుల్ స్పూన్లు


తయారీ: ● నాటుకోడి ముక్కలలో కారం, పసుపు, ధనియాల పొడి, అల్లం- వెల్లుల్లి పేస్ట్ కలిపి పక్కనుంచాలి. ● మందపాటి గిన్నె/కుకర్‌లో నూనె వేడయ్యాక జీలకర్ర, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, పసుపు వేసి, కలపాలి. ● అల్లం–వెల్లుల్లి ముద్ద వేసి, వేగాక కలిపి ఉంచిన చికెన్ వేసి 10 నిమిషాలు ఉడికించాలి. టొమాటో వేసి మగ్గనివ్వాలి. 2 కప్పుల నీళ్లు పోసి, ఉప్పు, కారం, ఎండుకొబ్బరి వేసి మరో 15 నిమిషాలు ఉడికించాలి. కుకర్‌లో అయితే 3 విజిల్స్ వచ్చేవరకు ఉంచాలి. ● దించే ముందు సిద్ధం చేసుకున్న గరం మసాలా, కొత్తిమీర వేయాలి. రోటీలు, అన్నంలోకి ఈ కూరను వడ్డించాలి.

జపనీయుల దీర్ఘాయువు వెనక...

స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్తమైన జీవనశైలి, ఒత్తిడి, కాలుష్యం వంటి కారణాల వల్ల అనుకున్నంత కాలం జీవించలేకపోతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం జపాన్? ప్రజలు మాత్రం ప్రపంచంలోనే అత్యధిక ఆయుర్దాయంతో ఎక్కువకాలం పాటు జీవిస్తున్నారు. అందుకు కారణాలేమిటో తెలుసుకుందాం.. మనం కూడా వారిని అనుసరిద్దాం.



డబ్ల్యు. హెచ్. ఓ. అంచనాల మేరకు... జపాన్ ప్రజల సగటు ఆయుర్దాయం 83.7 సంవత్సరాలు (మహిళలకు 86.8 సంవత్సరాలు పురుషులకు 80.5 సంవత్సరాలు)గా ఉంది. జపాన్ ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, సంస్కృతి, జెనెటిక్స్? దీనికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.



ఇకిగై (సంతోషంతో జీవించడం): జపనీయులు 'ఇకిగై' అనే సిద్ధాంతంతో సంతోషంగా జీవిస్తారు. ఆనందంతో జీవించాలని ఈ పురాతన తత్వశాస్త్రం బోధిస్తుంది. అంతేకాక, ఎందుకు జీవిస్తున్నామనే దానిపై స్పష్టతతో జీవితానికి లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడం, ఇతరులకు సహాయం చేయడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో ప్రేమతో కలిసి ఉండటం వంటి అంశాలు వారి ఆయుష్షును పెంచుతాయి.

హరా హాచ్ బన్ మి. ఇది జపాన్‌లో ఒక సామెత. అంటే తగిన మోతాదులోనే ఆహారం తినాలని అర్థం. కడుపులో 80 శాతం నిండినంత వరకు మాత్రమే తింటే దీర్ఘాయువు కలిగి ఉంటామని జపనీయుల నమ్మకం. అంతేకాదు, పెద్ద పళ్లెంలో కాకుండా చిన్న చిన్న ప్లేట్లలో లేదా బౌల్స్‌లో నెమ్మదిగా తినడానికి ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి తింటారు. భోజనం చేసేటప్పుడు టీవీ, సెల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంటారు. కింద కూర్చునే తింటారు.

సమతుల ఆహారం: జపనీస్ ఆహారంలో పండ్లు, ఒమేగా ఫాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు, బియ్యం, తృణధాన్యాలు, టోఫు, సోయా, మిసో, ఆకుపచ్చ కూరగాయలు ఎక్కువగా తీసుకుంటారు. ఇవన్నీ తక్కువ కొవ్వులు, చక్కెరలను కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. తద్వారా కాన్సర్, గుండె జబ్బుల నుంచి బయట పడొచ్చు. ఈ ఆహారం కారణంగానే జపాన్‌లో ఊబకాయం రేటు చాలా తక్కువగా ఉందని చెప్పవచ్చు.

హెర్బల్ టీ: జపనీస్ ప్రజలు టీ తాగడాన్ని ఇష్టపడతారు. అది వారి సంస్కృతిలో భాగంగా భావిస్తారు. జపాన్ ద్వీప సమూహంలో మాచా టీ చాలా ప్రాచుర్యం పొందింది. టీ తయారీలో ఉపయోగించే టీ ఆకులు అధిక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు కాన్సర్‌తో పోరాడే శక్తినిస్తాయి.



కాలి నడకకు ప్రాధాన్యం: జపాన్ ప్రజలు ఒకేచోట కూర్చుని పని చేసే జీవన శైలిని అంతగా ఇష్టపడరు. యువకుల నుంచి వృద్ధుల వరకు అంతా నడవడానికే ఇష్టపడతారు. విద్యార్థులు, ఉద్యోగులు సమీపంలోని రైల్వే స్టేషన్‌కు నడవడం లేదా సైక్లింగ్? చేయడం వంటివి చేస్తుంటారు. ఇవన్నీ వారి ఆయుర్దాయం పెరగడానికి దోహదం చేస్తాయి.



జీన్స్: ఇవి వారు ధరించే జీన్స్ కాదు.. జపనీస్‌లో సహజసిద్ధంగా ఉండే జన్యువులు. ఇవే వారి ఆయుష్షును పెంచుతున్నాయి. టైప్ 2 డయాబెటిస్, స్ట్రోక్స్, గుండెపోటు, సెరెబ్రోవాస్కులర్, హృదయ సంబంధ వ్యాధులలను నిరోధించడానికి ఈ జన్యువులు సహాయపడతాయి.



వృద్ధుల సంరక్షణ: ఇతర దేశాలలా జపాన్ ప్రజలు వయసు పైబడిన తమ కుటుంబ సభ్యులను ఓల్డ్? ఏజ్?హోమ్‌లకు పంపించరు. కుటుంబ సభ్యుల సంరక్షణ బాధ్యతను చూసుకోవడం అక్కడి వారి సాంప్రదాయం. వృద్ధాప్యంలో కుటుంబంతో కలిసి జీవిస్తే మానసికంగా అనేక ప్రయోజనాలు కలుగుతాయని, సంతోషంగా జీవిస్తారని అక్కడి వారి నమ్మకం.

ఆరోగ్య సంరక్షణ: జపాన్‌లో అనారోగ్యాలను నివారించి, ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిచ్చే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఉంది. క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం మొత్తం ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

సామాజిక నిర్మాణం: బలమైన సామాజిక సంబంధాలు, సమాజ మద్దతు మెరుగైన మానసిక ఆరోగ్యానికి, ఒత్తిడి స్థాయిలను తగ్గించడానికి దారి తీస్తుంది. ఇవి దీర్ఘాయువుకు ముఖ్యమైనవి.

చూశారుగా... పైన చెప్పుకున్న వాటిలో ఒక్క జన్యుపరమైన కారణాలు తప్ప మిగతావన్నీ మనం సులువుగా అనుసరించదగ్గవే. వీలయిన వాటిని వీలయినంత వరకు అనుసరించి ఆయురారోగ్యాలతో హాయిగా ఉందాం. దీర్ఘాయుష్మాన్ భవ!

ఇక్కడ జిమ్‌లో చేరాలంటే నెలకు తొమ్మిది లక్షలు!



జిమ్‌లో చేరాలంటే నెలకు ఎంత కడతాం? మిగిలిన చోట్ల ఎంత ఉన్నా, న్యూయార్క్‌లోని గ్రీన్‌విచ్‌కి దగ్గరలోని ఒక గ్రామంలో కొంటినూమ్ అనే వెల్‌నెస్ సోషల్ క్లబ్‌లో జిమ్ చేయాలంటే అక్షరాలా 8000 పౌండ్లు కట్టాలి. గత ఏడాది ఏప్రిల్‌లో ఆరంభం అయిన ఈ జిమ్‌లో లగ్జరీ లాంజ్ ఉంది. సభ్యులకు ఫిట్‌నెస్ పెంచుకోవడం కోసం టాప్‌క్లాస్ జిమ్ తరగతులు జరుగుతుంటాయి. 25000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ వెల్‌నెస్ సెంటర్ 250 మంది సభ్యులకు మాత్రమే పరిమితం. చిత్రం ఏమిటంటే, కళ్లు తిరిగేటంత సభ్యత్వ రుసుము కండలు పిండి మరీ వసూలు చేస్తున్నా కూడా ఇక్కడ మెంబర్‌షిప్ తీసుకోవడం కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారి జాబితా చాలానే ఉందట.

ఇక్కడ చేరి శారీరక దృఢత్వాన్ని పెంచుకుంటున్న వారందరికోసం ఇంటి దగ్గర ఉండి మరీ కసరత్తులు చేసేందుకు ఆన్‌లైన్‌లో ప్రత్యేకమైన హోమ్ వర్క్ (వర్కవుట్లు చేయిస్తారట) కూడా ఇస్తారట. డబ్బు కట్టగానే ఇక్కడ సభ్యులకు పూర్తి వివరాలతో కూడిన 'ఆన్‌బోర్డింగ్ అసెస్‌మెంట్' ఉంటుంది. శరీరంలోని ప్రతి పార్ట్‌నూ స్కాన్ చేసి, ఉండవలసిన దానికన్నా హెచ్చుతగ్గులు ఏమైనా ఉంటే పరీక్షించి, వాటిని బ్యాలన్స్ చేసుకునేందుకు తగిన స్పెషల్ వర్కవుట్లు చేయిస్తారు. అంతేకాదు, శరీరంలో బ్లడ్ సర్క్యులేషన్ ఎలా ఉంది, ఆక్సిజన్ లెవెల్స్ ఎలా ఉన్నాయి, నిద్ర నాణ్యత ఎలా ఉంది... వంటి పరీక్షలన్నీ చేసి అందుకు తగ్గట్టు జిమ్ చేయిస్తారట. ఏమైనా.. పిండికొద్దీ రొట్టె అన్నట్టు మనం చెల్లించిన డబ్బుకు తగ్గట్టు వర్కవుట్లు చేయించి మన ఫిట్‌నెస్‌ను పరిరక్షిస్తారన్నమాట!



ఆత్మస్థైర్య సిద్ధి

ప్రతికూలతలను దూరం చేసి, మనసును ప్రశాంతంగా, ఆత్మస్థైర్యంతో మిమ్మల్ని మీరు కొత్తగా మలుచుకోవడానికి సహకరించే ఐదు ఆసనాలు...

- **తాడాసనం:** ఇది పర్వతాన్ని పోలి ఉంటుంది. అందుకే మౌంటెయిన్ పోజ్ అని కూడా అంటారు. చేతులను, కాళ్లను కదల్చకుండా స్థిరంగా, నిటారుగా నిల్చోవడం అలవాటవుతుంది.
- **బాలాసన:** చంటి పిల్లలు మోకాళ్లపై బోర్లాపడుకొని ఉన్న భంగిమ ఇది. ఈ ఆసనంలో మ్యాట్‌పైన మోకాళ్లపైన కూర్చుంటూ, ముందుకు వంగి, నుదుటిని నేలకు ఆనించాలి. తలమీదుగా రెండువైపులా చేతులను ముందుకు తీసుకుంటూ, అరచేతులను నేలమీద ఉంచాలి.
- **వీరభద్రాసన:** దీనిని వారియర్ పోజ్ అని కూడా అంటారు. నేలపైన నిల్చొని కుడి పాదాన్ని ముందుకు ఉంచాలి. రెండు చేతులను విశాలంగా భుజాలకు ఇరువైపులా చాపాలి.



యోగా

ఈ సమయంలో తల నిటారుగా ఉండాలి. దీర్ఘ శ్వాస తీసుకుంటూ వదలాలి. దీనివల్ల మిమ్మల్ని మీరు శక్తిమంతులుగా భావిస్తారు. ఆత్మగౌరవం, స్వీయ ప్రేమ మెరుగుపడుతుంది.

- **అధోముఖస్వానాసన:** మ్యాట్‌పైన బోర్లా పడుకొని, చేతులు, కాలివేళ్ల మీదుగా శరీరాన్ని ఉంచుతూ, హిప్ భాగాన్ని పైకి లేపాలి. దీనిని డాగ్ పోజ్ అని కూడా అంటారు. సాధన ప్రారంభంలో ఈ ఆసనం శరీరాన్ని వామప్ చేయడానికి ఉపయోగ పడుతుంది. ఇది భావోద్వేగ సమతుల్యతను పెంచుతుంది.
- **ఉష్ట్రాసన:** మ్యాట్‌పైన మోకాళ్లను నేలకు ఆనిస్తూ కూర్చొని, రెండు చేతులతో కాలి మడమలను పట్టుకుంటూ, వెన్నెముకను వంపుగా, తలను వెనక్కి వంచాలి. దీంతో పొత్తికడుపు స్ట్రెచ్ అవుతుంది. ఈ ఆసనం వల్ల మానసిక స్థైర్యం పెరుగుతుంది.

సాక్షి సినిమా


మాస్ యాక్షన్ షురూ


రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్ 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఓ సెట్‌లో నైట్ షూట్ జరుగుతోందని తెలిసింది. రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్‌ల కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట.

అలాగే ఈ సినిమాలో క్రికెట్, కుస్తీ గురించే కాకుండా... మరికొన్ని ఇతర స్పోర్ట్స్ గురించిన ప్రస్తావన కూడా ఉంటుందని తెలిసింది. ఇంకా ఈ షెడ్యూల్‌లోనే ఓ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌ను తీసేందుకు టీమ్ రెడీ అయిందని, 'జైలర్' ఫేమ్ కెవిన్ కుమార్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు కొరియోగ్రఫీ చేయనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌ల సమర్పణలో వద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

వీరమల్లు డేట్ చేంజ్


నిధీ అగర్వాల్, పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరి హర వీరమల్లు: పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రం విడుదల తేదీ మారింది. తొలుత ఈ సినిమాని ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించిన మేకర్స్... తాజాగా మే 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ''హరి హర వీరమల్లు' చిత్రంలో చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ సరికొత్తగా కనిపించనున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించడంతో పాటు ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి వీరమల్లు సిద్ధమవుతున్నాడు. ఈ చిత్రాన్ని మొదట ఈ నెల 28న విడుదల చేయాలనుకున్నాం. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నందున విడుదలను మే 9కి వాయిదా వేశాం. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమేరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్.

కోర్ట్‌తో నా కల నెరవేరింది



''కోర్ట్' సినిమాలో నేను చేసిన మంగపతి పాత్రకి అద్భుతమైన స్పందన వస్తోంది. ఇలాంటి బలమైన పాత్ర చేయాలన్న నా 25 ఏళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది'' అని నటుడు శివాజీ తెలిపారు. ప్రియదర్శి, శివాజీ, రోషన్, శ్రీదేవి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సినిమాలో మంగపతి పాత్ర పోషించిన శివాజీ విలేకరులతో మాట్లాడుతూ– ''నాకు నటనలో దాదాపు 12 ఏళ్ల విరామం వచ్చింది. నన్ను మళ్లీ నటించమని నా పిల్లలు కోరేవారు. నాకూ చేయాలని ఉండేది కానీ ఎవర్నీ అవకాశం అడగలేదు. సొంతంగా నేనే ఓ సినిమా నిర్మిద్దామనుకున్న సమయంలో '90స్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్ చేశాను. అది చేస్తున్నప్పుడు 'బిగ్ బాస్' అవకాశం వస్తే, చేశాను. ఆ షోతో నేనంటే ఏంటో ప్రపంచానికి తెలిసింది. వెబ్ సిరీస్ పెద్ద హిట్ కావడంతో దాదాపు ఎనభై కథలు విన్నాను. చాలావరకూ తండ్రి పాత్రలే కావడంతో తిరస్కరించాను. 'కోర్ట్'లో మంగపతి పాత్ర క్రెడిట్ డైరెక్టర్ రామ్‌దే. ఎస్వీ రంగారావు, గుమ్మడి, జగ్గయ్య, రాజనాలగార్లు మరపురాని పాత్రలు చేశారు. అలాంటి పాత్రలు చేయాలని నాకూ ఉండేది కానీ హీరోగా ఉండాలనే ఆలోచన ఎప్పుడూ లేదు. కొత్తవారిని ప్రోత్సహించడంలో నాని గొప్ప చొరవ చూపిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్, సురేష్ ప్రొడక్షన్, ఉషా కిరణ్ మూవీస్ వంటి బ్యానర్స్‌లా వాల్ పోస్టర్ సినిమా అవుతుంది. ఇక మంగపతి తరహాలో మెడికల్ షాప్ మూర్తి అనే ఓ క్యారెక్టర్ విన్నాను. ప్రస్తుతం నేను నిర్మాతగా, హీరోగా, లయ హీరోయిన్‌గా ఓ సినిమా చేస్తున్నా. అలాగే 'దండోరా' అనే మరో చిత్రంలో నటిస్తున్నాను'' అని తెలిపారు. ఇంకా రాజకీయాల గురించి మాట్లాడుతూ – ''నేను ఏ పార్టీకి సపోర్ట్‌గా ఉండలేదు... మాట్లాడలేదు. నేను ప్రజల కోసం నిలబడ్డాను. ప్రాంతం కోసం, భావితరాల కోసం పోరాటం చేశాను'' అని శివాజీ స్పష్టం చేశారు.

– శివాజీ

హోలీ స్పెషల్


'తెలుసు కదా' సంబరాలు

హోలీ సందర్భంగా హీరో సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా', హీరో సాయిదుర్గా తేజ్ 'సంబరాల యేటిగట్టు' సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ విడుదల చేశారు మేకర్స్.

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ చిత్రాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం హోలీ సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో సిద్ధు, రాశి, శ్రీనిధి కలిసి పండగను ఆనందంగా సెలబ్రేట్ చేసుకుంటూ కలర్‌ఫుల్‌గా కనిపించారు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: జ్ఞానశేఖర్ బాబా, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.


'సంబరాల యేటిగట్టు' సందడి

- సాయి దుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా మూవీ నిర్మిస్తున్నారు. హోలీని పురస్కరించుకుని న్యూ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. టీమ్ అంతా ఆనందంగా ఈ సెలబ్రేషన్‌లో పాల్గొన్నట్లు పోస్టర్ చూస్తే తెలుస్తోంది. ''యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ఎస్‌వైజీ. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక పాటను చిత్రీకరిస్తున్నాం. సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.

సందడే సందడి


తమన్నా

బాలీవుడ్ నటి రవీనా టాండన్ ఏర్పాటు చేసిన హోలీ సంబరాల్లో పలువురు సినీ ప్రముఖులు సందడి చేశారు. హోలీ శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో తేలిపోయారు. ఈ వేడుకలో హీరోయిన్ తమన్నా కూడా పాల్గొని, సందడి చేశారు. రవీనా టాండన్ కుమార్తె రాషా, తమన్నా క్లోజ్ ఫ్రెండ్స్ అని సమాచారం. రవీనా ఇంట్లో జరిగిన వేడుకల్లో తమన్నా పాల్గొనడానికి ఇదొక కారణం అట. అలాగే రాషా క్లోజ్ ఫ్రెండ్, నటుడు విజయ్ వర్మ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

ఊహకందని... ఊహించలేని ఇన్వెస్టిగేషన్ ఇది

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'రేఖా చిత్రం' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఇదో ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్. ఈ తరహా సినిమాలు ఇప్పటికే మనకు పరిచయమున్నా క్షణం కూడా మీ చూపును మరల్చకుండా చేస్తుంది ఈ సినిమా స్క్రీన్‌ప్లే. 'రేఖా చిత్రం' ఓ మలయాళ సినిమా. సోనీ లివ్, ఆహాలో తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా ఉంది. ఈ సినిమాకి దర్శకుడు జోఫిన్ టి చాకో. కథ రాము సునీల్ అందించారు. ప్రముఖ నటులు ఆసిఫ్ అలీ, అనస్వరా రాజన్ ప్రధాన తారాగణంగా నటించారు. సినిమా చూసే ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠతతో, ఊహకందని ట్విస్టులతో ఉత్రూతలూగిస్తుంది. అంతలా ఈ సినిమాలో ఏముందో కథలోకి వెళ్లి తెలుసుకుందాం. వివేక్ అనే పోలీస్ ఆఫీసర్‌కి మలక్కపరా అనే ప్రాంతంలో కొత్తగా పోస్టింగ్ వస్తుంది.



అప్పటిదాకా అది క్రైమ్ ఫ్రీ ఫారెస్ట్ ప్రాంతం. కానీ వివేక్ ఛార్జ్ తీసుకున్న వెంటనే ఓ ఆత్మహత్య జరుగుతుంది. ఆత్మహత్య చేసుకున్నది రాజేంద్రన్ అనే బిజినెస్ మేన్. అది కూడా ఓ సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకుంటాడు. సెల్ఫీ వీడియోలో తాను కూర్చుని ఉన్న ప్రదేశంలో కొన్నేళ్ల క్రితం ఓ శవాన్ని మరో కొంత మందితో కలిసి పాతి పెట్టానని, ఆ బాధ తనను వేధిస్తుందని ఆత్మహత్య చేసుకుంటాడు. వివేక్ వెంటనే ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టి ఆ ప్రాంతంలో తవ్వగా ఓ అస్థిపంజరం బయటపడుతుంది. అది ఓ అమ్మాయిదని ఫోరెన్సిక్ నివేదికలో తేలుతుంది. ఇప్పుడు వివేక్ చేతిలో రాజేంద్రన్ సెల్ఫీ వీడియో తప్ప ఈ అస్థిపంజరానికి సంబంధించిన ఎటువంటి సాక్ష్యాధారాలు లేవు. మరి... వివేక్ ఈ కేసు ఎలా పరిష్కరించాడో సినిమాలోనే చూడాలి. పైన చెప్పుకున్నట్టు సినిమా మొత్తం ఊహించని ట్విస్టులతో క్లైమాక్సులో ఊహకందని మలుపుతో మతి పోగొడుతుంది. పెద్దవాళ్లు మాత్రమే చూడదగ్గ ఈ సినిమా వీకెండ్‌కు మంచి కాలక్షేపం. వర్త్‌ఫుల్ వాచ్ ఫర్ థ్రిల్లింగ్.

– ఇంటూరు హరికృష్ణ

సాక్షి బిజినెస్

శనివారం
15-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
201	73
73,829	22,397

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,665	▲ 363
డోజోన్స్	41,346	▲ 533
ఎఫ్‌టీఎస్ఈ 100	8,632	▲ 90
డాక్స్	22,987	▲ 420
షాంఘై	3,420	▲ 61
నికాయ్	30,053	▲ 263

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.75	87.77
£	బ్రిటన్ పౌండ్		111.50	114.41
€	యూరో		93.68	96.37
¥	జపాన్ ఎన్ (100)		58.14	59.63
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.37	57.14
S$	సింగపూర్ డాలర్		62.84	67.48
SAR	సౌదీ రియాల్		22.30	23.86
UAE D	యూఏఈ దిర్హామ్		22.80	24.58
¥	చైనా యువాన్		11.13	12.95

పసిడి @ 3,000 డాలర్లు

చరిత్రలో తొలిసారి...


న్యూయార్క్: కొన్నేళ్లుగా నిరవధికంగా మెరుస్తున్న పసిడి తాజాగా సరికొత్త రికార్డ్ సృష్టించింది. అంతర్జాతీయ మార్కెట్లలో తొలిసారి ఔన్స్(31.1 గ్రాములు) 3,000 డాలర్ల మైలురాయిని అధిగమించింది. తద్వారా వారాంతాన సైతం బులియన్ మార్కెట్ కళకళలాడుతోంది. న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజీ(కామెక్స్)లో 3 శాతం బలపడి 3,001 డాలర్లకు చేరింది. ఒకానొక దశలో 3,017 డాలర్ల గరిష్టాన్ని కూడా తాకింది. ఈ ప్రభావం దేశీయంగా నేడు(శనివారం) ఆభరణ మార్కెట్లో ప్రతిఫలించనున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి తరతరాలుగా రక్షణాత్మక పెట్టుబడి సాధనంగా తళతళలాడుతున్న బంగారం మరోసారి ప్రపంచ అనిశ్చితులలో బలాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలియజేశాయి. గత 25ఏళ్లలో చూస్తే పసిడి 10 రెట్లు జంప్‌చేసింది. తద్వారా యూఎస్ స్టాక్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ ఎస్అండ్‌పీ-500ను సైతం మించి ర్యాలీ చేయడం గమనార్హం.

ర్యాలీ తీరిలా

గోల్డ్ ఔన్స్ ధర తొలుత 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం తదుపరి 1,000 డాలర్ల మార్క్‌ను అధిగమించింది. తదుపరి కరోనా మహమ్మారి కాలంలో 2,000 డాలర్ల మైలురాయిని తాకింది. తిరిగి 2023, 2024లలో పరుగందుకుంది. ప్రధానంగా వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు డాలర్లకు బదులుగా బంగారాన్ని భారీ స్థాయిలో కొనుగోలు చేస్తుండటం ధరల నిరంతర ర్యాలీకి దోహదపడుతున్నట్లు బులియన్ వర్గాలు తెలియజేశాయి. గతేడాది చివర్లో యూఎస్ ప్రెసిడెంట్‌గా ట్రంప్ ఎన్నికయ్యాక పసిడి మరింత దూకుడు చూపుతోంది. 2024లో 26 శాతం బలపడగా.. 2025లోనూ ఇప్పటివరకూ 14% పెరగడం విశేషం!

20 ట్రిలియన్ డాలర్లు

గత మూడేళ్లుగా పలు దేశాల కేంద్ర బ్యాంకులు పుత్తడిలో కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీంతో 2022, 2023, 2024లో 1,000 మెట్రిక్ టన్నులు చొప్పున సొంతం చేసుకున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా పసిడి మార్కెట్ విలువ 20.2 ట్రిలియన్ డాలర్లను తాకగా.. గత 13 నెలల్లోనే 7 ట్రిలియన్ డాలర్ల విలువ జత కలిసింది. యూఎస్ లిస్టెడ్ టాప్-10 దిగ్గజాలు యాపిల్, ఎన్‌విడియా, మైక్రోసాఫ్ట్, మెటా తదితరాల మార్కెట్ విలువసహా.. బిట్‌కాయిన్, సిల్వర్‌ను సైతం పరిగణిస్తే మొత్తం విలువ 19.6 ట్రిలియన్ డాలర్లు మాత్రమే!



ఇండస్‌ఇండ్‌లో అవకతవకలపై ఐసీఏఐ సమీక్ష



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఆర్థిక అవకతవకలపై ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లను సమీక్షించే అవకాశం ఉన్నట్లు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రెసిడెంట్ చరణ్‌జోత్ సింగ్ నందా తెలిపారు. ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డ్ (ఎఫ్ఆర్ఆర్‌బీ) దీన్ని చేపట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల మేర వ్యత్యాసాన్ని గుర్తించినట్లు బ్యాంక్ ఇటీవల ప్రకటించడం దుమారం రేపిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఇండస్‌ఇండ్ వ్యవహారంపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కూడా ప్రాథమిక విచారణ ప్రారంభించే అవకాశం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

15-3-2025	
విశాఖ	400-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

డిజిటల్ జోరు..!

- ప్రకటనల్లో సాంప్రదాయ మాధ్యమాలను దాటి ముందుకు
- అడ్వర్టైజింగ్ బడ్జెట్లలో సింహభాగం
- టాప్‌లో సోషల్ మీడియా, ఆన్‌లైన్ వీడియోలు, పెయిడ్ సెర్చ్‌లు

కొన్నాళ్ల క్రితం వరకు ప్రకటనలంటే పత్రికలు, టీవీలు, రేడియోల్లాంటి సాంప్రదాయ మాధ్యమాలకే పరిమితమయ్యేవి. ఇంటర్నెట్ వాడకం పెరిగిన తర్వాత నెమ్మదిగా డిజిటల్ వైపు మళ్లడం మొదలైంది. ఇక అందరి చేతుల్లోకి స్మార్ట్‌ఫోన్లు వచ్చేస్తుండటం, డేటా చౌకగా లభిస్తుండటంలాంటి అంశాల కారణంగా ఇది మరింతగా జోరందుకుంది. ఎంతలా అంటే.. అడ్వర్టైజింగ్ సంస్థలు తమ బడ్జెట్‌లో దాదాపు సగభాగాన్ని డిజిటల్‌కే కేటాయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆఖరు నాటికి దేశీయంగా డిజిటల్ అడ్వర్టైజింగ్ విభాగం, సాంప్రదాయ మాధ్యమాలకు మించి ఏకంగా రూ. 62 వేల కోట్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

- సాక్షి, బిజినెస్‌డెస్క్

అడ్వర్టైజింగ్ పరిశ్రమలో డిజిటల్ మీడియా చాలా వేగంగా ప్రాచుర్యంలోకి వచ్చేసింది. నగరాలు మొదలుకుని గ్రామాల వరకు ఇది అసాధారణ స్థాయిలో విస్తరిస్తోంది. దీంతో డిజిటల్ యూజర్ల దృష్టిని ఆకట్టుకునేందుకు కంపెనీలు ఒకదానితో మరొకటి పోటీపడుతున్నాయి. సాంప్రదాయ మీడియాని మించి డిజిటల్‌పై భారీగా వెచ్చిస్తున్నాయి. అంతర్జాతీయ అడ్వర్టైజింగ్ దిగ్గజం డెంట్సు నివేదిక ప్రకారం.. దేశీఅడ్వర్టైజింగ్ పరిశ్రమ ప్రస్తుతం రూ. 93,166 కోట్లుగా ఉంది. 2025 ఆఖరు నాటికి ఇది సుమారు మరో 10 శాతం పెరిగి రూ. 1,12,453 కోట్లకు చేరుతుందని అంచనా. 2022లో రూ. 40,685 కోట్లుగా ఉన్న డిజిటల్ విభాగం ఈ ఏడాది ఆఖరుకల్లా రూ. 62,045 కోట్లకు.. అంటే మొత్తం అడ్వర్టైజింగ్ బడ్జెట్లలో సగానికి పైగానే వాటా దక్కించుకునే అవకాశం ఉంది. గతేడాది విషయం తీసుకుంటే 44 శాతం వాటాతో డిజిటల్ అగ్రస్థానంలో ఉండగా, టీవీ 32 శాతం, ప్రింట్ మీడియా 20% వాటాతో తర్వాత స్థానాల్లో నిల్చాయి. ఏఐలాంటి టెక్నాలజీ ఊతంతో టార్గెట్ ఆడియన్స్‌ను సరిగ్గా చేరుకునే వెసులుబాటు ఉండటం డిజిటల్‌కి సానుకూలాంశంగా ఉంటోంది.

టెలికం అత్యధిక కేటాయింపులు..

టెలికం రంగ సంస్థలు తమ మీడియా బడ్జెట్లలో 64 శాతం భాగాన్ని డిజిటల్‌కి కేటాయిస్తున్నాయి. ఎఫ్ఎంసీజీ సెగ్మెంట్ తమ బడ్జెట్లలో 94 శాతం భాగాన్ని డిజిటల్, టీవీ మాధ్యమాలకు కేటాయిస్తోంది. సాంప్రదాయ అడ్వర్టైజర్లే కాకుండా, డైరెక్ట్ టు కన్జూమర్ బ్రాండ్లు, స్టార్టప్‌లు మొదలైనవి ఎక్కువగా ఆన్‌లైన్ ప్రకటనలపైనే దృష్టి పెడుతున్నాయి. క్విక్-కామర్స్, ఈ-కామర్స్, విద్యా రంగ సంస్థల్లాంటివి మరింతగా కస్టమర్లకు చేరువయ్యేందుకు డిజిటల్ మాధ్యమాల మీదే ఆధారపడుతున్నాయి. షార్ట్ వీడియోలు, సోషల్ కామర్స్‌లపై ఇన్వెస్ట్ చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల డిజిటల్ బడ్జెట్లూ ఎక్కువగానే ఉంటున్నాయి. దేశీయంగా డిజిటల్ విప్లవం ప్రజల జీవితాలు, పరిశ్రమలు, సమాజంలో పెను మార్పులు తీసుకొస్తోందని, కృత్రిమ మేథ కూడా ఇందుకు దోహదపడుతోందని డెంట్సు దక్షిణాసియా సీఈవో హర్ష రజ్దాన్ చెప్పారు. టెక్నాలజీ ఎంత పెరిగినా మానవీయ కోణానికి కూడా ప్రాధాన్యతనివ్వాలని, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువలకు పెద్ద పీట వేస్తూ పరిశ్రమ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సోషల్ మీడియా హవా...

డిజిటల్ మీడియా కేటగిరీలో చూస్తే 30% వాటాతో (రూ. 11,962 కోట్లు) సోషల్ మీడియా అగ్రస్థానంలో ఉండగా, ఆన్‌లైన్ వీడియోలు 29%, పెయిడ్ సెర్చ్ 23% వాటా దక్కించుకున్నాయి. టెలికం కంపెనీలు తమ డిజిటల్ మీడియా బడ్జెట్లో 80% భాగాన్ని ఆన్‌లైన్ వీడియో, సోషల్ మీడియా, పెయిడ్ సెర్చ్‌లకు కేటాయిస్తున్నాయి. ఈ-కామర్స్ కంపెనీలైతే తమ మొత్తం మీడియా బడ్జెట్లో 61 శాతాన్ని డిజిటల్ మీడియాకు కేటాయిస్తున్నాయి.



డిజిటల్ అడ్వర్టైజింగ్ 2022లో	రూ.40,685 కోట్లు
రూ.62,045 కోట్లు	2025లో చేరుతుందని అంచనా
టెలికం రంగం మీడియా బడ్జెట్‌లో డిజిటల్‌కే	64 శాతం
తర్వాత స్థానాల్లో ఈ-కామర్స్, ఫార్మా కేటగిరీలు	తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల కేటాయింపులూ ఎక్కువే

తెలుగు రాష్ట్రాల్లోనూ అదే తీరు..

తెలుగు రాష్ట్రాల్లోనూ డిజిటల్, సోషల్ మీడియా ప్రకటనలు జోరుగానే ఉంటున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు వీటికి భారీగానే బడ్జెట్లు కేటాయిస్తున్నాయి. రాజకీయేతర డిజిటల్ ప్రకటనల వ్యయాలపై నిర్దిష్ట డేటా లేకపోయినప్పటికీ గత కొన్నాళ్లుగా, చాలా వేగంగా వృద్ధి చెందుతోందని ఓటీఎస్ అడ్వర్టైజింగ్ అకౌంట్ డైరెక్టర్ సాయి సిద్ధార్థ్ నల్లూరి తెలిపారు. దక్షిణాదివ్యాప్తంగా 2020 నాటి నుంచి గణాంకాలు చూస్తే డిజిటల్ అడ్వర్టైజింగ్ 30 శాతం వృద్ధి రేటు కనపర్చిందని చెప్పారు. విద్య తదితర రంగాలు డిజిటల్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయని, ఈ సేవల కోసం స్పెషలైజ్డ్ ఏజెన్సీలు కూడా వచ్చాయని పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత సాంప్రదాయ మీడియాపై ప్రకటనల వ్యయాలు తగ్గాయని వివరించారు.

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు బుమ్రా దూరం

న్యూఢిల్లీ: భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సీజన్ ఐపీఎల్ ఆరంభం నుంచి ముంబై ఇండియన్స్‌కు అందుబాటులో ఉండటం లేదని ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. వెన్నుగాయం కారణంగా జనవరి నుంచి ఆటకు దూరమైన స్టార్ పేసర్ భారత్ గెలిచిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడలేకపోయాడు. తాజాగా లీగ్‌కు దూరమయ్యే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ అభిమానులకు కాస్త ఊరటనిచ్చే కబురు బయటికొచ్చింది. స్పష్టంగా ఏ రోజు నుంచి, ఏ మ్యాచ్‌కు అతను ఆడేది వెల్లడించనప్పటికీ ఏప్రిల్ రెండో వారంలో బుమ్రా ముంబై ఇండియన్స్ జట్టుతో కలిసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల చివరి వారం, వచ్చే నెల మొదటి వారం రోజుల్లో జరిగే ముంబై ఇండియన్స్ ఆరంభ మ్యాచ్‌లకు బుమ్రా గైర్హాజరు కానున్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస శిబిరంలో ఉన్న పేసర్ వెన్నుగాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడు.

'క్యాపిటల్స్' కెప్టెన్‌గా అక్షర్ పటేల్

కొత్త సారథిని ప్రకటించిన ఢిల్లీ యాజమాన్యం



న్యూఢిల్లీ: ఐపీఎల్-2025లో అందరికంటే చివరగా ఢిల్లీ క్యాపిటల్స్ తమ సారథి పేరును వెల్లడించింది. టీమ్‌లో అందరికంటే సీనియర్ ఆటగాడైన ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఢిల్లీ టీమ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కొత్త సీజన్ కోసం అక్షర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు టీమ్ యజమానులు గ్రంధి కిరణ్ కుమార్, పార్థ్ జిందాల్ ప్రకటించారు. 2019 నుంచి అక్షర్ ఢిల్లీ టీమ్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఈ ఏడాది వేలానికి ముందు ఆ టీమ్ అట్టి పెట్టుకున్న ఆటగాళ్లలో అతనూ ఒకడు. రూ.16 కోట్ల 50 లక్షలకు అక్షర్‌ను ఢిల్లీ తమతో కొనసాగించింది. ఇప్పుడు కెప్టెన్సీతో అతనిపై పెద్ద బాధ్యతను ఉంచింది. దీంతో ఈ ఏడాది మొత్తం 10 జట్లలో ఐదు టీమ్‌లు కొత్త కెప్టెన్‌లతో బరిలోకి దిగుతున్నాయి. సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ మినహా మిగతా 9 జట్లకు భారత ప్లేయర్లే సారథ్యం వహిస్తుండటం విశేషం. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్సీ విషయంలో కేఎల్ రాహుల్ పేరుపై కూడా చర్చ జరిగినా... అతను వెనక్కి తగ్గినట్లు సమాచారం. 'క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇన్నేళ్లుగా ఇదే జట్టు తరఫున నేను క్రికెటర్‌గా ఎంతో ఎదిగాను. సమర్థులైన ఆటగాళ్లతో కూడిన ఈ టీమ్‌కు మంచి ఫలితాలు అందించగలనని నమ్మకంగా ఉన్నా' అని అక్షర్ పటేల్ స్పందించాడు.

ఒక్కో మెట్టే ఎదుగుతూ...

ప్రస్తుతం భారత క్రికెట్ జట్టులో అత్యంత నిలకడ ప్రదర్శిస్తున్న ఆటగాళ్లలో ఒకడిగా అక్షర్ పటేల్ గుర్తింపు తెచ్చుకున్నాడు. గత ఏడాది టి20 వరల్డ్ కప్, ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో అతను కీలక పాత్ర పోషించాడు. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో రాణిస్తుండటంతో ఆల్‌రౌండర్‌గా అతని విలువ మరింత పెరిగింది. ఐపీఎల్‌లో 2014 నుంచి ఐదు సీజన్ల పాటు అక్షర్ పంజాబ్ జట్టు సభ్యుడిగా ఉన్నాడు. ఆ తర్వాత 2019-2024 మధ్య ఆరు సీజన్లలో కలిపి ఢిల్లీ తరఫున 82 మ్యాచ్‌లు ఆడిన అక్షర్ ప్రస్తుత టీమ్‌లో అందరికంటే ఎక్కువ మ్యాచ్‌లలో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 150 మ్యాచ్‌లు ఆడి 1653 పరుగులు చేయడంతో పాటు 123 వికెట్లు తీసిన రికార్డు అతని సొంతం. సీనియర్ స్థాయిలో కెప్టెన్‌గా అక్షర్‌కు పెద్దగా అనుభవం లేదు. దేశవాళీలో వన్డేలు, టి20లు కలిపి గుజరాత్ జట్టుకు అతను 23 మ్యాచ్‌లలో సారథ్యం వహించాడు. అయితే గత ఏడాది ఐపీఎల్ చివరి లీగ్ మ్యాచ్‌లో అతను ఢిల్లీకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. స్లో ఓవర్‌రేట్ సమస్యతో రిషభ్ పంత్‌పై నిషేధం పడటంతో అక్షర్ సారథిగా నిలబడాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో భారత జట్టు వైస్ కెప్టెన్‌గా కూడా అక్షర్ వ్యవహరించాడు.


రాత మారేనా...

ఐపీఎల్ ఆరంభమైనప్పుడు ఉన్న ఎనిమిది జట్లలో చూస్తే ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ నెగ్గని మూడు టీమ్‌లలో బెంగళూరు, పంజాబ్‌లతో పాటు ఢిల్లీ కూడా ఉంది. 2020లో ఫైనల్‌కు చేరడం క్యాపిటల్స్ అత్యుత్తమ ప్రదర్శన. తుది పోరులో ముంబై చేతిలో ఓడి రన్నరప్‌గా ముగించింది. లీగ్ తొలి రెండు సీజన్లలో సెమీఫైనల్ చేరిన ఢిల్లీ జట్టు ప్రమాణాలు ఒక్కసారిగా పడిపోయాయి. ఎన్ని మార్పులు, ఎన్ని ప్రయోగాలు చేసినా ఆ జట్టు రాత మారలేదు. 2010-2024 మధ్య 15 సీజన్లలో ఒకసారి ఫైనల్ చేరిన జట్టు మరో మూడుసార్లు 'ప్లే ఆఫ్స్' వరకు వెళ్లగలిగింది. మిగతా 11 సార్లు లీగ్ దశకే పరిమితమైంది. కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, మిచెల్ స్టార్క్, డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్, ట్రిస్టన్ స్టబ్స్, మోహిత్ శర్మ, నటరాజన్ ప్రస్తుత టీమ్‌లో కీలక ఆటగాళ్లు. 2025 సీజన్ కోసం ఢిల్లీ సహాయక సిబ్బందిలో కూడా పలు మార్పులు చేసి బరిలోకి దిగుతోంది. హేమంగ్ బదాని (హెడ్ కోచ్), ఆంధ్ర మాజీ క్రికెటర్ వేణుగోపాలరావు (డైరెక్టర్), మాథ్యూ మాట్ (అసిస్టెంట్ కోచ్), మునాఫ్ పటేల్ (బౌలింగ్ కోచ్), కెవిన్ పీటర్సన్ (మెంటార్)లు జట్టు బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ కొత్త బృందంతో కలిసి కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ఎలాంటి ఫలితాలు రాబడతాడనేది ఆసక్తికరం.

2025 సీజన్‌లో ఐపీఎల్ జట్ల కెప్టెన్లు

ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా
చెన్నై సూపర్ కింగ్స్: రుతురాజ్ గైక్వాడ్
కోల్‌కతా నైట్‌రైడర్స్: అజింక్య రహానే
రాజస్తాన్ రాయల్స్: సంజూ సామ్సన్
గుజరాత్ టైటాన్స్: శుబ్‌మన్ గిల్
పంజాబ్ కింగ్స్: శ్రేయస్ అయ్యర్
లక్నో సూపర్ జెయింట్స్: రిషభ్ పంత్
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్
ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ పటేల్
సన్‌రైజర్స్ హైదరాబాద్: ప్యాట్ కమిన్స్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో హర్మన్‌ప్రీత్, మెగ్ లానింగ్

ఢిల్లీ ఈ సారైనా సాధించేనా!

నేడు డబ్ల్యూపీఎల్ ఫైనల్

- ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో 17 సీజన్ల పాటు ఆడినా ఢిల్లీ జట్టు టైటిల్ గెలవలేకపోయింది. అదే యాజమాన్యానికి చెందిన మహిళల జట్టు ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో వరుసగా రెండు సీజన్ల పాటు నిరాశపర్చింది. 2023, 2024 సీజన్లలో గ్రూప్ దశలో టాపర్‌గా నిలవడంతో ఫైనల్‌కు చేరిన క్యాపిటల్స్ రెండుసార్లూ ఫైనల్ మ్యాచ్‌లలో ఓడి రన్నరప్‌గానే సంతృప్తి చెందాల్సి వచ్చింది. ఇప్పుడు తాజా సీజన్‌లో కూడా టాపర్‌గా ఫైనల్ చేరిన టీమ్ మరోసారి ట్రోఫీ కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. నేడు జరిగే ఫైనల్లో 2023 చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడుతుంది. తాజా సీజన్ లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ ఢిల్లీనే నెగ్గి 2-0తో ఆధిక్యం ఉంది.

అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆల్‌టైమ్ గ్రేట్ కెప్టెన్‌గా ఉన్న మెగ్ లానింగ్ గత ఏడాది ఢిల్లీకి టైటిల్ అందించడంలో విఫలమైంది. ఈసారి అది పునరావృతం కాకుండా సత్తా చాటాలని ఆమె పట్టుదలగా ఉంది. సీజన్‌లో ఏకంగా 157.89 స్ట్రయిక్ రేట్‌తో 300 పరుగులు చేసిన షఫాలీ వర్మ మరోసారి టీమ్‌కు కీలకం కానుంది. మెగ్ లానింగ్ కూడా 263 పరుగులతో టీమ్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషించింది. జెమీమా రోడ్రిగ్స్ మాత్రం ఆశించినంత మెరుగైన ప్రదర్శన ఇవ్వలేదు. ఫైనల్లోనైనా ఆమె రాణించాల్సి ఉంది. ఆల్‌రౌండర్‌గా జెస్ జొనాసెన్ టోర్నీలో చక్కటి ప్రదర్శన కనబర్చింది. 137 పరుగులతో పాటు 11 వికెట్లు తీసిన ఆమెకు శిఖా పాండే (11) అండగా నిలిచింది. వీరిద్దరితో పాటు అనాబెల్ సదర్లాండ్ తమ బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగలరు.

దూకుడైన బ్యాటింగే ముంబై ప్రధాన బలం. నాట్ సివర్ 156.50 స్ట్రయిక్‌రేట్‌తో 5 అర్ధసెంచరీలు సహా 493 పరుగులు సాధించి అగ్ర స్థానంలో ఉంది. హేలీ మాథ్యూస్ (304) కూడా దూకుడైన ఆటకు మారు పేరు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా 156.29 స్ట్రయిక్ రేట్‌తో 236 పరుగులు చేసి తన వంతు పాత్ర పోషించింది. బౌలింగ్‌లో హేలీ, అమెలియా కెర్ కలిసి 33 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. సమష్టిగా సత్తా చాటడంతో ముంబై జట్టుదే పైచేయి. ఈ నేపథ్యంలో అంతిమ విజేత ఎవరు అవుతారనేది చూడాలి.

వరుసగా 24వ ఏడాది టైటిల్ లేకుండానే...

- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముగిసిన భారత్ పోరు
- క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన లక్ష్య సేన్, గాయత్రి-ట్రిసా జోడీ

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి వరుసగా 24వ ఏడాది భారత క్రీడాకారులు టైటిల్ లేకుండానే తిరిగి రానున్నారు. భారత్ నుంచి ఐదు విభాగాల్లో కలిపి మొత్తం 17 మంది క్రీడాకారులు ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగగా... ఒక్కరు కూడా క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయారు. సంచలన విజయాలతో ఆశలు రేకెత్తించిన లక్ష్య సేన్, పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 10-21, 16-21తో ఆరో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను ఓడించిన లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లో అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు.



గాయత్రి, ట్రిసా

మహిళల డబుల్స్‌లో 2022, 2023లలో సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) జోడీ ఈసారి క్వార్టర్ ఫైనల్లో 14-21, 10-21తో రెండో సీడ్ లియు షెంగ్‌షు-టాన్ నింగ్ (చైనా) జంట చేతిలో ఓడింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రిసా జోడీ 15-21, 21-18, 21-18తో ఎనిమిదో సీడ్ కిమ్ హై జియోంగ్-కాంగ్ హీ యోంగ్ (కొరియా) జంటను ఓడించిది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన లక్ష్య సేన్‌కు 7,975 డాలర్లు (రూ. 6 లక్షల 93 వేలు)... గాయత్రి-ట్రిసాలకు 9,062 డాలర్లు (రూ. 7 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

2 గతంలో భారత్ నుంచి ప్రకాశ్ పదుకొనే (1980లో), పుల్లెల గోపీచంద్ (2001లో) మాత్రమే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో టైటిల్స్ సాధించారు. 2015లో సైనా నెహ్వాల్, 2022లో లక్ష్య సేన్ ఫైనల్ చేరుకున్నా రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు.



మాదక ద్రవ్యాల అక్రమ రవాణా

దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులు 2022లో 1,02,769 నమోదుకాగా, 2023లో 1,09,546, 2024లో 89,913 నమోదయ్యాయి. ఈ మూడేళ్లలో మొత్తం కేసుల్లో శిక్షలు పడినవారు కేవలం 268. ఏపీలో 2023లో 1,749 నమోదైతే 2024లో 1,869 కేసులు నమోదయ్యాయి. కేరళలో అత్యధికంగా రికార్డు స్థాయిలో 2023లో 30వేలకుపైగా కేసులు నమోదు కాగా.. 2024లో 27,700 నమోదయ్యాయి.

రాష్ట్రం	2024లో కేసులు
కేరళ	27,701
పంజాబ్	9,025
మహారాష్ట్ర	7,536
యూపీ	6,204
రాజస్థాన్	5,462
మధ్యప్రదేశ్	4,351
ఒడిశా	3,187
హర్యానా	3,062
తెలంగాణ	2,387

ఆధారం : నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో

ఇది అనవసరపు నష్టం..

రైతులు ఆరుగాలం కష్టించి పండిస్తున్న పండ్లు, కూరగాయలను తోటలో కోసినప్పటి నుంచి మన నోటికి చేరేసరికే సగటున 25–30% వరకు పాడైపోతున్నాయి. సరైన రవాణా, నిల్వ సదుపాయాలు లేకపోవడమే దీనికి కారణం. దీనివల్ల జరుగుతున్న నష్టం ఏటా రూ.1,52,790 కోట్లు అని అంచనా.

ఇది అమృతం లాంటి పరిష్కారం..

కూరగాయలు, పండ్లు, పూలను సాధారణ వాతావరణంలోనే 30 రోజులపాటు చెక్కు చెదరకుండా నిల్వ ఉంచే అద్భుత ఆవిష్కరణ అందుబాటులోకి వచ్చింది. మైసూరుకు చెందిన ఓ విశ్రాంత శాస్త్రవేత్త ఈమేరకు ప్రత్యేకమైన కవర్లను రూపొందించారు. పర్యావరణ హిత పదార్థాలతో ఈ 'మోడిఫైడ్ ఎట్మాస్ఫియర్ ప్యాకేజింగ్ (మాప్)' కవర్ల తయారీ సాంకేతికతను ఆవిష్కరించటం విశేషం. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ (ఐఐహెచ్ఆర్) ద్వారా ఈ సాంకేతికత త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.

అమృత కవచం!

కూరగాయలు, పండ్లు, పూల నిల్వ కోసం 'కృషి కవచ్'!

- ఇందులో పెడితే 30 రోజుల పాటు దెబ్బతినవు
- రైతులతోపాటు వినియోగదారులు, వ్యాపారులకూ ప్రయోజనం
- ఉద్యాన ఉత్పత్తుల వృథాకు చెల్లు చీటీ
- రక్షణశాఖ విశ్రాంత శాస్త్రవేత్త రామకృష్ణ ఆవిష్కరణ



(సాక్షి స్పెషల్ డెస్క్):

రక్షణశాఖలో ఆహార శాస్త్రవేత్తగా 34 ఏళ్లు పనిచేసి రిటైరైన డాక్టర్ ఎ.రామకృష్ణ ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు, వ్యాపారులతోపాటు వినియోగదారులకు మేలు కలిగించే అద్భుత ఆవిష్కరణను వెలువరించారు. భారతీయ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)కు అనుబంధంగా కర్ణాటకలోని మైసూర్‌లో ఉన్న రక్షణ ఆహార పరిశోధన ప్రయోగశాల (డీఎఫ్ఆర్ఎల్)లోని ఫుడ్ ఇంజనీరింగ్ అండ్ ప్యాకేజింగ్ విభాగంలో ఆయన సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేసి రిటైర్ అయ్యారు. మూడేళ్లుగా సొంతంగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో పండ్లు, కూరగాయలు, పూలు ఎక్కువకాలం దెబ్బతినకుండా ఉండేలా, పూర్తిగా ప్రజలకు ఉపయోగపడేందుకు దోహదపడేలా వినూత్న ప్యాకేజింగ్‌తో 'కృషి కవచ్'కవర్లను అభివృద్ధి చేశారు.

పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో..

పోలియాక్టిక్ యాసిడ్, చెరుకు పిప్పి వంటి స్థానికంగా చవకగా లభించే సేంద్రియ పదార్థాలను ఉపయోగించి కృషి కవచ్ కవర్లను రూపొందించినట్టు రామకృష్ణ వెల్లడించారు. ''కూరగాయలు, పండ్లు, పూలను కృషి కవచ్ కవర్లలో ఉంచితే చాలు. రిఫ్రిజిరేషన్ అవసరం లేదు. సాధారణ గది వాతావరణంలో ఉంచినా.. నెల రోజుల వరకు బాగుంటాయి. వడలిపోవు. కుళ్లిపోవు. అర కిలో నుంచి వంద కిలోల వరకు అవసరం మేరకు కృషి కవర్లను తయారు చేసుకోవచ్చు. రైతులు తమ ఉత్పత్తులను కోసిన రోజే ఏదో ఒక ధరకు అమ్ముకోకుండా నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. రైతుల ఆదాయం పెరుగుతుంది. టోకు, చిల్లర వ్యాపారులతోపాటు విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులకు కూడా కృషి కవచ్ కవర్లు ఉపయోగపడతాయి''అని తెలిపారు. దీనిపై త్వరలో పేటెంట్ కోసం దరఖాస్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఐఐహెచ్ఆర్‌తో త్వరలో ఒప్పందం..

ఐఐహెచ్ఆర్, యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లోని గాంధీ కృషి విజ్ఞాన కేంద్రంలో 'కృషి కవచ్' టెక్నాలజీని పరీక్షించి చూశారని రామకృష్ణ తెలిపారు. ఈ టెక్నాలజీని ప్రజలకు అందించే క్రమంలో ఐఐహెచ్ఆర్‌తో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ టెక్నాలజీని ఐఐహెచ్ఆర్ అందిస్తుందని వెల్లడించారు.

వృథా అవుతున్న పండ్లు, కూరగాయలు:	ఈ నష్టం విలువ సుమారు:
25 & 30%	రూ.1,52,790 కోట్లు

- మన దేశంలో ఏటా 1,132 లక్షల టన్నుల పండ్లు, 2,146 లక్షల టన్నుల కూరగాయలు, 36 లక్షల టన్నుల పూలు ఉత్పత్తి అవుతున్నాయి.
- కూరగాయల్లో.. బంగాళదుంపలు 30–40%, టమాటాలు 5–47%, ఉల్లిపాయలు 25–40%, వెల్లుల్లి 8–22%, క్యాబేజీ, కాలీఫ్లవర్ 7–25%, మిరపకాయలు 4–35%, క్యారట్ 5–9% శీతల సదుపాయాల్లేక పాడైపోతున్నాయి.
- పండ్లలో.. ద్రాక్ష 27%, అరటి 20–28%, బత్తాయి, నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు 20–95%, యాపిల్స్ 14%, అవకాడోలు 43% దెబ్బతింటున్నాయి.

'కృషి కవచ్' పనిచేసేదిలా..




''సాధారణంగా పండ్లు, కూరగాయలను చెట్ల నుంచి కోసిన తర్వాత ఆక్సిడేటివ్ మెటబాలిజం ద్వారా వాటిలో మార్పులు జరుగుతాయి. సేంద్రియ పదార్థాలు విచ్ఛిన్నమవుతూ ఉంటాయి. శీతల ప్రదేశంలో ఉంచకపోతే ఈ ప్రక్రియ వేగంగా సాగి.. అవి వడలి, కుళ్లి పాడైపోతాయి. 'కృషి కవచ్'కవర్లలోకి ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్, ఇథైలిన్ వంటి వాయువులు కొంతమేర ఇటూ ఇటూ పారాడేందుకు వీలుంటుంది. ఇందులో నీటి ఆవిరి ఏర్పడదు. దీనితో ఆహార ఉత్పత్తులు సెకండరీ ప్యాకేజింగ్ అవసరం లేకుండానే 30 రోజుల వరకు తాజాగా ఉంటాయి. సూక్ష్మజీవులు, ఫంగస్‌లు కూడా ఆశించవు. ఈ కవర్లను తిరిగి వాడొచ్చు, కంపోస్టు చేయవచ్చు. 25–30శాతంగా ఉన్న ఉద్యాన ఉత్పత్తుల వృథాను అరికట్టడం ద్వారా గణనీయమైన ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రయోజనాలు చేకూరుతాయి. కృషి కవచ్ కవర్ల ద్వారా ఆహార వృథాను అరికట్టడంతోపాటు వ్యాల్యూ యాడెడ్ చర్యల ద్వారా దేశ జీడీపీని 3శాతం మేరకు పెంచుకోవచ్చు.

– డాక్టర్ ఎ.రామకృష్ణ, విశ్రాంత శాస్త్రవేత్త, 'కృషి కవచ్' ఆవిష్కర్త, మైసూరు

అనకాపల్లిలో 'అణు' విద్యుత్ ప్లాంట్!

2,800 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసేందుకు ఎన్టీపీసీ యోచన

- రెండువేల ఎకరాల భూమిని కేటాయించాలంటూ ప్రభుత్వానికి లేఖ
- దేశవ్యాప్తంగా 23 ప్రాంతాల్లో న్యూక్లియర్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- తెలుగు రాష్ట్రాల్లో చెరొకటి ఏర్పాటు చేసే అవకాశం
- భయాందోళనలో జిల్లా ప్రజలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లాలో అణు విద్యుత్ ప్లాంటు (న్యూక్లియర్ పవర్ ప్లాంటు) ఏర్పాటుచేయాలని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాలో దాదాపు రెండువేల ఎకరాల మేరకు భూమి కేటాయించాలంటూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలుస్తోంది. మొత్తం 2,800 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసే ఈ అణు విద్యుత్ ప్లాంటు కోసం రెండువేల ఎకరాల మేర భూమి అవసరమవుతుందని ఎన్టీపీసీ భావిస్తోంది. ఇందుకోసం అనకాపల్లి జిల్లా అనువైనదిగా గుర్తించిన ఎన్టీపీసీ.. ఈ ప్లాంటు ఏర్పాటుకు రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. మరోవైపు.. ఈ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకోసం రోజుకు మూడు బిలియన్ గ్యాలన్ల నీరు అవసరమవుతుంది. కానీ, ఈ అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుపై ఇప్పటికే అనేక అనుమానాలున్నాయి. ఎందుకంటే.. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ వద్ద న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఏర్పాటుచేస్తున్న అణు విద్యుత్ ప్లాంటుపై ఇప్పటికే అనేక పోరాటాలు జరుగుతున్నాయి. ఈ ప్లాంటు ఏర్పాటువల్ల తమకు ఆరోగ్య సమస్యలు వస్తాయంటూ ప్లాంటు ఏర్పాటును స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో అనకాపల్లి జిల్లాలో ఎన్టీపీసీ తలపెట్టిన అణు విద్యుత్ ప్లాంటుపై జిల్లా ప్రజల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో చెరొకటి..

వాస్తవానికి.. దేశవ్యాప్తంగా 30 గిగావాట్ల (30 వేల మెగావాట్లు) సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలని ఎన్టీపీసీ నిర్ణయించుకుంది. 'ఎన్టీపీసీ పరమాణు ఉర్జ నిగమ్' అనే సంస్థను ఇందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. దేశవ్యాప్తంగా 23 ప్రాంతాలు అనువైనవిగా గుర్తించింది. రోజురోజుకీ బొగ్గు లభ్యత తగ్గిపోవడంతో పాటు సోలార్, విండ్ నుంచి కచ్చితంగా ఇంత మొత్తం విద్యుత్ వచ్చే అవకాశముందని చెప్పే వీల్లేకపోవడంతో దేశ విద్యుత్ అవసరాలను తీర్చేందుకుగానూ అణు విద్యుత్ వైపు ఎన్టీపీసీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఒక్కొక్కటి 700 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు ప్లాంట్లు ఏర్పాటుచేసేందుకు అవకాశముందని ఎన్టీపీసీ తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పక్కనున్న తెలంగాణలో కూడా ఒక అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుచేయాలని ఎన్టీపీసీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ప్లాంటు ఏర్పాటుకు అనువైన ప్రాంతం ఏదీ అనే విషయంపై మాత్రం ఇంకా స్పష్టతరాలేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. అణు విద్యుత్ ప్లాంట్‌కు భారీగా నీటి లభ్యత అవసరం ఉంటుందని.. ఈ అవసరాలను పోలవరం ద్వారా తీర్చుకునే వెసులుబాటు ఉందని కూడా ఎన్టీపీసీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

అణు ధార్మికత ముప్పుపై జిల్లా ప్రజల్లో ఆందోళన..

ఇక అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై మొదటి నుంచీ ఆందోళన ఉంది. ఈ ప్లాంటు ఏర్పాటైతే తమ భూములను కోల్పోవడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తి, ప్రాణాలకు ముప్పు తప్పదన్న అభిప్రాయాలున్నాయి. దీన్నుంచి వచ్చే అణు ధార్మికతవల్ల ప్రధానంగా క్యాన్సర్‌తో పాటు ఎక్యూట్ రేడియేషన్ సిండ్రోమ్, ఎనీమియా వంటి జబ్బులతో ప్రాణాల మీదకు వస్తుందన్న భయాందోళనలు ఉన్నాయి. మరోవైపు.. 1986లో ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్‌లో జరిగిన సంఘటనతో పాటు 2011 జపాన్‌లో జరిగిన అణు విద్యుత్ ప్లాంటు దుర్ఘటనలవల్ల చోటుచేసుకున్న నష్టాన్ని ప్రజలు గుర్తు తెచ్చుకుంటున్నారు.

పడిపోతున్న సిబిల్!

- ఈఎంఐలు చెల్లించలేక వినియోగదారుల అవస్థలు
- భవిష్యత్తులో నగదు సహిత రుణాలకూ ఇబ్బందులు
- ఆర్థిక నియంత్రణ లేకపోతే భవిష్యత్ కష్టమంటున్న నిపుణులు



సాక్షి, పుట్టపర్తి: ఎవరైనా వ్యక్తి ఆర్థిక చరిత్రకు అద్దం పట్టేది క్రెడిట్ స్కోరు. ఇక్కడ తీసుకున్న లోన్లు.. చెల్లింపుల తీరు.. క్రెడిట్ కార్డుల వినియోగం.. అప్పుల కోసం ఎన్ని సార్లు ప్రయత్నించారు. గతంలో ఏమైనా లోన్లు ఎగ్గొట్టారా.. ఇప్పటికీ ఈఎంఐ కడుతున్నారా.. ఇలా అన్ని విషయాలు తెలుసుకోవచ్చు. ఈ క్రెడిట్ రిపోర్టుతో వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణ ఏపాటిదో సులువుగా తెలుసుకోవచ్చు. ఆర్థిక నియంత్రణ క్రమశిక్షణ లేకపోవడం కారణంగా చాలామంది చిరుద్యోగులు, చిరు వ్యాపారులు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

అప్పు చేసి విలాసాలు..

పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా మారింది ప్రస్తుతం మధ్య తరగతి ప్రజల పరిస్థితి. తమ చుట్టుపక్కల వారు ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే తమ ఇంట్లోనే ఉండాలనే ఆకాంక్ష తప్పు కాదు. అయితే ఇందు కోసం అప్పు చేసి ఆ తర్వాత రుణాలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి లేని తలనొప్పులు తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి లావాదేవీల విషయంగానే సిబిల్ స్కోరు పడిపోయి.. భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణాలు పొందే సదుపాయాన్ని కోల్పోతున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. మధ్య తరగతి ప్రజల అవసరాలను తెలివిగా ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఆఫర్ల పేరుతో రుణాల ఎర వేసి ఆకట్టుకుంటున్నారు. అయితే రుణం తీసుకునే సమయంలో సరైన ప్లానింగ్ లేకపోవడంతో నెలవారీ కంతులు చెల్లించడంలో జాప్యం చోటు చేసుకుని భారీగా నష్టపోతున్నారు. ఆర్థిక క్రమశిక్షణ, అవగాహన లేకుంటే ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పెరిగిపోతున్న డిఫాల్టర్లు..

జిల్లా వ్యాప్తంగా రకరకాల ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించలేని స్థితిలో చాలా మంది డిఫాల్టర్లుగా మారిపోతున్నారు. ఇటీవల వీరి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మొబైల్ ఫోన్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఫర్నీచర్లు... తదితరాలను కొనుగోలు చేసిన వారే ఎక్కువ మంది డిఫాల్టర్లుగా మారినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా సిబిల్ స్కోరు 650 దాటితే ఏవైనా రుణాలొస్తాయి. కానీ తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించకపోవడంతో ప్రతి పది మందిలో ఇద్దరు డిఫాల్టర్లుగా మారుతున్నారు.

సున్నా వడ్డీతో ఆకర్షిస్తూ..

పలు ఫైనాన్స్ కంపెనీలు జీరో ప్రాసెసింగ్, సున్నా వడ్డీ అంటూ ఇచ్చే ప్రకటనలతో చాలామంది వినియోగదారులు మోసపోతున్నారు. ఎలాంటి వడ్డీ లేకుండా, ప్రాసెసింగ్ ఫీజు లేకుండా వస్తువుకు డబ్బు కట్టి, పది నెలలు మనతో రీపేమెంట్ ఎందుకు చేసుకుంటాయనే లోగుట్టును చాలా మంది అర్థం చేసుకోలేకపోతున్నారు.

'ఈహెచ్ఎస్‌లో నగదు రహిత చికిత్స అందించాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు వందశాతం నగదు రహిత ఈహెచ్ఎస్ సేవలందించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. స్విమ్స్ వంటి ప్రభుత్వ అనుబంధ వైద్యశాలల్లోనే ఎంఆర్ఐ స్కానింగ్ తదితర పరీక్షలకు నగదు చెల్లించాలని కరాఖండిగా చెబుతున్నారన్నారు. ఉపాధ్యాయుల నుంచి నెలవారీ మినహాయింపులు జరుగుతున్నా..ఉచిత వైద్య సేవలందడం లేదని చెప్పారు. దంత, కంటి జబ్బులకు చెందిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను అనుమతించేలా చూడాలని కోరారు.

'ఈఈఎఫ్ఐ' జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా లకనం రాజు



సాక్షి, అమరావతి: ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా లకనం రాజు ఎన్నికయ్యారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారి ఎల్.రాజు శుక్రవారం 'సాక్షి'కి వెల్లడించిన వివరాల ప్రకారం..ఈఈఎఫ్ఐ 10వ జాతీయ మహాసభ ఈ నెల 10 నుంచి 12 వరకు కేరళ రాజధాని తిరువనంతపురంలో 3 రోజుల పాటు జరిగింది. దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, ట్రాన్స్ కో, జెన్ కో, డిస్కంలు, ఏపీ నుంచి 22 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త పోరాటాలకు సంసిద్ధం కావాలని మహాసభ తీర్మానించింది. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అదాని స్మార్ట్ మీటర్ల విధానానికి ప్రత్యామ్నాయంగా కేరళ ప్రభుత్వం స్వీయ ఆధ్వర్యంలోనే స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడం పట్ల మహాసభ హర్షం వ్యక్తం చేసింది.

యువత మార్కెట్ సోషల్ మీడియా

కొత్త బట్టలు కొనాలన్నా... లేటెస్ట్ గాడ్జెట్ కావాలన్నా... టీవీలు, ఫ్రిడ్జ్‌లు వంటి గృహోపకరణాలు తీసుకోవాలనుకున్నా.. ఇంటీరియర్ డిజైనింగ్.. ఆటోమొబైల్స్.. ఆభరణాలు.. ఇలా మార్కెట్‌లోకి వచ్చిన కొత్త ట్రెండ్స్ తెలుసుకునేందుకు సోషల్ మీడియా వేదికలను ఆశ్రయిస్తున్నామని యువత ముక్తకంఠంతో చెబుతోంది. హాలిడే ట్రిప్స్‌ను ప్లాన్ చేసేందుకు సైతం సోషల్ మీడియాలోనే అన్వేషిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వస్తు వినియోగ మార్కెట్‌ను సోషల్ మీడియా శాసిస్తోంది. అంతర్జాతీయ మార్కెటింగ్ కన్సల్టెన్సీ స్ప్రౌట్ సోషల్ ఇండెక్స్ తాజా నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. – సాక్షి, అమరావతి

- **1** – కొత్త ఫ్యాషన్లు, మార్కెట్ ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు యువత ఆధారపడే వాటిలో సోషల్ మీడియా స్థానం
- **90 శాతం** – కొత్త ఫ్యాషన్లు, మార్కెట్ ఆవిష్కరణల గురించి తెలుసుకునే విషయంలో సోషల్ మీడియాను నమ్మేవారు
- **81 శాతం** – సోషల్ మీడియా ప్రభావంతో తక్షణం స్పందించి వస్తువులు కొనుగోలు చేస్తున్నవారు



యువత అభిరుచులను ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా ఫస్ట్
రెండో స్థానంలో స్నేహితులు, కుటుంబ సభ్యులు
మూడు, నాలుగు స్థానాల్లో టీవీలు, డిజిటల్ మీడియా
స్ప్రౌట్స్ సోషల్ ఇండెక్స్ నివేదికలో వెల్లడి

- కొత్త ఫ్యాషన్లు, మార్కెట్ ఆవిష్కరణలను గురించి తెలుసుకునేందుకు యువత ఆధారపడేవాటిలో సోషల్ మీడియా మొదటి స్థానంలో ఉంది. ఏకంగా 90శాతం మంది యువత సోషల్ మీడియాను విశ్వసిస్తున్నారు.
- స్నేహితులు, కుటుంబ సభ్యులను సంప్రదించడం అనేది రెండో స్థానంలో ఉంది. 68శాతం మంది స్నేహితులు, కుటుంబ సభ్యులను సంప్రదిస్తున్నారు.
- టీవీ చానళ్లు మూడో స్థానంలో ఉన్నాయి. 60శాతం మంది యువత టీవీ చానళ్లలో ప్రకటనలను పరిశీలిస్తున్నారు.
- నాలుగో స్థానంలో డిజిటల్ మీడియా ఉంది. 54శాతం మంది డిజిటల్ మీడియా ద్వారా మార్కెటింగ్ ట్రెండ్స్ తెలుసుకుంటున్నారు.
- పాడ్ కాస్ట్ ప్రసారాలను 35శాతం మంది విశ్వసిస్తున్నారు.
- 23శాతం మంది పత్రికలను ఆశ్రయిస్తున్నారు.
- సోషల్ మీడియా ప్రభావంతో తక్షణం స్పందించి నచ్చినవి కొనుగోలు చేస్తున్నామని ఏకంగా 81శాతం మంది చెప్పారు.
- కనీసం నెలకు ఒకసారి అయినా సోషల్ మీడియా తమ కొనుగోలు అభిరుచులను నిర్దేశిస్తోందని 28శాతం మంది తెలిపారు.
- ఇక ఏదైనా బ్రాండ్ గురించి సోషల్ మీడియాలో లేకపోతే తాము ప్రత్యామ్నాయ బ్రాండ్ల పట్ల మొగ్గుచూపుతున్నట్లు 78శాతంమంది వెల్లడించారు.
- సోషల్ మీడియా ద్వారా వస్తువుల కొనుగోలుకు పలు కారణాలను కూడా యూజర్లు వెల్లడించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ప్రదర్శించే వివిధ కంపెనీల ఉత్పత్తుల నాణ్యత, వినియోగదారులకు అందించే సేవల పట్ల సంతృప్తి కారణంగా వస్తువులు కొనుగోలు చేస్తున్నామని 63శాతం మంది తెలిపారు.

కిందా పైనా మేమే.. మీ సంగతి తేలుస్తాం..

- సోషల్ మీడియా యాక్టివిస్టుకు టీడీపీ కార్యకర్త బెదిరింపు

మార్కాపురం: సీఎం మాట్లాడిన సాధారణ పోస్టు పెట్టినందుకే టీడీపీ కార్యకర్త ఒకరు ఓ సోషల్ మీడియా యాక్టివిస్టుపై రెచ్చిపోయి.. 'టీడీపీపై వ్యతిరేక పోస్టులు పెడితే నీ సంగతి చూస్తా.. కిందా పైనా మేమే ఉన్నాం' అంటూ ఫోన్‌లో బెదిరించారు. ఈ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా మార్కాపురం వచ్చిన సీఎం చంద్రబాబు టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 'సోషల్ మీడియాలో అవతలి వారికంటే మనం చాలా తక్కువగా ఉన్నాం. నేను ఆ నంబర్లను చెప్పడం లేదు. ఆ లవ్‌లెటర్ మీ ఎమ్మెల్యేకే ఇస్తా' అని అన్నారు. మార్కాపురం నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు ఈ వీడియోను పోస్టు చేశారు. అది చూసిన మార్కాపురం మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త ఒకరు ఆయనకు ఫోన్ చేసి, తీవ్ర స్థాయిలో బెదిరిస్తూ మాట్లాడారు. 'మా గురించి నువ్వేమనుకుంటున్నావ్.. నువ్వింకోసారి పోస్టు పెట్టు.. మేమేంటో చూపిస్తాం' అంటూ బెదిరించారు. 'మేమెక్కడా పద్ధతి తప్పి ప్రవర్తించడం లేదు.. అన్నా.. అన్నా..' అంటూ సోషల్ మీడియా యాక్టివిస్టు చెప్పినా.. టీడీపీ కార్యకర్త మరింతగా రెచ్చిపోయి మాట్లాడారు. ఎంతలో ఉండాలో.. అంతలోనే ఉండండి అంటూ హెచ్చరించారు. అధికారంలో లేనప్పుడే మేము భయపడలేదు.. ఇప్పుడెందుకు భయపడతాంరా.. అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

కల్తీ కల్లు సరఫరా.. ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

రాయచూరు రూరల్: కల్తీ కల్లు సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖాధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఇందిరా నగర్‌కు చెందిన ఖాజా, మంగళవారపేటకు చెందిన కరియప్పల నుంచి 30 లీటర్ల కల్తీ కల్లును స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ సస్పెండ్‌కు డిమాండ్


వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: లింగసూగూరు తహసీల్దార్ శంశాలంను సస్పెండ్ చేయాలని దళిత సంఘర్ష సమితి సంచాలకుడు ప్రభులింగ డిమాండ్ చేశారు. శుక్రవారం లింగసూగూరు ఏసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. కచేరిలో రూ.2 కోట్ల గోల్‌మాల్ విషయంలో తహసీల్దార్–2 వెంకటేష్‌ను సస్పెండ్ చేశారన్నారు. ప్రధానంగా శంశాలంను సస్పెండ్ చేసి పూర్వాపరాలపై దర్యాప్తు చేయాలన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించి నిధులను స్వార్థానికి వాడుకున్న తహసీల్దార్‌పై విచారణ జరపాలన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని అర్చకులకు చెల్లించాల్సిన డబ్బులు, ప్రకృతి వైపరీత్య పరిహార నిధులను నకిలీ బిల్లులు సృష్టించి రూ.1.87 కోట్ల మేర ఇతర ఖాతాల్లోకి జమ చేసుకున్న అంశంపై విచారణలో వెల్లడైందన్నారు. తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ ఏసీ బసవణ్ణప్పకు వినతిపత్రం అందించారు.

బావిలో పడి వ్యక్తి మృతి


సతీష్(ఫైల్)

రాయచూరు రూరల్: నీరు తెచ్చేందుకు బావి దగ్గరకు వెళ్లిన ఓ కూలీ కార్మికుడు అందులో పడి మృతి చెందాడు. బీదర్ జిల్లా హులసూరు తాలూకా మదనాళ గ్రామానికి చెందిన సతీష్(40) అనే వ్యక్తి పొలం పనులు చేసుకుంటూ పక్కనే ఉన్న బావిలో మంచి నీరు తెచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి ఈత రాకపోవడంతో మరణించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై హులసూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న రంగస్వామి శెట్టి

రాయచూరు రూరల్: రాయచూరు జిల్లాలో మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖాధికారి రంగస్వామి శెట్టి వెల్లడించారు. శుక్రవారం తాలూకా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఏడు తాలూకాల్లో మొత్తం 97 కేంద్రాల్లో 33,906 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతారన్నారు. దేవదుర్గ తాలూకాలోని 15 కేంద్రాల్లో 4,660, లింగసూగూరు తాలూకాలోని 18 కేంద్రాల్లో 6,746, మాన్వి తాలూకాలోని 18 కేంద్రాల్లో 6,331, రాయచూరు తాలూకాలోని 27 కేంద్రాల్లో 9,912, సింధనూరు తాలూకాలోని 19 కేంద్రాల్లో 6,257 మంది విద్యార్థులున్నారని వివరించారు.

యోగి నారాయణ ఆదర్శాలు అనుసరణీయం


నారాయణ చిత్రపటానికి పూజ చేసిన దృశ్యం

బళ్లారిటౌన్: ప్రపంచానికే ఉత్తమ సందేశాన్ని చాటిన యోగి నారాయణ యతీంద్ర ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అలవరుచుకొని సన్మార్గంలో పయనించాలని పాలికె మేయర్ ముల్లంగి నందీష్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సంస్కృతి శాఖ, పాలికె ఆధ్వర్యంలో నగరంలోని వడ్డరబండ బలిజ భవనంలో ఏర్పాటు చేసిన యోగినారాయణ యతీంద్ర కైవార తాతయ్య జయంతిని ప్రారంభించి మాట్లాడారు. దీన, దళిత, శోషిత వర్గాల అభివృద్ధికి కుల, మత, గోత్ర, వర్ణ బేధాలు లేకుండా శ్రమించారన్నారు. సత్యం విద్యా సంస్థ లెక్చరర్ ఆలం బాషా తదితరులు మాట్లాడారు. బలిజ సంఘం జిల్లాధ్యక్షుడు ఎస్ మురళీ కృష్ణ, కన్నడ సంస్కృతి శాఖ ఏడీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.


హొసపేటెలో హోలీ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు


రాయచూరులో కామదహనం చేస్తున్న దృశ్యం


బళ్లారిలో హోలీ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

అంబరం.. హోలీ సంబరం

- సంస్కృతి వారసత్వాలకు ప్రతీకగా రంగుల కేళి
- ఆనందోత్సాహాలతో పిల్లలు, పెద్దలు, మహిళలు కేరింతలు

సాక్షి,బళ్లారి: మన సంస్కృతి వారసత్వాలకు ప్రతీకగా నిలుస్తోన్న ఎన్నో పండుగల్లో హోలీ కూడా అంతే ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రతి ఏటా ఫాల్గుణ మాస పౌర్ణమి రోజున జరుపుకునే హోలీ పండుగను ఈ ఏడాది కూడా సంప్రదాయబద్ధంగా తమ తమ ఇళ్లలో పౌర్ణమి పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం హోలీ పండుగ నేపథ్యంలో నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా రంగులు చల్లుకుని ఆనందోత్సాహాలతో హోలీ పండుగను ఆచరించుకున్నారు. నగరంలో యువత కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుని ఒకరికొకరు హ్యాపీ హోలీ అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు చేసుకున్నారు. యువత, పెద్దలు అనే తేడా లేకుండా రంగులు చల్లుకుని హోలీ పండుగ గొప్పదనాన్ని తెలియజేస్తూ పండగను ఆచరించారు. రంగులు చల్లుకుని హోలీ సంబరాలు నిర్వహించిన తరుణంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో పలు ప్రముఖ కాలనీల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించి హోలీ పండగ చేసుకుని, రంగులు చల్లుకునే వ్యక్తులపై నిఘా ఉంచారు. హోలీ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో మహిళా పోలీసులతో పాటు బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతియుతంగా పండుగను జరుపుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

సంతోషంగా రంగుల హోలీ ఆడిన ప్రజలు

రాయచూరు రూరల్ : జిల్లాలో రంగుల హోలీ కేళి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. నగరంలోని బెస్తవారపేట ఉప్పార సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కామదహనం చేశారు. ప్రజలు హోలీ పాటలు పాడుతూ రంగులు చల్లుకుంటుండటం కన్పించింది. భంగికుంటలో కుండ బద్దలు కొట్టారు. హోలీ సందర్భంగా రాయచూరులో పోలీసులు హైఅలర్ట్‌తో రంజాన్ రెండో శుక్రవారం హోలీ పండుగ రావడంతో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అదనపు జిల్లా ఎస్పీ హరీష్ పర్యవేక్షణ జరిపారు.

విజయనగరలో ఘనంగా హోలీ

హొసపేటె: హోలీ పండుగ సంబరాలను శుక్రవారం నగర ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకొన్నారు. నగరంలోని అమరావతి, పటేల్‌నగర్, బసవేశ్వర కాలనీ, రాజీవ్ నగర్, చిత్తవాడిగి, నెహ్రూ కాలనీ, రాణిపేట, మృత్యుంజయ నగర్, చలువాది నగర్, టీబీ డ్యాం తదితర ప్రాంతాల్లో యువతీ యువకులు, విద్యార్థులు, పెద్దలు, పిల్లలు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకొన్నారు.


రంగుల హోలీ సంబరాల్లో బళ్లారి నగర ప్రజలు


రాయచూరులో రంగులు పూసుకున్న యువకులు


పరస్పరం రంగులు పూసుకుంటున్న మహిళలు


రాయచూరులో హోలీ ఆడుతున్న పిల్లలు, మహిళలు


రాయచూరులో ఉట్టి బద్దలు కొడుతున్న యువకులు

రమణీయంగా తేరు ఉత్సవాలు


ప్రసన్న వేంకటరమణస్వామి రథోత్సవం


గుట్టె లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకాలో పలు చోట్ల రథోత్సవాలు ఘనంగా జరిగాయి. తూబగెరెలోని పురాతన ప్రసిద్ధ శ్రీ ప్రసన్న లక్ష్మీ వేంకటరమణస్వామి రథోత్సవం శుక్రవారం అభిజిత్ లగ్నంలో వైభవంగా జరిగింది. అంతకుముందు మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. తాలూకా నుండే కాకుండా చిక్కబళ్లాపురం, కోలారు, బెంగళూరు జిల్లాల నుంచి వందలాదిగా భక్తులు తరలి వచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఇదే తాలూకాలోని కామేనహళ్లిలో వెలసిన గుట్టె లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం కూడా శుక్రవారం ఎంతో ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. దాతలు భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

హుబ్లీ: విద్యుత్ స్తంభాన్ని ఎక్కి మరమ్మతు చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతి చెందిన ఘటన ధార్వాడ సమీపంలోని నుగ్గికేరి వద్ద గురువారం వెలుగు చూసింది. మృతుడిని తాలూకాలోని హెబ్బళ్లి గ్రామానికి చెందిన సంజు బసవరాజ్ అంగడి(24)గా గుర్తించారు. నుగ్గికేరి గ్రామ సరిహద్దులోని కబ్బడి లేఅవుట్‌లో విద్యుత్ మరమ్మతు పని కోసం సంజు స్తంభాన్ని ఎక్కాడు. ఆ సమయంలో ఆకస్మికంగా విద్యుదాఘాతానికి గురై అతడు తీవ్రంగా గాయపడ్డాడు. తక్షణమే కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం దక్కక కొన్ని గంటల్లోనే మృత్యువాత పడ్డాడు. విద్యుత్ కాంట్రాక్టర్ సలీం బుడాన్ సాబ్, అతడి సహాయకుడు ఫక్రుద్దీన్ బాబూసాబ్‌లపై ధార్వాడ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఆ స్టేషన్ ఎస్‌ఐ బసనగౌడ తెలిపారు.

16న చేనేత వధూవరుల ముఖాముఖి

బళ్లారిటౌన్: విశ్వ వివాహ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న నగరంలోని పద్మశాలి కళ్యాణ మంటపంలో ఉదయం 10 గంటల నుంచి సమస్త చేనేత వర్గాల సముదాయ వధూవరుల ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టినట్లు కార్యక్రమ నిర్వాహకుడు రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత వర్గ సముదాయాలైన దేవాంగ, పద్మశాలి, కురిహినశెట్టి, తొగటవీర క్షత్రియ, పట్టశాలి, తోకులశాలి, హటగార, శివాచార, శెట్టిగర, జెడర, కొష్టి, శివసమసాలి, సైగుంద సమాజాలు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

నిరంతర ప్రయత్నమే విజయానికి సోపానం

హుబ్లీ: చేసే పనిలో శ్రద్ధ, నిష్ఠ, నైతిక విలువలు, నిరంతర ప్రయత్నంతో మాత్రమే విజయం లభిస్తుందని నగర డీసీపీ రవీశ్ సీఆర్ తెలిపారు. పాత హుబ్లీ కార్వార రోడ్డు ప్రకాష్ ట్యుటోరియల్స్ ఆవరణలో 2023–24లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆయన ప్రదానం చేసి మాట్లాడారు. రాయనాళ అభినవ రేవణ సిద్ధస్వామీజీ మాట్లాడుతూ సాధన అంటే సులభమైంది కాదు. పట్టుదల ఉంటే మాత్రమే ఆ మార్గంలో సాగడం సాధ్యమన్నారు. ఆశించిన ఫలితాలు సాధించాలంటే కఠోర శ్రమ అనే సాధన బాటలో సాగాలన్నారు. మెరిట్ విద్యార్థులకు ముఖ్యంగా 65 శాతం పైగా మార్కులు సాధించిన 35 మందిని ఘనంగా సన్మానించారు. ట్యుటోరియల్స్ ప్రిన్సిపాల్ నందకుమార్ పాటిల్, ఎస్‌ఐ సింధూర, హనుమంతప్ప, హమీద్, మంజునాథ్, భువనేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం.. నిందితుడు అరెస్టు

చెళ్లకెరె రూరల్ : మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచార యత్నం చేసిన ఘటనలో చిత్రదుర్గకు చెందిన సాదిక్ భాషాను పోలీసులు అరెస్టు చేశారు. ఇతను ఇదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికకు ఐస్‌క్రీం ఇప్పిస్తానని ఆశ చూపి తీసుకువెళ్లి అత్యాచారయత్నం చేశాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై చిత్రదుర్గ మహిళా పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది.

ఉప లోకాయుక్త ఆకస్మిక తనిఖీ


హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఉప లోకాయుక్త వీరప్ప


దాఖలాలను పరిశీలిస్తున్న ఉప లోకాయుక్త వీరప్ప

హొసపేటె: ఉప లోకాయుక్త బీ.వీరప్ప శుక్రవారం నగరంలో వివిధ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. అక్రమ కార్యకలాపాల నేపథ్యంలో ఉప లోకాయుక్త పర్యటన జరిగింది. ఉప లోకాయుక్త నగరంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అదే విధంగా కౌంటర్‌లో రోగులకు అందిస్తున్న మందులను పరిశీలించారు. ఆస్పత్రి పాలనా విభాగం, అంబులెన్స్ వాహన డ్రైవర్లు తమ వేతనాలకు మించి అధికంగా ఫోన్‌పే వాడటంపై మండిపడ్డారు. ఈ విషయంపై డాటాను అందించాలని సూచించారు. అనంతరం నగరసభ కార్యాలయాన్ని సందర్శించి హాజరును పరిశీలించారు. నగర నడిబొట్టున ఉన్న ఉప కాలువను పరిశీలించి ఇది ఉప కాలువా? లేక మరుగుదొడ్డా? అని అధికారి మనోహర్‌ను క్లాస్ పీకారు. కాలువలోకి మరుగుదొడ్డి నీరు ప్రవహిస్తుండటాన్ని చూసి మండిపడ్డారు. కాలువలోకి మరుగుదొడ్డి నీరు ప్రవహించకుండా వెంటనే చర్యలు చేపట్టాలని నగరసభ అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం, మహిళా శిశు అభివృద్ధి కార్యాలయం, ఆర్‌టీఓ, హుడా, మైనింగ్ అండ్ జూవాలజీ, కార్మిక తదితర కార్యాలయాలతో పాటు విద్యార్థుల హాస్టళ్లను ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఏపీఎంసీ మార్కెట్ పరిశీలన

నగరంలోని ఏపీఎంసీ మార్కెట్‌ను ఉపలోకాయుక్త బీ.వీరప్ప శుక్రవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రైతులకు పరిశుభ్రత, తాగునీరుతో పాటు విశ్రాంతి తీసుకోవడానికి సరైన వ్యవస్థ లేదన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏపీఎంసీ కార్యదర్శి సిద్దయ్య స్వామిని ఆదేశించారు. ఓ దళారీ దుకాణంలో తూకంలో అధికంగా రెండు కిలోలు ఉన్న విషయాన్ని గ్రహించి వెంటనే దుకాణ యజమానికి క్లాస్ తీసుకొన్నారు. ప్రజలను ఇలా మోసం చేస్తున్నా అధికారులు కళ్లు మూసుకొని కూర్చొన్నారా? అని ప్రశ్నించారు. సంబంధిత అధికారికి నోటీసులు అందజేశారు.

ఉపలోకాయుక్తకు 183 ప్రజాఫిర్యాదులు

నగరంలోని సహకార సంక్షేమ మందిరంలో ఉప లోకాయుక్త పర్యటన మొదటి రోజున జరిగిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో మొత్తం 183 ఫిర్యాదులు వచ్చాయని ఉప లోకాయుక్త బీ.వీరప్ప తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అత్యధికంగా జెడ్పీకి 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖకు 40, మున్సిపల్ కౌన్సిల్, మున్సిపాలిటీ, పట్టణ పంచాయతీకి 41, జెస్కాం శాఖకు 6, గ్రామీణ తాగునీటి సరఫరాకు 5, ఆరోగ్య శాఖకు 3, కేఎస్‌ఆర్టీసీ 2, కార్మిక శాఖకు 3, పోలీస్ శాఖకు 3, విద్యా శాఖకు 4, మహిళ శిశు సంక్షేమ శాఖకు 2, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు 2, సర్వే శాఖకు 2 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో పీడబ్ల్యూడీ, ఆర్‌టీసీ, వాణిజ్య పన్నుల శాఖ, మొరార్జీ దేశాయి స్కూల్, హౌసింగ్ బోర్డు, అర్బన్ డ్రైనేజీ, ఎక్సైజ్ శాఖలకు ఒక్కొక్క దరఖాస్తు అందిందన్నారు. ఉప లోకాయుక్త తనిఖీ తర్వాత 10 కేసులు అక్కడికక్కడే పరిష్కరించారు. కేవలం ఒక నెలలోనే దాదాపు 40 కేసులను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కేఎస్‌ఆర్టీసీ నుంచి అమరావతి నగరానికి బస్సు కనెక్టివిటీని త్వరగా అందించాలన్నారు. నగరంలోని మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ దగ్గర గుట్కా, పొగాకు, మద్యం, మాంసం అమ్మకాలు జరగకుండా చూసుకోవాలని డీహెచ్‌ఓ డాక్టర్ శంకర్ నాయక్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు ఆదేశించారు.

‘నేతలు కార్పొరేట్ సంస్థల బానిసలు’


ప్రతిజ్ఞ చేస్తున్న ప్రముఖులు

బళ్లారి అర్బన్: దేశంలో రైతులు, కార్మికులు తదితర వర్గాల ప్రజలు ఎంతో కష్టంతో కనీస వసతులతో జీవిస్తుండగా, రైతులు సాగు కోసం పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని కర్ణాటక దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్. మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బీడీఏఏ మీటింగ్ హాల్‌లో శుక్రవారం జనతా ప్రణాళిక అనే వినూత్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం కడు భారంగా మారడంతో అప్పులు పాలైన అన్నదాతలు వాటిని తీర్చే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతన్నల రుణాలను రద్దు చేయని పాలకులు కార్పొరేట్ సంస్థల లక్షల కొద్ది రుణాలను రద్దు చేస్తున్నారని, దీన్ని గమనిస్తే ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల ఆధిపత్యంలో ఊడిగం చేస్తూ వారికి కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. గత 9 ఏళ్ల నుంచి సుమారు రూ.16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందంటూ ఆ సర్కారు తీరును ఎండగట్టారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆందోళనకారులు సమస్యలతో పాటు వాటి పరిష్కారాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజకీయ నాయకులకు సమస్య పరిష్కారం తెలిసినా కూడా దాని పరిష్కారానికి కృషి చేయరని, ఎందుకంటే సమస్య పరిష్కారం అయితే ప్రజలు తమ వద్దకు రాకుండా పోతారని నేతలకు బాగా తెలుసన్నారు. ఇలాంటి రాజకీయ నాయకులు, పార్టీలకు ప్రత్యామ్నాయంగా తృతీయ శక్తిని ఏర్పాటు చేసే గురుతర బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ ఏర్పాటు అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఎన్‌డీ వెంకమ్మ, న్యాయవాది, జిల్లాధ్యక్షుడు మునిస్వామి, ప్రముఖులు శ్రీనివాస్ బండారి, మల్లికార్జున, ఎన్‌కే.గంగాధర, బైలూరు మల్లికార్జున, రైతు సంఘం జిల్లాధ్యక్షుడు వివి గౌడ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. దొడ్డబసవేశ్వర రథోత్సవం


దొడ్డబసవేశ్వర స్వామికి పూలతో అలంకరణ


కురుగోడులో వెలసిన దొడ్డ బసవేశ్వర స్వామి మహారథోత్సవంలో పాల్గొన్న అశేష భక్త జనవాహిని

బళ్లారి అర్బన్: జిల్లాలోని కురుగోడు తాలూకాలో పురాతనమైన, చారిత్రాత్మక దొడ్డ బసవేశ్వర స్వామి మహారథోత్సవం శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు భక్తుల సమక్షంలో కన్నుల పండువగా జరిగింది. కోరిన వారి కోర్కెలు తీర్చే కొంగుబంగారం దొడ్డ బసవేశ్వర స్వామి అన్న ప్రగాఢ నమ్మకం మేరకు ఆనవాయితీగా భక్తులు దర్శించుకుంటున్నారు. ఆలయంలోని దొడ్డబసవేశ్వర స్వామి 14 అడుగుల ఎత్తైన నంది విగ్రహానికి అభిషేకం, అలంకరణ, ధార్మిక పూజలను నిర్వహించారు. 60 అడుగుల ఎత్తైన రాజగోపురానికి ఉత్తరం వైపు ఉన్న మరో గోపురానికి విద్యుత్ అలంకరణలతో ఆకట్టుకొనేలా ఏర్పాట్లు చేశారు. కురుగోడు చుట్టు పక్కల 30 గ్రామాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. జిల్లాతో పాటు రాష్ట్రంలోని భక్తాదులు బసవేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మహారథాన్ని ఆలయం వద్ద నుంచి బళ్లారి రోడ్డు వైపు ఎదురు బసవణ్ణ వరకు భక్తులు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. మహారథోత్సవంలో కంప్లి ఎమ్మెల్యే గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ జాతర మహోత్సవంతో వారం రోజుల పాటు కురుగోడు పట్టణంలో భక్తుల సందడి నెలకొంటుంది.

రెప్పపాటులో రూ.7 లక్షలు చోరీ

రాయచూరు రూరల్: దొంగలు రెప్పపాటులో రూ.7 లక్షలు చోరీ చేసిన ఘటన శుక్రవారం రాయచూరు జిల్లాలోని దేవదుర్గ తాలూకా గబ్బూరు గ్రామంలో జరిగింది. రైతు శ్రీనివాసరావు బ్యాంక్‌లో డబ్బులు విత్ డ్రా చేసి బ్యాగులో పెట్టుకొని పండ్లు కొనుగోలు చేయడానికి వెళ్లారు. పసిగట్టిన దుండగులు ద్విచక్ర వాహనంలో ఉన్న నగదును చోరీ చేసుకొని పరారయ్యారు. పక్కనే ఉన్న సీసీ కెమెరాల్లో దుండగులు పరారైన దృశ్యాలు నమోదయ్యాయి. గబ్బూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపునకు ప్రతిపాదనలు


మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 సంవత్సరాలకు పెంపుపై ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు రాయచూరు జిల్లా ఇంచార్జి మంత్రి, వైద్య విద్యా శాఖ మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బెంగళూరులో జయదేవ హృద్రోగ ఆస్పత్రిలో వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ వైద్యులను గుర్తించి వారి సేవలను మరింతగా వినియోగించుకోవడానికి ముఖ్యమంత్రితో చర్చించి సంజీవిని పథకం కింద వైద్యులను భర్తీ చేస్తామన్నారు. జయదేవ్ ఆస్పత్రిలో రోబోటిక్ ఆపరేషన్లు చేయడానికి నిధులు కేటాయించి, చిన్నారుల గుండె ఆపరేషన్లకు ఐదు చోట్ల ఆపరేషన్ థియేటర్లను, పరిశోధన కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

రేపు జగ్గలిగి పండుగ

హుబ్లీ: భారతీయ సంప్రదాయపు ప్రధాన పండుగ హోలీ సందర్భంగా హుబ్బళ్లి జగ్గలిగి పండుగ–2025ను మూరుసావిర మఠం మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా జగ్గలిగి పండుగను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని సమాజాల వారు దీనికి సహకారం అందిస్తున్నారన్నారు. మూరుసావిర మఠాధిపతి గురుసిద్ధ రాజయోగీంద్ర స్వామీజీతో పాటు పలువురు మఠాధిపతులు ఈ కార్యక్రమానికి సాన్నిధ్యం వహిస్తారన్నారు. 350 జగ్గలిగి బృందాలు, వివిధ చర్మ వాయిద్య నాదాలతో పాటు డోలు, కీలుబొమ్మలతో 45 మంది కళాకారుల బృందం, మహిళలు శోభయాత్రలో పాల్గొంటారన్నారు. ప్రదర్శన మూరుసావిర మఠం నుంచి బండారి రోడ్డు తుళజా భవాని సర్కిల్, కొత్త మేదార ఓణి, శివాజీ చౌక్, దుర్గద బైలు, బెళగావి గల్లి, పెండార గల్లి, దాజిబానపేట మార్గం మీదుగా తిరిగి మూరుసావిర మఠానికి చేరుకుంటుందన్నారు. మూరుసావిర మఠాధిపతి మాట్లాడుతూ పౌరాణిక విషయాలను గుర్తు చేసే సమగ్ర, దేశ శ్రేష్ఠమైన పండుగ ఇదన్నారు. చర్మ వాయిద్యాలతో వెలువడే సంగీత ప్రదర్శనే ఈ పండుగ ఉద్దేశం అన్నారు. జానపద కళలను ప్రోత్సహించే సదుద్దేశంతో జగ్గలిగి పండుగను అందరూ ప్రోత్సహించాలన్నారు. మేయర్ రామన్న బడిగేర, ప్రముఖులు అశోక్ కాట్వే, లింగరాజ పాటిల్, రాజు కాళె, మంజునాథ, జగదీశ్, రవినాయక పాల్గొన్నారు.

స్త్రీలకూ సమాన హక్కులు


జ్యోతి వెలిగిస్తున్న జడ్జి స్వాతిక్

రాయచూరు రూరల్: సదృఢ సమాజ నిర్మాణానికి పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానమని జిల్లా అదనపు జడ్జి, న్యాయ సేవా ప్రాధికార సభ్యుడు హెచ్.స్వాతిక్ పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పారవాడి వేంకటేశ్వర ఆలయంలో న్యాయ సేవా ప్రాధికార, ఎస్‌సీపీబీ లా కళాశాల, మహిళా శిశు కళ్యాణ శక్తి క్లబ్, ఉప్పార మహిళా ఘటక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి మాట్లాడారు. మహిళల హక్కులు, విధులు, సమానత్వం, విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవా ప్రాధికార కార్యదర్శి మృత్యుంజయ, కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకురాలు ఉమ, ఉప్పార మహిళా ఘటక అధ్యక్షురాలు మాలతిలున్నారు.